జిల్లాలో అవినీతి, అక్రమాలు, అవకతవకలకు కేరాఫ్‌గా రెవెన్యూ శాఖ నిలుస్తోంది. అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంపాదనే లక్ష్యంగా అడ్డగోలుగా పనిచేస్తున్నారు. నిబంధనలను పక్కన పెట్టి అడ్డగోలు పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఏకంగా ప్రభుత్వ భూములను రాసిచ్చేస్తున్నారు. ఎక్కడ అక్రమాలు బయటపడతాయోనని రికార్డులను తారుమారు చేస్తున్నారు. ఒకపక్క ఏసీబీ దాడులు చేస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నా వారిలో ఎటువంటి మార్పూ రాకపోవడం గమనార్హం.

అవినీతికి రెవెన్యూ

మండలాల్లో అవకతవకలకే ప్రాధాన్యత... వివాదాల్లో చిక్కుకుంటున్న అధికారులు

- ఇప్పటికే ఇద్దరు తహసీల్దార్లు, ముగ్గురు ఉద్యోగులు సస్పెన్షన్
- మరొక ఉద్యోగి బదిలీ అయినా మార్పురాని పరిస్థితి
- ఆర్‌అండ్‌బీ స్థలానికి తప్పుడు ధ్రువీకరణ
- ఏకంగా రికార్డులే మాయమవుతున్న వైనం
- గత వైసీపీ అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో మరింత ఆందోళన



● ఒంగోలులోని మంగమూరురోడ్డులో 267 సర్వే నెంబరులోని 6.28 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలో వైసీపీ ముఖ్యనేత సొంతం చేసుకున్నారు. అసలు హక్కుదారులు ఎవరనే విషయం నిర్ధారించుకోకుండా అప్పటి ఒంగోలు తహసీల్దార్ నయీమ్ అహ్మద్ ఏకపక్షంగా మ్యుటేషన్ చేశారని శేష వెంకటకృష్ణకుమారి హైకోర్టును ఆశ్రయించారు. ఆయా రికార్డులను తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. అధికారులకు ఆ రికార్డులు కనిపించలేదు. దీనిపై ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న విచారణ చేసిన నివేదికను బుధవారం కలెక్టర్‌కు ఇచ్చినట్లు సమాచారం.



● ఆర్‌అండ్‌బీ స్థలానికి తప్పుడు ధ్రువీకరణ పత్రం మంజూరుచేసిన తహసీల్దార్ ఎ.బాలకిషోర్, వైపాలెం 2వ సచివాలయం గ్రామ రెవెన్యూ అధికారి ముటుకూరి ఎల్లయ్య, వైపాలెం నాల్గవ సచివాలయ సర్వేయర్ ఎ.దిలీప్‌కుమార్‌లను సస్పెండ్ చేస్తూ గత మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీచేశారు. వైపాలెంలోని 58/1 సర్వే నెంబరులోని స్థలానికి కొందరికి తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ వ్యవహారంపై పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా తహసీల్దార్‌తోపాటు మరో ఇద్దరు ఉద్యోగులపై వేటు వేశారు.

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులు ఇప్పుడు కూడా అదే పంథాను కొనసాగిస్తున్నారు. ఒకవైపు గతంలో జరిగిన భూఅక్రమాలు, 22(ఏ) కింద భూములు నిషేధం, ప్రభుత్వ భూములు అప్పనంగా ఇతరులకు ఆన్‌లైన్ చేయడం, ఒకరి భూమిని మరొకరికి ఆన్‌లైన్ వంటి పలు రకాల తప్పులతో జనం కొట్టుమిట్టాడుతున్నారు. అవేమీ పట్టించుకోకుండా ఇప్పుడు కూడా సంపాదనే లక్ష్యంగా పనులు చేస్తున్న పరిస్థితి ఉంది. జిల్లాలో ఎక్కడ ఏ సమావేశం జరిగినా రెవెన్యూ సమస్యలపైనే ప్రజాప్రతినిధులు, అధికారులకు కుప్పలు తెప్పలుగా అర్జీలు, ఫిర్యాదులు వస్తున్నాయి. గతంలో జరిగిన తప్పిదాలను సరి చేయాల్సిన ప్రస్తుత రెవెన్యూ యంత్రాంగం అవేమీ తమ వల్ల కాదని తెల్చిచెబుతుండటం గమనార్హం.

భారీగా భూ అక్రమాలు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో వేలాది ఎకరాలు కొల్లగొట్టగా ఇప్పటికే ఆ భూములపై విచారణలు జరుగుతోంది. కూటమి అధికారంలోకి వచ్చాక నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వేలాది అర్జీలు వచ్చాయి. అలా గత నెలలో ముగిసిన రెవెన్యూ సదస్సుల్లో 16వేలకుపైగా అర్జీలు రాగా రీసర్వే సమస్యలపై మరో 8,900 వరకు వచ్చాయి. ఆయా అంశాలపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టినా స్థానికంగా పనిచేసే రెవెన్యూ యంత్రాంగం మాత్రం వాటిని పరిష్కరించే దిశగా పనిచేయడం లేదు. కొద్ది మంది మాత్రమే బాధ్యతగా ఆయా సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఎక్కువశాతం మంది పాత వాటిని పక్కన పెట్టి కేవలం ముడుపుల కోసం అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు

కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామంలో వి.మాలకొండయ్య అనే వ్యక్తికి ఉన్న 30

మిగతా 6లో...

30 ఏళ్లకు ముక్తి

కొప్పోలురోడ్డులో ఆక్రమణల తొలగింపు
రంగంలోకి దిగిన ఒంగోలు నగర పాలక సంస్థ
ప్రధాన డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.2 కోట్లు మంజూరు

7



కరవదిలో సర్వేను పరిశీలిస్తున్న సీపీవో వెంకటేశ్వర్లు

నిరుపేదలకు ఆసరానే లక్ష్యం..

పీ4 సర్వే చేపట్టిన ప్రభుత్వం

- సచివాలయం యూనిట్‌గా సేకరణ
- రెండ్రోజులుగా జిల్లాలో కార్యక్రమం
- వచ్చేనెల 2 వరకు నిర్వహణ
- అట్టడుగున ఉండే 20 శాతం కుటుంబాల లబ్ధిపై ప్రభుత్వం దృష్టి

ఒంగోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అత్యంత నిరుపేదలకు సంపన్నవర్గాలు ఆసరాగా నిలిచేలా చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేపట్టింది. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టిసిపేషన్(పీ4) పేరుతో ఇంటింటి సర్వేను రెండు రోజులుగా జిల్లాలో చేస్తున్నారు. సమాజంలో అట్టడుగువర్గాల ఆర్థికాభివృద్ధికి అత్యున్నత సంపన్నలు ఆసరాగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అందుకు అనేక వర్గాలవారు ముందుకు వస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పక్కా సర్వే నిర్వహించి అత్యంత నిరుపేదల గుర్తింపునకు ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా పీ4 పేరుతో చేపట్టిన ఈ సర్వే ఈనెల 20 నుంచి ప్రారంభం కాగా అందుకు పది రోజుల ముందు పైలట్‌గా నాలుగు జిల్లాల్లో ఒక్కొక్క గ్రామంలో

మిగతా 6లో...

పోలీసు హెల్ప్ డెస్క్‌లు

పరీక్షల విషయంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. గ్రూపు-2 పరీక్షల కోసం ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ వద్ద హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నాం. అభ్యర్థులు ఏదైనా ఇబ్బందుల కారణంగా కొంత ఆలస్యంగా వస్తే అటువంటివారిని సకాలంలో కేంద్రాల వద్దకు తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకున్నాం. కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాల ఏర్పాటుతోపాటు సమీపంలో ఉండే జెరాక్స్ సెంటర్లను మూసి వేయిస్తాం. ఇంటర్, పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. -ఏఆర్ దామోదర్, ఎస్పీ

పకడ్బందీగా..

- గ్రూపు2- పరీక్షలకు సర్వం సిద్ధం
- జిల్లాలో అన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే డీబార్
- ఇంటర్, టెన్త్ పరీక్షలకు అన్ని చర్యలు
- నిర్వహణ కోసం కంట్రోలు రూములు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరిగే గ్రూపు-2, ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివారం జరిగే గ్రూపు-2 మెయిన్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఏడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలు రెండు సెషన్లలో జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం సెషన్ 10.30 నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాలకు అభ్యర్థులు గంటన్నర ముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్ష ప్రారంభమయ్యే పావుగంట ముందుగానే గేట్లు మూతవేస్తారని తెలిపారు. అందువల్ల అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు హాజరుకావాలన్నారు. మొత్తం 4,543 మంది అభ్యర్థులు హాజరుకానుండటంతో జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టరేట్‌లో కంట్రోలు రూమును కూడా ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే డీబార్ చేస్తామని హెచ్చరించారు. పరీక్ష ప్రారంభం నుంచి ముగిసేంత వరకు అభ్యర్థులు హాలులోనే ఉండాలన్నారు. పరీక్ష పేపర్ లీకైందంటూ తప్పుడు ప్రచారం చేస్తే అటువంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

1 నుంచి ఇంటర్ పరీక్షలు

మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియేట్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 21,624 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,850 మంది కలిపి 42,439 మంది హాజరుకానున్నారని తెలిపారు. అందుకోసం 67 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలను సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు లైజనింగ్ అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. మరోవైపు రాష్ట్ర కార్యాలయం నుంచి ఇద్దరు అధికారులు పరిశీలకులుగా జిల్లాకు రానున్నారని తెలిపారు. పరీక్ష హాలులో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాల కల్పనతో పరీక్షా కేంద్రాల వద్ద మెడికల్ టీంలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. మార్చి 17వతేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు కూడా ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. జిల్లా వ్యాప్తంగా 29,602 మంది పరీక్షలు రాయనుండటంతో అందుకోసం 183 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఒకేషనల్ ఇంటర్ విద్యార్థులకు మార్చి 3 నుంచి, పదవ తరగతి విద్యార్థులకు 17 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. పరీక్షల నిర్వహణ కోసం ఆయా శాఖల అధికారుల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా పక్కన ఎస్పీ దామోదర్, జేసీ గోపాలకృష్ణ

జిల్లాకు సిసోడియా

నేడు ఫ్రీహోల్డ్, రీ సర్వే అర్జీలపై సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (సీసీఎల్‌ఏ) ఆర్‌పీ సిసోడియా శుక్రవారం రాత్రి ఒంగోలు వచ్చారు. చిత్తూరు, నెల్లూరు జిల్లాల పర్యటన ముగించుకొని జిల్లాకు వచ్చిన సిసోడియా స్థానిక కేబీ హోటల్‌లో రాత్రికి బస చేశారు. సిసోడియాకు అధికారులు స్వాగతం పలికారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ భూఅక్రమాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. అందులోభాగంగా రాష్ట్రవ్యాప్తంగా సీసీఎల్‌ఏ సిసోడియా జిల్లాలలో పర్యటిస్తూ అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలతోపాటు రీసర్వే జరుగుతున్న తీరు, భూములకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడుతున్నారు. శనివారం ఉదయం పదిన్నర గంటలకు కలెక్టర్ సమావేశపు హాలులో సబ్‌కలెక్టర్, జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. సమావేశంలో తహసీల్దార్లకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు. సమావేశం అనంతరం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.



సిసోడియాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

పొదుపు మహిళలకు వీవోఏ కుచ్చుటోపీ

జిల్లాలో మరో 'పొదుపు' అక్రమం బయటపడింది. కూలీ నాలీ చేసి పైసాపైసా కూడబెట్టి రుణం చెల్లించే మహిళలకు ఓ వీవోఏ కుచ్చుటోపీ పెట్టింది. నెలనెలా సభ్యులు ఇచ్చిన డబ్బులను బ్యాంకుకు చెల్లించకుండా దాదాపు రూ.22 లక్షలు స్వాహా చేసిన విషయం వెలుగులోకొచ్చింది. మోసాన్ని తెలుసుకున్న బాధిత మహిళలు నిలదీయడంతో చస్తానని వీవోఏ బెదిరింపులకు దిగింది. ఈ ఘటన సింగరాయకొండ మండలంలోని బింగినపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. తమకు న్యాయం చేయాలని ఏపీఎంకు వినతిపత్రం ఇచ్చారు.

- బ్యాంకుకు చెల్లించాల్సిన నగదు సభ్యుల నుంచి వసూలు
- రుణానికి జమ చేయకుండా రూ. 22 లక్షలు స్వాహా
- బాధితులు నిలదీయడంతో చస్తానని బెదిరింపులు
- న్యాయం చేయాలని వేడుకొంటున్న బింగినపల్లి మహిళలు



ఫిర్యాదు చేయడానికి వెలుగు కార్యాలయం వద్ద నిలుచున్న పొదుపు మహిళలు

సింగరాయకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బింగినపల్లికి చెందిన జి.ఈశ్వరి పొదుపు సంఘాల్లో వీవోఏగా పనిచేస్తోంది. ఆ గ్రామానికి చెందిన మహి గ్రూపు పొదుపు సంఘం ప్రథమ లీడర్‌గా కూడా ఉంది. 2023 జూన్‌లో మహి గ్రూపు సభ్యులు రూ.20 లక్షల రుణాన్ని బ్యాంకు నుంచి తీసుకొన్నారు. ఆ తరువాత ప్రతినెలా చెల్లించాల్సిన నగదును గ్రూపు సభ్యుల నుంచి ఈశ్వరి వసూలు చేస్తోంది. ఇలా 5 నెలలు మాత్రమే బ్యాంకులో జమచేసింది. 18 నెలలు బ్యాంకులో చెల్లించాల్సిన రూ.12 లక్షలను గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేసి చెల్లించకుండా స్వాహా చేసింది. గ్రూపు సభ్యులకు తెలియకుండా స్త్రీనిధి పేరుతో మరో రూ.2.50 లక్షలు తీసుకొంది. అదే గ్రామానికి చెందిన గంగమ్మ పొదుపు గ్రూపునకు ఈశ్వరి చిన్న అత్త ప్రభావతి లీడర్‌గా వ్యవరిస్తోంది. ఆమెకు చదువులేకపోవడంతో నెలనెలా బ్యాంకులో చెల్లించాల్సిన రుణం తాలుకా నగదును తాను చెల్లిస్తానని ఈశ్వరి తీసుకొనేది. అలా తీసుకొన్న రూ.7.5 లక్షలు బ్యాంకులో చెల్లించకుండా నొక్కేసింది. ఇటీవల వెలుగు కార్యాలయంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకు అధికారులు ఏపీవో భాగ్యలక్ష్మికి సమస్యను వివరించారు. మహి, గంగమ్మ గ్రూపు సభ్యులు రుణాలు చెల్లించడం లేదని చెప్పారు. దీంతో గ్రూపు లీడర్లను ఏపీవో ఆరా తీయగా తాము నెలనెలా చెల్లిస్తున్నామని తెలిపారు. ఆ తరువాత తన దగ్గర నగదు వసూలు చేస్తోన్న ఈశ్వరిని గ్రూపు సభ్యులు ప్రశ్నించారు. దీంతో ఆమె తాను నెలనెలా చెల్లిస్తున్నానని, బ్యాంకులో కట్టాల్సిన నగదుకు తానకేమీ సంబంధం లేదని బుకాయించింది. బాధిత మహిళలు ఈశ్వరి ఇంటికి వెళ్లి గట్టిగా నిలదీస్తే చస్తానని బెదిరించింది. దీంతో శుక్రవారం బాధిత మహిళలు సింగరాయకొండ వెలుగు కార్యాలయానికి వెళ్లి తమకు జరిగిన మోసంపై ఏపీవో భాగ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నారు. 18 నెలల నుంచి నగదు చెల్లించని విషయాన్ని గ్రూపు సభ్యుల దృష్టికి వెలుగు కార్యాలయం సిబ్బంది ఎందుకు తీసుకురాలేదనేది చర్చనీయాంశమైంది. వైసీపీ ప్రభుత్వం హయాం నుంచి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కొంతమంది సిబ్బంది కూడా వీవోఏ ఈశ్వరితో లాలూచీ పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గోల్డెన్ గ్రానైట్ క్వారీ లీజు రద్దు

● హైకోర్టు సింగిల్‌జడ్జి తీర్పు

చీమకుర్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎల్‌పురం పరిధిలోని సర్వే నంబర్ 55/6లో ఉన్న గోల్డెన్ గ్రానైట్ క్వారీ లీజును రద్దు చేస్తూ శుక్రవారం హైకోర్టు సింగిల్ జడ్జి మన్మథరావు తీర్పు వెలువరించారు. క్వారీ లీజు గడువు ముగియటంతో 2022 సంవత్సరంలో రెన్యువల్ కోసం దరఖాస్తు చేయగా, నాటి మైన్స్ ఎండీ వెంకటరెడ్డి అనుమతులు మంజూరు చేశారు. ఈ అనుమతులను మంజూరు అక్రమం అని, రద్దు చేయాలని కోరుతూ 2022లోనే దిగుమర్తి సురేష్‌బాబు అనే కర్నూలుకు చెందిన గ్రానైట్ వ్యాపారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇతనే 2014లో గోల్డెన్ క్వారీ లీజుపై కూడా పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులను పరిగణనలోకి తీసుకొని విచారణ జరిపిన కోర్టు పిటిషనర్ చేసిన వాదనలతో ఏకీభవిస్తూ రెన్యువల్ చేసిన లీజును రద్దు చేస్తూ తీర్పు ఇచ్చారు. ప్రభుత్వానికి రూ.123కోట్లు బకాయి ఉన్నపుడు, నిబంధనలు మేరకు లీజు రెన్యువల్ చేయకూడదని, అదేవిధంగా ఎన్‌వోసీ ప్రాపర్‌గా లేదని, నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ కార్యకలాపాలు చేసినపుడు రెన్యువల్‌కి అనుమతి ఇవ్వకూడదని, కానీ నిబంధనలను పక్కనపెట్టి మైన్స్ ఎండీ వెంకటరెడ్డి అనుమతులు మంజూరు చేశారని, గోల్డెన్ గ్రానైట్ క్వారీకి అధికారులు మంజూరు చేసిన లీజును రద్దు చేయాలని పిటిషన్‌లో సురేష్‌బాబు పేర్కొన్నారు. కాగా సింగిల్‌జడ్జి తీర్పు కాపీ అందగానే అప్పీల్‌కు వెళ్లే యోచనలో క్వారీ ఓనర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆటో

● భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్ర జ్యోతి): మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొనటంతో భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు అయ్యాయి. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని రామాయపాలెంకు చెందిన గాలి ఏసన్న భార్య, కుమార్తెతో కలిసి మోటార్‌సైకిల్ పై గురువారం రాత్రి అద్దంకి వస్తుండగా గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో దర్శి వైపు నుంచి అద్దంకి వస్తున్న ఫోర్ వీల్ ట్రాలీ ఆటో వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. శుక్రవారం ఏసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :వేటపాలెం మండల పరిధిలోని జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఎడ్ల బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండి యజమానికి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన మొగిలి కోటేశ్వరరావు ఎద్దుల బండితో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా చీరాల - వేటపాలెం మధ్యగల జాతీయ రహదారిలో ప్రమాదం జరిగింది. అలాగే బండి కూడా ధ్వంసమైంది. దీంతో స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

22న తలపెట్టిన ధర్నా వాయిదా : ఏపీటీఎఫ్

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ ఈనెల 22న తలపెట్టిన ధర్నా తాత్కాలింగా వాయిదా వేశారు. ఆయా సమస్యలపై శుక్రవారం సాయంత్రం ఏపీటీఎఫ్ నాయకులు ఒంగోలులో డీఈవో కిరణ్‌కుమార్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కొన్ని సమస్యలు పరిష్కరించగా, మరి కొన్ని కాలపరిమితితో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని డీఈవో హామీ ఇచ్చారు. దీంతో ఈనెల 22న డీఈవో కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాను వాయిదా వేసినట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కె.తిరుమల, పి.హనుమంతరావు, ఎస్‌కే.ఖాదర్‌బాషా, యోహాన్‌రెడ్డి, కె.రవి, బి.రఘుబాబు, జె.విజయసారధి, పి.సుబ్బారావు, పీబీ.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



డీఈవోతో సమావేశమైన నాయకులు

నిరుపేదలకు ఆసరానే లక్ష్యంగా..

(5వపేజీ తరువాయి)

సర్వే చేశారు. అందులో జిల్లాలోని దొనకొండ మండలం కొచ్చర్లకోట ఉంది. ఆ గ్రామంలో మొత్తం 1,547 హౌస్‌హోల్డ్‌లు ఉండగా వలసలు, మృతుల కారణంగా 199 కుటుంబాల వివరాలు అందలేదు. మిగిలిన 1,348 కుటుంబాలను సర్వే చేశారు. వారిలో 241 కుటుంబాలు అత్యంత నిరుపేదలుగా గుర్తించారు. ఆ జాబితాను గ్రామంలో కూడా ప్రచురించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలలో చేపట్టారు.

సర్వే కోసం ప్రత్యేక యాప్

ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న జిల్లాలు మినహాయించి మిగిలిన పది జిల్లాల్లో తొలిదశగా చేపట్టారు. ఈనెల 20 నుంచి మార్చి 2 వరకు నిర్వహించే ఈ సర్వేలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఉన్న కుటుంబాల సంఖ్య ఆధారంగా సర్వే చేస్తున్నారు. అలా ప్రస్తుతం జిల్లాలో 5,89,361 కుటుంబాలు ఉండగా సచివాలయం యూనిట్‌గా ఆ సిబ్బందితో సర్వే ప్రారంభించారు. సర్వే కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించగా 27 అంశాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారు. కుటుంబంలో సంపాదనపరులు ఎంత మంది, సొంత ఇల్లా లేక అద్దెదా, గ్యాస్ ఉందా, విద్యుత్ బిల్లు ఎంత వస్తుంది, వాహనాలు ఉన్నాయా, ఉంటే ఏ తరహా ఇతరత్రా అంశాలు అందులో ఉన్నాయి. ఉగాది నుంచి ప్రారంభించే యోచన

మొత్తం సర్వే పూర్తయ్యాక దిగువ నుంచి 20శాతం మందిని నిరుపేదలుగా గుర్తించి ఆ కుటుంబాల వివరాలను గ్రామాల్లో ప్రచురిస్తారు. అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తారు. అనంతరం సంపన్నుల నుంచి ఆయా కుటుంబాలకు అవసరమైన సహకారం అందేలా ప్రభుత్వం చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ తరహా సహాయ కార్యక్రమాలను ఉగాది నుంచి ప్రారంభించే యోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉండటంతో ప్రభుత్వ ఆదేశాలతో ప్రణాళిక, గణాంకశాఖ పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. మండలాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది సర్వే చేస్తున్నారు. సర్వే జరుగుతున్న తీరును ఒంగోలు రూరల్ మండలం కరవదిలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. సర్వే వల్ల పేదవర్గాలకు ఎలాంటి నష్టం ఉండదని, వారికి వచ్చే ఏ పథకాలు తొలగించరని సీపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంకా అదనంగా ప్రభుత్వం ద్వారా సహాయం అందే అవకాశం ఉందన్నారు. ప్రజలంతా సహకరించి సర్వే బృందాలకు వివరాలు అందజేయాలని కోరారు.

అవినీతికి రె'వెన్యూ'

(5వపేజీ తరువాయి)

ఎకరాలను వారి వారసులు భూ పంపకాలు చేసుకున్నారు. ఆ ప్రకారం పాస్‌పుస్తకాలు మంజూరు కోసం అర్జీ పెట్టుకున్నారు. అయితే మహిళా వీఆర్వో, తహసీల్దార్ కారుడ్రైవర్ పని పూర్తిచేయాలంటే రూ.2.5లక్షలు డిమాండ్ చేశారు. రూ.2.5లక్షలు ఇవ్వాలంటూ వీఆర్వో, తహసీల్దార్ బేరం పెట్టినట్లు ఆ భూయజమాని కుమారుల్లో ఒకరు తహసీల్దార్ కారుడ్రైవర్‌తో జరిపిన సంభాషణ రికార్డు చేశారు. రెండు నెలల తర్వాత ఆ రికార్డును రెవెన్యూ సదస్సు నిర్వహణలో భాగంగా పునుగోడు వచ్చిన కలెక్టర్, ఎమ్మెల్యేల సమక్షంలో వినిపించారు. దీంతో తహసీల్దార్ లంచాల భాగోతం బయటపడింది. కీలకంగా వ్యవహరించిన మహిళా వీఆర్వో, తహసీల్దార్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

భారీగా అవకతవకలతో చర్యలు

కనిగిరి మండలంలో రైతులకు సంబంధించిన భూములను మ్యుటేషన్ చేసేందుకు రూ.లక్షల్లో డిమాండ్ చేయడంతో ఆ భూయజమాని రెవెన్యూ సదస్సులో కలెక్టర్ అన్సారియా దృష్టికి తెచ్చారు. సెల్‌ఫోన్‌లో వాయిస్ రికార్డును వినిపించడంతో అసలు విషయం బహిర్గతమైంది. ఆ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించిన కలెక్టర్ విచారణ నివేదిక ఆధారంగా కనిగిరి తహసీల్దార్‌తోపాటు ఈ వ్యవహారంలో కీలకంగా ఉన్న మహిళా వీఆర్వోని సస్పెండ్ చేశారు. మరొక ఉద్యోగిని అక్కడి నుంచి బదిలీ చేశారు. తాజాగా యర్రగొండపాలెంలో ఆర్‌అండ్‌బీకి చెందిన ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పనంగా ఆన్‌లైన్ చేసిన ఘటనలో అక్కడి తహ సీల్దార్‌తోపాటు మరో ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. గతేడాది పట్టాదార్ పాసుపుస్తకం కోసం లంచం తీసుకుంటూ వైపాలెం వీఆర్వో ఏసీబీకి చిక్కారు. అలా అనేక మండలాల్లో నిరంతరం రెవెన్యూ యంత్రాంగం చేస్తున్న అక్రమాలు వెలుగులోకి వస్తున్నా వారిలో మార్పు కనిపించడం లేదు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలో అధికార యంత్రాంగం నిర్వహించే మీ కోసం(గ్రీవెన్స్)లో కూడా రెవెన్యూకు సంబంధించిన అంశాలే అధికంగా ఫిర్యాదులు వస్తున్నారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వెలుగులోకి ఒక్కొక్కటిగా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే అప్పట్లో అక్రమాలకు పాల్పడిన అధికారులు ప్రస్తుతం ఎన్ని విచారణలు జరిగినా తమకేమీ కాదన్నట్లుగా ధీమాగా ఉన్నారు. కొన్ని మండలాల్లో అయితే భూముల రికార్డులను కూడా గల్లంతు చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా ఒంగోలు తహసీల్దార్ కార్యాలయంలో తాజాగా కోట్ల విలువైన భూమికి సంబ ంధించిన రికార్డు గల్లంతుకావడంతో విచారణ కూడా చేపట్టారు. కాగా చిన్నచిన్న సమస్యలను కూడా మండల స్థాయిలో పరిష్కారించని కారణంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి ఆయా సమస్యలు వస్తున్నాయి. చివరకు ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాలను కూడా పట్టించుకోని పరిస్థితి కనిపిస్తోంది. ఆ పరిస్థితి ఎందుకు వస్తుందో పరిశీలన చేసుకొని ముందుకు సాగాల్సిన యంత్రాంగం అవేమి పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

అద్దంకిలో మార్పు ఆరంభం

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విజువల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి రోజు సాయంత్రం సిబ్బంది రోడ్డుపై విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టడంతో మార్పు కనిపిస్తోంది. సాధారణంగా సీఐ స్థాయి అధికారి సర్కిల్ కార్యాలయంలో కూర్చోని ఉండటమో లేక రోడ్డుపై కి వచ్చిన తనిఖీలకు పరిమితం కావటమో చేస్తుంటారు. కానీ అద్దంకి టౌన్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజు మాత్రం అందుకు భిన్నంగా అనునిత్యం పర్యవేక్షణ చేయటం తో పాటు ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా ముందు తాను ఉంటుండటంతో సిబ్బంది కూడా పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అద్దంకి పట్టణంలో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణలో కొంతమేర మార్పు కనిపిస్తోంది.

గతంలో అద్దంకిలో మూడు సంవత్సరాల పాటు ఎస్సైగా పనిచేసిన అనుభవానికి తోడు మార్పు తీసుకురావాలన్నా చిత్తశుద్ధితో సీఐ గా బాధ్యతలు చేపట్టిన నెల రోజులలో అద్దంకి పట్టణంలో తనదైన రీతి లో మార్పునకు ఆరాధ్యుల సుబ్బరాజు శ్రీకారం చుట్టారు. జనవరి 16 వ తేదీ అద్దంకి టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాజు ప్రధానంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణ పై దృష్టి సారించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేయకుండా ఉండే విధంగా, ట్రాలీ ఆటోలలో కూలీలను తరలించకుండా చేసేందుకు ప్రతి రోజు తనిఖీలు చేయించారు. ఆయా ప్రాంతాలలో తనిఖీలు చేసి కూలీలకు కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతాలుగా ఉన్న భవానిసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, బంగ్లా రోడ్డు, రామ్‌నగర్‌ల వద్ద ఉదయం, సాయంత్రం రద్దీ సమయాలలో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను పనిచేసేలా మరమ్మతులు చేయించారు. నామ్ రోడ్డు వెంబడి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు వివరించటం, ట్రాఫిక్ నియంత్రించేందుకు, పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను గమనిస్తూ వాహన చోదకులకు తగు సూచనలు చేసేందుకు మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌కు ప్రధాన అడ్డంకిగా ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులకు ముందస్తుగానే తగు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితులలో సైడ్ డ్రైన్‌లు దాటి రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేయరాదని హెచ్చరించారు. దీంతో రోడ్డు ఒకింత విశాలంగా మారింది. గతంలో అద్దంకి పట్టణంలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు కొంత తగ్గుముఖం పట్టాయి. మార్పు గమనించిన పలువురు ప్రజలు శెభాష్ పోలీస్ అంటున్నారు.



అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్న సీఐ సుబ్బరాజు



ఆటోలలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

బ్యాంకుల విలీనాలతో కుదేలు

● నిరసనలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విలీనాలతో బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్నదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ చీరాల ప్రతినిధులు అన్నారు. శుక్రవారం విధులు ముగిశాక అన్ని బ్యాంకుల ప్రతినిధులు స్టేట్ బ్యాంకు ప్రాంగణానికి చేరుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా నూతన రిక్రూట్‌మెంట్‌లు లేక పాత వారితోనే పని చేయిస్తూ పని భారాన్ని పెంచుతున్నారని వాపోయారు. మారుతున్న ఆధునీకరణలో భాగంగా ఉద్యోగులకు పని భారం పెరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలుగా కేటాయించాలన్నారు. ఐడీబీఐ విలీనం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మార్చి 24, 25 తేదీలలో దేశ వ్యాప్తంగా విధులు బహిష్కరించి ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు దీవెన బాబు, కిషోర్ బాబు, నెహ్రూ, చైతన్య, ఆంజనేయులు, బ్రహ్మయ్య, దాసు, శ్రీనివాసరావు, పైడయ్య, ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి

అవీఇవీ

● మంత్రి డాక్టర్ స్వామికి వినతి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అసోసియేషన్ సభ్యులు

సింగరాయకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని కోరారు. శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఆయన స్వగృహంలో కలిసి ఆ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేసి త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరారు. మంత్రి స్వామిని కలిసిన వారిలో అసోసియేసన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు జీవీ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనిపించని యువకుడు

జరుగుమల్లి, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): పైడిపాడు గ్రామానికి చెందిన బత్తిన అశోక్ గురువారం ఉదయం ఇంటి నుంచి హెయిర్ కటింగ్ చేయించుకుని వస్తానని తన మోటార్ సైకిల్‌పై వెళ్లి ఎంతకూ తిరిగి రాకపోవడంతో అశోక్ తల్లి లక్ష్మీకాంతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జరుగుమల్లి పోలీసులు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు.

గ్రూపు-2 పరీక్షల్లో రోస్టర్ విధానం సరిచేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్ పరీక్షల్లో రోస్టర్ విధానం సరిచేసిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె.వీరారెడ్డి డిమాండ్ చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ సంవత్సరాలు గడుస్తున్నా నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గ్రూపు-2 పరీక్షల నిర్వహణపై నిన్నా మొన్నటి వరకు కోర్టులో ఉందని చెప్తూ వచ్చిన ప్రభుత్వం, ఇప్పుడు హడావుడిగా పరీక్షలు నిర్వహించడం దారుణంగా ఉందని విమర్శించారు. రోస్టర్ విధానంలో అనేక తప్పిదాలు ఉన్నాయని న్యాయస్థానం ప్రకటించినా అవేమి పట్టించుకోకుండా పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. అందువల్ల వెంటనే రోస్టర్ విధానాన్ని సరిచేసి తర్వాత పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుద్యోగ యువత పోరాటానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బాషా, సలోమాన్, విజయరాజ్, సంపత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు ఉద్యోగులను తొలగించే విధానాలు తగవు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చిరు ఉద్యోగులను తొలగించే విధానాలను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమావేశానికి టి.విజయం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎనిమిది నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం వెంటనే చిరు ఉద్యోగులను తొలగించేందుకు కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగానే ఆప్కాస్‌ను రద్దు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విధానాన్ని రద్దు చేయకపోతే మరోసారి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్, టి.విజయమ్మ, కె.శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, వై.రవి, ఎం.బాబు, బి.దివ్య, తిరుపతమ్మ, కె.రమేష్, వెంకయ్య, బాబు, మధు, సంతోషమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెంలో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడిన దొంగలను ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అక్కల గోపిరెడ్డి, కావూరి గోపిరెడ్డిలు గ్రామంలోని పొలాల్లో ఉన్న ఐదు విద్యుత్ మోటార్‌లను చోరీచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. అలాగే చోరీ జరిగిన మోటార్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

ముప్పై ఏళ్లకు ముక్తి


స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకుంటున్న కొందరు

కొప్పోలురోడ్డులో ఆక్రమణల తొలగింపు

- రంగంలోకి దిగిన ఒంగోలు నగర పాలక సంస్థ
- వర్షం కురిసిన ప్రతిసారీ మురుగుతో నరకమే
- ప్రధాన డ్రెయిన్ నిర్మాణ పనులకు రూ.2 కోట్లు మంజూరు
- పట్టీపట్టనట్లుగా ఆర్‌అండ్‌బీ శాఖ


ఆక్రమణలను తొలగించడంతో విశాలంగా కొప్పోలు రోడ్డు

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పరిధిలోని కొప్పోలు రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు ఎట్టకేలకు మోక్షం లభించింది. గత 30 ఏళ్లుగా పరిష్కారానికి నోచుకొని మురుగుపారుదల లేమి సమస్యపై శుక్రవారం కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు రంగంలోకి దిగి ఆక్రమణలను తొలగించారు. ఆ ప్రాంతంలో మురుగు నీటి పారుదల వ్యవస్థ మెరుగు కోసం చేపట్టిన పనుల్లో భాగంగా రూ.2కోట్లతో మెయిన్ డ్రెయిన్ పనులు త్వరలోనే చేపట్టనున్నారు.

కదలని ఆర్‌అండ్‌బీ అధికారులు

కొప్పోలు రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ పరిధిలోనిది ఉండడం, కాలనీలకు కేటాయించిన స్థలాలు రెవెన్యూ పరిధిలో ఉండడంతో రెండు శాఖల అధికారులు సమన్వయంతో ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఇంత జరుగుతున్నా ఎక్కడి వరకు రోడ్డు ఉంది అనేది ఆర్‌అండ్‌బీ అధికారులు తెలపలేదు. అలాగే ఇంటి స్థలాలు మంజూరు ఎంతమేర కేటాయించారో నిర్ధారించాల్సి ఉంది. కార్పొరేషన్ అధికారులు ఆక్రమణ తొలగింపు పనులు చేపడుతుండగా, తహసీల్దార్ వాసు అక్కడకు చేరుకుని పనులు పరిశీలించారు. కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరించారు. వారి సమక్షంలో జరగాల్సిన ఆక్రమణల తొలగింపుల పనుల్లో ఆ శాఖకు చెందిన అధికారులు మొఖం చాటేయడంతో కార్పొరేషన్‌కు కొంత ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలు ఎంతవరకు తొలగించాలో అర్థం కాని పరిస్థితి ఎదురైంది. ఇదిలా ఉండగా మూడు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు కమిషనరు వెంకటేశ్వరరావు, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుధాకర్, టౌన్ ప్లానింగ్ అధికారులు పర్యవేక్షించారు.

ముఖ్యంగా ఇక్కడే...

ప్రధానంగా కొప్పోలురోడ్డులోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్టుకాలనీ, ఎన్టీఆర్ కాలనీల సమీపంలో కొందరు రోడ్డును ఆక్రమించి కొన్ని తాత్కాలిక, మరికొన్ని శాశ్వత కట్టడాలు నిర్మించారు. తొలగించాలని గతంలో కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా, వారు కదలేదు. దీంతో ముందస్తుగా నోటీసులు అందజేసిన అధికారులు వాటిని తొలగించారు.

మురుగునీరు చిందడం.. జారిపడడం షరామామూలే

ప్రధానంగా కొప్పోలురోడ్డులోని ఇందిరమ్మ కాలనీ, జర్నలిస్టుకాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లో రోడ్లు నిర్మించినా సైడు కాలువలు లేకపోవడంతో కొన్నేళ్లుగా పెద్ద సమస్యగా మారింది. వర్షం కురిసిన ప్రతిసారీ రోడ్డు ఆద్యంతం మురుగునీరు రోడ్డుపైనే రోజుల తరబడి నిల్వ ఉంటుంది. వాహనాలు వెళ్లినప్పుడల్లా ఆనీరు చింది పైన పడడం, అందులో ప్రమాదవశాత్తు జారిపడడం ఏటా జరుగుతూనే ఉంటుంది. అంతేగాక ఆయా కాలనీల్లోని అంతర్గత మురుగునీరు కూడా బయటకు వెళ్లే మార్గంలేక ఎక్కడికక్కడే నిల్వ ఉంటూ దుర్గంధం వ్యాపిస్తుంటుంది. ఇన్నేళ్ల నుంచి సమస్య వేధిస్తున్నా ఎవరూ పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు.

గంజాయి విక్రేతల అరెస్టు

- 3 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో పోలీసుల అలర్ట్


మాట్లాడుతున్న మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐలు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి మూడు కిలోల గంజాయిని, 3 సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం సాయంత్రం గిద్దలూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు మాట్లాడారు. గిద్దలూరు పట్టణంలోని అర్బన్ కాలనీలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ ఆ ప్రాంతానికి చేరుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 3 కిలోల గంజాయిని, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిలో ఒక వ్యక్తిది గిద్దలూరు కాగా, మరో ఇద్దరు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులని గుర్తించారు. గంజాయిపై కఠినంగా వ్యవహరిస్తామని, గిద్దలూరులో గంజాయి బ్యాచ్‌పై ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా వ్యవస్థను రూపొందించామని తెలిపారు. విలేకరుల సమావేశంలో గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్, రూరల్ సీఐ రామకోటయ్య, పోలీసులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గిద్దలూరు ప్రాంతంలో 'గంజాయి గుప్పు గుప్పు' అనే శీర్షిక ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనంతో ఉన్నతాధికారులు స్పందించారు. దీంతో శుక్రవారం పోలీసులు చాటుమాటుగా సాగుతున్న గంజాయి వ్యవహారాన్ని బట్టబయలు చేశారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- డీఈవో ఏ కిరణ్‌కుమార్
- ఊళ్లపాలెం హైస్కూలులో ఆకస్మికంగా తనిఖీలు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో కిరణ్‌కుమార్

సింగరాయకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాను సాధించాలని డీఈవో కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఊళ్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మిగతా తరగతి గదులను పరిశీలించారు. తదనంతరం ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశంలో డీసీఈబీ సెక్రటరీ మర్రిబోయిన శ్రీనివాసరావు, హెచ్‌ఎం డీఎస్‌కేవీ ప్రసాదరావు పాల్గొన్నారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని రైల్వేస్టేషన్ రోడ్డులో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఒంగోలు ఉప విద్యాధికారి చంద్రమౌళీశ్వర్ తనిఖీ చేశారు. తరగతుల నిర్వాహణను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

ఇంటర్ హాల్‌టిక్కెట్లను విడుదల చేసిన ప్రభుత్వం

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మార్చి 1 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షల హాల్ టిక్కెట్లను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా డౌన్‌లోడ్ చేసుకోనే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించింది. వాట్సాప్‌నెంబర్‌లో హాయ్ అని పెడితే వెంటనే ప్రభుత్వ సర్వీసుల డిస్‌ప్లే అవుతుంది. అందులో విద్యాశాఖను ఎంపిక చేసుకొని అందులో విద్యార్థి ఆధార్, రోల్ నెంబరును టైప్ చేసి, ఆ తర్వాత విద్యార్థి పెట్టిన తేదీ, నెల, సంవత్సరం టైప్ చేయాలి. కొద్దిసేపట్లోనే హాల్ టిక్కెట్ అదే వాట్సప్‌కు పీడీఎఫ్ ఫార్మెట్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మరో వైపు కళాశాలల్లో ఫీజుల పేరుతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వకపోతే ప్రస్తుతం డౌన్‌లోడ్ చేసుకొనే హాల్‌టిక్కెట్లతో పరీక్షలు రాసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇంకొక వైపు హాల్ టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టే కళాశాలలపై కరోడా ఝుళిపించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

- మంత్రి స్వామి
- నాయుడుపాలెంలో అధికారులతో నియోజకవర్గ సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి స్వామి

కొండపి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల అధికారులు పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ్వామి ఆదేశించారు. శుక్రవారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన రెవెన్యూ, హౌసింగ్, పంచాయతీరాజ్, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంపీడీవోల తోపాటు ఇతర శాఖల అధికారులతో విడివిడిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఫ్రీహోల్డ్ ల్యాండ్స్ అక్రమాలు గుర్తించాలని స్వామి తహసీల్దార్‌లతో జరిగిన సమీక్షలో అన్నారు. రీసర్వే చేస్తున్న గ్రామాల్లో రీసర్వే తప్పులు లేకుండా పారదర్శకంగా, విమర్శలకు తావులేకుండా నిర్వహించాలని ఆరు మండలాల తహసీల్దార్లకు సూచించారు. ఎన్టీఆర్ హౌసింగ్‌లో పొజిషన్ సర్టిఫికెట్ల కోసం ఇచ్చిన అర్జీలను పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని చెప్పారు. పంచాయతీరాజ్ ఏఈలతో సమీక్షిస్తూ సీసీరోడ్లు, పల్లె పండుగ కార్యక్రమంలో నియోజకర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రారంభమైన సీసీ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణ పనులపైనా, పంచాయతీ రాజ్ శాఖలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపైనా సమీక్షించారు. సమీక్షలో ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థి చికిత్సకు రూ.2లక్షలు మంజూరు

- మంత్రి స్వామి పరామర్శించిన మరుసటి రోజే ఎల్‌వోసీ జారీ

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : శరీరంపై వేడిపాలు పడి గాయాలైన విద్యార్థి ఎం.మధుమోహన్‌కు వైద్యచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2లక్షలు ఎల్‌వోసీ మంజూరు చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టంగుటూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో గురువారం ఐదో తరగతి చదువుతున్న మధుమోహన్ శరీరం, చేతుల పైనా వేడి పాలు పడి గాయాలు కావడంతో వైద్యం కోసం స్థానిక కిమ్స్ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ.స్వామి కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అందుకు అవసరమైన నిధులను సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయిస్తానని వైద్యశాల ప్రతినిధులకు తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే మంత్రి స్వామి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు శుక్రవారం వైద్యశాలలో చికిత్స పొందుతున్న మధుమోహన్‌కు వైద్యచికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ కింద రూ2లక్షలు మంజూరు చేస్తూ అందుకు అవసరమైన ఎల్‌వోసీని కిమ్స్ వైద్యశాలకు పంపించారు. దీంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబసభ్యులపై బాలిక ఫిర్యాదు

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

కొండపి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తనపై కుటుంబ సభ్యులే అఘాయిత్యానికి పాల్పడ్డారంటూ మండలానికి చెందిన ఓ బాలిక పోలీసులను ఆశ్రయించింది. బాలికతోపాటు ఆమె తల్లి కొండపి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై ప్రేమ్‌కుమార్ శుక్రవారం రాత్రి తెలిపారు. మహిళా ఎస్ఐతో ఆ బాలిక వాంగ్మూలం కూడా నమోదు చేశామన్నారు.

సాధారణ తనిఖీ చేసిన డీఎస్పీ

కొండపి పోలీస్ స్టేషన్‌ను కనిగిరి డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ శుక్రవారం సాధారణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. డివిజన్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిరంతర నిఘాతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా బాలిక ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ చేస్తున్నామన్నారు.

వెల్లంపల్లిలో సినిమా థియేటర్ సీజ్


థియేటర్‌ను సీజ్ చేసిన తహసీల్దార్ సుజన్‌కుమార్, సిబ్బంది

మద్దిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలోని జీఎంఆర్ సినిమా థియేటర్‌ను శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామంలో కొంతకాలంగా జీఎంఆర్ సినిమా హాల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ స్థలంలో గతంలో రైస్ మిల్లు ఉండేది. దానిని సినిమా థియేటర్‌గా మార్చుకోవడానికి, నిర్వహణకు సరైన అనుమతులు పొందలేదు. దీంతో సినిమా థియేటర్‌ను తక్షణమే సీజ్ చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలు జారీచేశారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ సుజన్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది హాలుకు తాళాలు వేశారు. కార్యక్రమంలో డీటీ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో పూజిత తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో శిశు ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం


శిశు ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీడీ శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని పబ్లిక్ హెల్త్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మెడికల్ రిక్కాల విభాగం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జనన, మరణ ధృవీకరణ పత్రాలను వందేళ్ల వరకు భద్రపరచాలని సిబ్బందిని ఆదేశించారు. జీజీహెచ్‌లో శిశు ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. సీఎస్‌సీ సహకారంతో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామని, ఆసుపత్రిలో బిడ్డ పుట్టిన వెంటనే ఆధార్ నమోదు అయ్యేలా చూడాలన్నారు. అంతేగాకుండా ఆధార్‌తోపాటు ఐడీని తల్లిదండ్రులకు ఇవ్వాలని ఆదేశించారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలలో తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలని, ఎలాంటి లోపం జరిగిన తదుపరి మార్పులు, చేర్పులకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ మాధవిలత, స్టాటికల్ అధికారి ప్రసాదరావు, నర్సింగ్ సూపరింటెండెంట్ అనంతలక్ష్మి, సీఎస్‌సీ జిల్లా మేనేజరు ప్రమోద్ పాల్గొన్నారు.

ఊపిరి ఆడేదెలా..



దట్టమైన పొగలో ఊపిరి బిగపట్టి ప్రయాణం చేస్తున్న ద్విచక్రవాహనదారులు

- దంపింగ్ యార్డు వద్ద నిత్యం చెత్తాచెదారం దహనం
- పొగలోనే వాహనదారుల ప్రయాణం
- గాలి కాలుష్యంతో ప్రజల అవస్థలు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం గుత్తికొండవారిపాలెం దగ్గర గల డంపింగ్ యార్డు ప్రాంతం పొగతో నిండిపోతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందిపడతున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తాచెదారానికి కార్పొరేషన్ సిబ్బంది నిప్పు పెడుతున్నారు. దీంతో డంపింపింగ్ యార్డు నిరంతరాయంగా తగలు పడుతూనే ఉంటోంది. దీనివల్ల దట్టమైన పొగ కిలోమీటరు దూరంగా పైగా విస్తరించి కమ్మేస్తోంది. ఒంగోలు నుంచి గుత్తికొండవారిపాలెం వెళ్లే గ్రామస్థులకు అవస్థలు పడాల్సి వస్తోంది. పొగతో ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డంపింగ్‌యార్డులో చెత్తను తగలబెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పొగతో నిండిపోయిన దంపింగ్‌యార్డు ప్రాంతం

మాతృభాష పరిరక్షణకు అందరూ పాటుపడాలి

- మేయర్ గంగాడ సుజాత
- ఘనంగా మాతృభాషా దినోత్సవం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మాతృభాష పరిరక్షణకు అందరూ పాటుపడాలని మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం ఒంగోలులో కళామిత్ర మండలి జాతీయ లోగిలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకలకు సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు అధ్యక్షత వహించగా, మేయర్ గంగాడ సుజాత, జనసేన పార్టీ నాయకులు కంది రవిశంకర్, డీఈవో కిరణ్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ రచించిన శునక రాగాలు పుస్తకాన్ని మేయర్ గంగాడ సుజాత ఆవిష్కరించగా అరుణాసికిందర్ పుస్తకాన్ని స్వీకరించారు. అదేవిధంగా కర్నూలుకు చెందిన గద్వాల సోమన్న రచించిన బాలగేయాలు-పిల్ల తెమ్మెరలు పుస్తకాన్ని కంది రవిశంకర్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ సుజాత మాట్లాడుతూ మన భాష, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాలంటే మాతృభాష పరిరక్షణ ఎంతో ముఖ్యమన్నారు. రవిశంకర్ మాట్లాడుతూ ప్రాంతీయ భాషల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడంతో పాటు, పిల్లలలో చిన్నప్పటి నుంచే మాతృభాష పట్ల ఆసక్తిని కలిగించేందుకు ప్రయత్నించాలని చెప్పారు. డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ బాల్యం నుంచే విద్యార్థులు మాతృభాషలో పట్టు సాధించేవిధంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి పుస్తక సమీక్షను నిర్వహించారు. అనంతరం అనేక రంగాలలో కృషిచేస్తున్న వారికి తెలుగు భాషా విశిష్ట సేవా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారుల వేషధారణలు, చందూ డాన్స్ అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, గాయకుడు నూకతోటి శరత్‌బాబు, శైలజాచిత్రలు ఆలపించిన గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, పాతూరి అన్నపూర్ణ, వీరవల్లి సుబ్బారావు, పోతుల పెదవీరనారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, ఓరుగంటి ప్రసాద్ ప్రసంగించారు. కోవెలకుంట్ల బాలకోటయ్య, బీరం అరుణ, జీవీ.శేషగిరిరావు, మహతి బాలాజీ, కందుల మధు నిర్వహణా సహకారాన్ని అందజేశారు.



శునకరాగాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ సుజాత, అతిథులు

మహిళా డిగ్రీ కళాశాలలో..

స్థానిక దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కళ్యాణి తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యక్షులు పి.యామిని అమ్మాజీ, భౌతిక శాస్త్ర అధ్యక్షులు ఇందిర, సుష్మ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాంటిస్సోరి స్కూలులో..

మాంటిస్సోరి పబ్లిక్‌స్కూలులో డైరక్టర్ శబరినాథ్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా జరిగాయి. తెలుగువంటకాలపై అవగాహన కల్పించారు.

స్టెప్ ఆధ్వర్యంలో..

స్టెప్ ఆధ్వర్యంలో మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామ్‌నగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వేషధారణ, కవితల విభాగాలలో పోటీలను నిర్వహించారు. సీఈవో పి.శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షిస్తూ ఆంగ్లం, హిందీ భాషలలో పట్టుసాధించాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి టి.భరద్వాజ్ మాట్లాడుతూ భాష అనేది భావ వ్యక్తీకరణకు మంచి మార్గమని చెప్పారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.ఎస్.శర్మ, జీవీఆర్.ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవాణీనికేతన్ పాఠశాలలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం కరవదిలోని శ్రీవాణీకేతన్ పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.చిన్న వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ మన్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు

మద్దిపాడులో..

మద్దిపాడు: మద్దిపాడులోని తూర్పు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఎంఈవో పీవీ.రాఘవరావు ముఖ్యఅతిథిగా హాజరై విశ్రాంత ఉపాధ్యాయుడు షేక్ షరీఫ్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నల్లూరి నరసింహారావు, విశ్రాంత ఉద్యోగుల సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు దేవరశెట్టి యల్లమంద, నేలటూరి సత్యనారాయణ, గంగిశెట్టి నరసింహారావు, కాకుమాను సుబ్బారావు, గంట కోటేశ్వరరావు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



షరీఫ్‌ను సత్కరిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సింగాయకొండ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి (ఇంగ్లీషు మాధ్యమం), ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం (ఇంగ్లీషు మీడియం) జూనియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి శుక్రవారం తెలిపారు. ఐదో తరగతి 80 సీట్లు, జూనియర్ ఎంపీసీ- 40 సీట్లు, బైపీసీ- 40 సీట్లు, సీఈసీ- 80 సీట్లు ఉన్నట్లు చెప్పారు. అర్హులైన విద్యార్థులు మార్చి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. 5వ తరగతి ప్రవేశాలను ఏప్రిల్ 6వ తేదిన ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, ఇంటర్ మొదటి ఏడాది ప్రవేశాలకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4.30 గంటల వరకు పాఠశాలలో పరీక్షలు జరుగుతాయని వివరించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

ఒంగోలు విద్య, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన యువ ఉత్సవ్‌లో స్థానిక ట్రిపుల్‌ఐటీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు బహుమతులు సాధించారు. ప్రాజెక్టు ఎక్స్‌పో పోటీల్లో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు బి.విజయ్, గీతిక్, ఎస్‌కే.అబ్దుల్‌రజాక్‌లు మొదటి బహుమతి సాధించగా, జి.మృదుల, రాజేశ్వరి, ఎస్‌కే.సానియా, ఎస్‌డీ.తాహెర, పి.నివేదితల బృందం తృతీయ బహుమతులు సాధించారు. విజేతలను అధ్యాపకులు అభినందించారు.

పి4 సర్వేను పక్కాగా నిర్వహించాలి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సీపీవో వెంకటేశ్వర్లు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): పి4 సర్వేను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సీపీవో డి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఒంగోలు మండలం కరవది గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్, ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ సర్వే ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. సర్వే ద్వారా పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయటానికి ఉపయోగపడుతుందని చెప్పారు. అందువల్ల సర్వేను జాగ్రత్తగా చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రాజశేఖరరావు, ఎస్‌వో పి.వేణుగోపాల్‌రెడ్డి, ఏఎస్‌వో బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయానికి విరాళం

సంతనూతలపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో గల పోలేరమ్మ ఆలయ అభివృద్ధికి శుక్రవారం గ్రామానికి చెందిన బల్లికురవ వెంకట్రావు కుమారుడు, శ్రీకాకుళం జిల్లా ఏరియా ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు రూ.2లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ నగదును ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధి మార్పుడి శ్రీనివాసరావుకు అందించారు. ఈ సందర్భంగా అర్చకులు ఫలతోటి శివరామక్రిష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించి డాక్టర్ శ్రీనివాసరావును తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడుకొండలు, వై.శ్రీను, రామక్రిష్ణ, కిషోర్, బాబు తదితరులు పాల్గొన్నారు.



రూ.2లక్షలను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు

నిందితులపై చర్యలు తీసుకోవాలి

సంతనూతలపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని సాయిబాబా సత్సంగం సమీపంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.సుబ్బారావు శుక్రవారం డిమాండ్ చేశారు. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆస్తిని ధ్వంసం చేసిన వారిపట్ల అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వాటర్‌ప్లాంట్ ధ్వంసంపై విచారించి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగినికి గాయాలు

మద్దిపాడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ట్రోవగుంట ఆటోనగర్ వద్ద స్కూటీ అదుపుతప్పి సచివాలయ ఉద్యోగినికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన శుక్రవారం జరిగింది. ఒంగోలు నుంచి పర్చూరుకు విధులకు హాజరయ్యేందుకు స్కూటీపై బయలుదేరిన సువర్చలాదేవి నాగులుప్పలపాడు వైపు నుంచి లారీ వేగంగా రావడంతో ఆందోళపడ్డారు. దీంతో తాను నడుపుతున్న స్కూటీ ముందు బ్రేక్ వేయడంతో అదుపుతప్పి కింద పడి గాయపడ్డారు. ఆమె కాలుకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు తరలించారు.

నరేష్‌ను అవమానించిన ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో నినాదాలు చేస్తున్న రాఘవ, నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడు నరేష్‌ను అవమానించిన టీటీడీ ఉద్యోగి బాలాజీపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక రాష్ట్ర కన్వీనర్ నాదెండ్ల రాఘవ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేష్ స్వామి వారి దర్శన అనంతరం మహాద్వారం వద్ద అక్కడ విధులు నిర్వహిస్తున్న బాలాజీ అనే ఉద్యోగి అడ్డుకొని దురుసుగా ప్రవర్తించడమే కాకుండా అసభ్యకరంగా మాట్లాడటం దారుణంగా ఉందన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను బయట పెట్టకుండా కేవలం నరేష్ మాట్లాడిన వీడియోను చూపిస్తూ ఆయన మనోభావాలను దెబ్బతిస్తున్నారని ఆరోపించారు. శ్రీవారికి విశేష సేవలు అందిస్తున్న నాయీ బ్రాహ్మణుల కులస్థుల పట్ల ఇటువటి చర్యలకు పాల్పడటం దారుణంగా ఉందన్నారు. బాలాజీపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమలో అన్నవరపు వెంకటేశ్వర్లు, బి.శ్రీను, పాతపాటి మధుబాబు, వెంకటరావు, అన్నంగి సురేష్, కరవది వేణు, నాదెళ్ల సుబ్బారావు, వెంకటరావు, ఎ.కోటేశ్వరరావు, యోగామూర్తి, కె.శివ, సీతారామయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పరిసరాల పరిశుభ్రత

కొత్తపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఆవరణలో శుక్రవారం పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సన్ హెల్పింగ్ పీపుల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీఐ ఎస్.సాంబశివరావు, ఎస్‌ఐ పి.సుబ్బారావు టీడీపీ మండల నాయకులు గేనం సుబ్బారావు, ఏపీవో జ్యోత్స్న మొక్కలను నాటారు. కార్యక్రమంలో సన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విజయకుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హరి, కిషోర్‌కుమార్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలపై దాడి కేసులో డీఎస్పీ విచారణ

చీమకుర్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): బక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఎస్టీ మహిళలపై జరిగిన దాడి కేసులో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణలో భాగంగా శుక్రవారం ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు విచారణ జరిపారు. గ్రామంలో బాధిత మహిళలు, సాక్షుల వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. సీఐ సుబ్బారావు ఆయన వెంట ఉన్నారు. ప్రజాసంఘాల నాయకులు డీఎస్పీని కలిసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.



నిర్మాణంలో ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం

నేడు మహాశాంతి హోమం

ఒంగోలు కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం దశరాజుపల్లెరోడ్డులోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీపద్మావతి గోదా సమేత శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం మహాశాంతి హోమం నిర్వహిస్తున్నట్లు పాలకమండలి ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి నవగ్రహ హోమం, శ్రీ లక్ష్మీగణపతి, సుదర్శన, శాంతి హోమం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు.

కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలపై మారణహోమాన్ని సృష్టిస్తున్న కగార్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలని వామపక్ష, విప్లవ, దళిత హక్కుల, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు సీపీఐ జిల్లా నాయకుడు వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా న్యూడెమొక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దండకారణ్యంలోని విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. ప్రజాస్వామికవాదులను అర్బన్ నక్సల్స్ పేరుతో నిర్బంధించడం దుర్మార్గంగా ఉందని, ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ ఆదివాసి ప్రాంతాల్లో సహజ సంపదలను కొల్లగొట్టేందుకు కగార్ ఆపరేషన్‌ను కేంద్రం తెచ్చిందని ఆరోపించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ.కొండారెడ్డి మాట్లాడుతూ మోదీ అనుసరిస్తున్న విధానాలను ఖండించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, చుండూరి రంగారావు, కొంగర నరసింహం, సుబ్బారావు, ఎల్.రాజశేఖర్, నూనె మోహన్‌రావు, ఉప్పుటూరి ప్రకాశరావు, నాంచార్లు, మోహన్, సాగర్, సుధాకర్, క్రాంతి, నరసింహారావు, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించి.. ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీడీ

ఒంగోలు నగరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పదో చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో ఒత్తిడిని అధిగమించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్ కోరారు. శుక్రవారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు సాధారణంగా వత్తిడికి గురవుతారని, ప్రణాళికబద్ధంగా చదవటం ద్వారా దానిని అధికమించవచ్చని చెప్పారు. అనంతరం పలు అంశలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ప్రతినిధి నీలిమ, డీసీఈబీ కార్యదర్శి శ్రీనివాసరావు, సహాయక సాంఘిక సంక్షేమశాఖాధికారులు లింగయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీడీ లక్ష్మానాయక్

పేద ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్



ఉప్పుగుందూరులో చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చీర్వానుప్పలపాడు, ఈదుమూడి, ఉప్పుగుండూరు, కనపర్తి, మాచవరం, ఓబన్నపాలెం, రాపర్ల, టి.అగ్రహారం గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన రూ.14,78,171 సీఎం సహాయనిధి చెక్కులను ఆయన వారి ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా కృషి చేస్తుందన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రజాప్రతినిధులు వచ్చి సీఎం సహాయనిధి చెక్కులను అందించడం తమ ప్రభుత్వానికి ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. కనపర్తి పంచాయతీ మేకల సోమయ్య పట్టపుపాలెం గ్రామంలో నిర్మించిన సిమెంట్‌రోడ్డును ఎమ్మెల్యే బీఎస్ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, ఆళ్ల నాగార్జున, వాకా శ్రీనివాసరెడ్డి, తెలగతోటి జాన్సన్, కుర్రా వీరాంజనేయులు, కనగాల శ్రీను, కాట్రగడ్డ చంద్రబాబు, కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ పాలపర్తి బాలకోటి, కట్టా వెంకటేశ్వర్లు, చాట్ల నారాయణ, మెట్టు సుబ్బయ్యనాయుడు, కొణిజేటి ధనుష్, సాయిచరణ్, పీకా బైరాగి పాల్గొన్నారు.

జనన ధ్రువీకరణ పత్రాలను వెంటనే అందించాలి

- పబ్లిక్ హెల్త్ డీడీ శ్రీనివాసులురెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్యశాలల్లో శిశువులు జన్మించి వారు డిశ్చార్జ్ అయ్యే సమయంలోనే వారికి జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ డీడీ శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు, ఒంగోలులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లుతో సమావేశమయ్యారు. ముందుగా సర్వజన ఆస్పత్రి, ప్రైవేటు వైద్యశాలల్లో జరుగుతున్న జనన, మరణాల నమోదు రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. వైద్యశాలలో సాధారణ ప్రసవాలు జరిగే విధంగా చూడాలన్నాను. అత్యవసరమైతేనే సర్జరీలు చేయాలని చెప్పారు. ప్రసవాలకు సంబంధించి రికార్డులు, రిజిస్టర్లు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ వివరాలను జనన, మరణ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసే విధంగా వైద్యశాలలకు ఆదేశాలు ఇవ్వాలని డీఎంహెచ్‌వోకు సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నెలకు 10 ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన మందులు, పరికరాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రైవేటు వైద్యశాలల్లో ఎక్కువగా సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయని, అటువంటి ఆసుపత్రులకు తగిన ఆదేశాలు జారీ చేశామని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన ప్రసవాలను ఎన్టీఆర్ వైద్య సేవ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గణాంకాల అధికారి ప్రసాద్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు, డేటా మేనేజర్ చల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ శ్రీనివాసులురెడ్డి

బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఒంగోలులోని స్టేట్‌బ్యాంకు టౌన్ బ్రాంచి కార్యాలయం వద్ద అన్ని బ్యాంకు యూనియన్ల నాయకులు కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని బ్యాంకు యాజమాన్యాలు ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. వారంలో ఐదు రోజులు పనిదినాలు అమలుతో పాటు ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. బ్యాంకుల్లో ఉద్యోగులను తగ్గించే విధానాలను రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా గ్రాడ్యుటీ రూ.25 లక్షలు పెంచాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో, నోట్ల రద్దు సమయంలో ఉద్యోగులు ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యాలు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ల నాయకులు వీఎస్ఆర్.సుధాకరరావు, వెంకటరెడ్డి, వి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, సుబ్బారావు, షేక్ హసన్, ఉమాశంకర్, ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ల నాయకులు

మలేరియా నిర్మూలనపై అవగాహన

చీమకుర్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి) : మలేరియా మహమ్మారి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రామతీర్థంలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా నివారణ అధికారి మధుసూదనరావు మాట్లాడుతూ రామతీర్థం పరిసరప్రాంతాల్లో మలేరియా ప్రతి ఏటా ఎక్కువగా వ్యాప్తి చెందుతుండటంతో అదుపు చేసే చర్యలను చేపట్టినట్లు చెప్పారు. రామతీర్థం పుణ్యక్షేత్రంలో ఉన్న కోనేరులో దోమల లార్వా పెరగకుండా చర్యలు తీసుకున్నారు. పాఠశాల, గ్రా మంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చీమకుర్తిలో క్షుద్రపూజల కలకలం

చీమకుర్తి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణ శివారులో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు కనపడటంతో శుక్రవారం కలకలం రేగింది. కూనంనేనివారిపాలెం-ఏలూరివారిపాలెంకు వెళ్లే రోడ్డుపై క్షుద్రపూజల్లో వేసేవిధంగా ముగ్గు వేసి ఉండటం, నిమ్మ కాయలు, కోడి ఎముకలు, పూజా సామగ్రి ఉండటంతో ఆవైపు ప్రయాణం చేసేవారు చూసి భయాందోళనకు గురయ్యారు.

అవీ..ఇవీ

డ్రైడే పాటిస్తే వ్యాధులు దూరం


నిల్వనీటిని పారబోయిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

పొదిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రతి శుక్రవారం నిల్వ ఉన్న నీటిని పారబోసి డ్రైడే పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండొచ్చని పొదిలి డివిజన్ సబ్‌యూనిట్ ఆఫీసర్ కృష్ణ అన్నారు. పొదిలి మండలం తలమళ్ల గ్రామంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి తొట్లలో నిల్వ ఉన్న నీటిని పారబోశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరుగుతుందన్నారు. దీంతో దోమలు ప్రబలుతాయన్నారు. దోమలు కుట్టకుండా ప్రజలు దోమతెరలు వినియోగించాలన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వాసవి విద్యానికేతన్‌లో నేడు సైన్స్ ఎక్స్‌పో

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో శనివారం సర్ సీవీరామన్ మెగా సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ కె.రంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దాదాపు 400 మంది విద్యార్థులు 200 ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో జగదాంబ

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వరుణ్‌తేజశర్మ జగదాంబ అమ్మవారికి వేకువజామున పంచామృతా విశేష అభిషేకాలు, శ్రీచక్ర సహిత కుంకుమార్చన, అలంకరణ నిర్వహించారు. మార్కండేశ్వర స్వామికి అర్చకులు వేలూరి అంజనేయశర్మ పంచామృత రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపుపై అవగాహన

● హెచ్‌ఎం నారాయణ రెడ్డి


ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా ఐనముక్కల గ్రామంలోని ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. అక్కడ కంప్యూటర్ వినియోగం, ఆధార్ సర్వీసు గురించి, డిజిటల్ లాకర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీ ఒకేషనల్ ట్రైనర్ సయ్యద్ నాయబ్ రసూల్, పీడీ రామానాయక్, యోగ ఉపాధ్యాయులు ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

రాక్‌వెల్ విద్యార్థుల క్షేత్రపర్యటన


పోస్టాఫీస్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాక్‌వెల్ స్కూల్ విద్యార్థులు పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్, పట్టణ పోలీస్ స్టేషన్‌లను క్షేత్రస్థాయిలో శుక్రవారం సందర్శించారు. ప్రీప్రైమరి నుంచి రెండో తరగతి విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌లో చట్టాల అమలు, ప్రజల భద్రతపై సీఐ సుబ్బా రావు, ఎస్‌ఐలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్‌లు వివరించారు. పోస్టా ఫీసులో లేఖల పంపిణీ విధానం, స్టాంపుల ప్రాముఖ్యత, తపాలా సేవలపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల్లో కుటుంబాల సంఖ్యను తగ్గించడం తగదు

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు సోమయ్య


మాట్లాడుతున్న సోమయ్య

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కుటుంబాల సంఖ్యను భారీగా తగ్గించి చేతులు దులుపుకునేలా ప్రభుత్వం వ్యవహ రించరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు దగ్గుపాటి సోమయ్య హితవు పలికారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. భారీ నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చూస్తే వెలిగొండ నిర్వాసితులకు అన్యాయం చేసేలా ఉందన్నారు. మంత్రి పత్రికా విలేకరులతో మాట్లాడుతూ..వెలిగొండ నిర్వాసితుల ఆర్‌ఆర్ ప్యాకేజీ కోసం రూ.880 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పటం, ముంపు గ్రామాల్లోని కుటుంబాల సంఖ్యను భారీగా తగ్గించడమే అన్నారు. 2025 జనవరి నెలలో కలెక్టర్ ఆర్‌అండ్‌ఆర్ రాష్ట్ర కమిషనర్‌లు ప్రభుత్వానికి పంపించిన నివేదికలో 7550 కుటుంబాల నిర్వాసుతుల ఉన్నారన్నారు. వారికి 12.50లక్షల చొప్పున ప్యాకేజీ చెల్లింపునకు పునరావాస కాలనీ సౌకర్యాల కోసం మొత్తం రూ.1203కోట్లు ఖర్చు అవుతుందని నివేదిక పంపించారన్నారు. మంత్రి ప్రకటన కేవలం రూ.880 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పటం నిర్వాసితుల సంఖ్యను కుదిస్తున్నారని అనుమానం వ్యక్తమవుతుందన్నారు. సమావేశంలో డీకేఎం రఫీ, రూబెన్, సురేశ్, నన్నేసా పాల్గొన్నారు.

నటరాజ అలంకరణలో నిర్మమహేశ్వరుడు

పొదిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారు చంద్రవాహనముపై నటరాజ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలు యాదాల వెంకటేశ్వర్లు, మంచికంటి సుధీర్‌కుమార్, సనీల్‌కుమార్, టంగుటూరి సూర్యనారాయణ, చంద్రపాటి వెంకట సీతారామాంజనేయ ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అమ్మభాషను కాపాడుకుందాం

● పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాలు ● పార్వతీపురంలో తెలుగు కవుల చిత్రాల పదర్శన

పొదిలి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మన మాతృభాషను పరిరక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రధానోపాధ్యాయులు వెన్నెల మల్లికార్జునరావు శుక్రవారం అన్నారు. మండలంలోని పార్వతీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృబాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాతృభాషను కాపాడుకుంటునే ఆంగ్లభాషను గౌరవిద్దామని చెప్పారు. 100 మంది తెలుగు కవుల చిత్రాలు, వారిరచనలు ప్రదర్శించారు. తెలుగు కౌవుల చిత్రప్రదర్శన అందరిని ఆకట్టుకొంది. ఈ సంధ్భంగా విద్యార్థులకు తెలుగు పద్యాలు, కంఠస్థ పోటీలు, తెలుగుభాష ప్రాధాన్యత అనే అంశంపై వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాషిణి, సునిత, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, సుజాత, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.


పొదిలి మండలం పార్వతిపురంలో తెలుగుకవుల చిత్రపటాలతో విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలో అంతర్జాతీయ మాతృభాష దినో త్సవాన్ని శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. ధారణ శక్తిని పెంపొందించే ప్రక్రియలు తెలుగుభాష గొప్పతనం అన్నారు. మాతృభాషతో విద్యార్థుల వ్యక్తిత్వ, శారీరక, మానసిక వికాసం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు భాషసౌరభం విభాగంలో ఉపాన్యాసాలు, లఘు నాటికలు, నిజజీవితంలో మాతృభాష వినియోగం విభాగంలో కథలు, పాటలు, పద్యాలు అంశాలపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, ఉమాదేవి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సమీవుల్లా, సునీత పాల్గొన్నారు.


వై.పాలెం డిగ్రీ కళాశాలలో విజేతకు నగదు అందజేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్

మరువలేనిది మరువకూడనిది మాతృభాష

ఎర్రగొండపాలెం : మండలంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మాతృబాష దినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో లు ఆంజనేయులు, మల్లునాయక్, హెచ్‌ఎం, ఉపాధ్యా యులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేఎస్‌వీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాతృబాష దినోత్స వేడుకలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బహుమతులు పంపిణీ చేశారు.

పేదలకు ఉపాధి హామీ పనులే జీవనాధారం

● బిల్లులు తీసుకొని కనిపించని మొక్కలు
● మస్టర్లపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనేది జీవనాధారం అని ఎంపీపీ కామూరి అమూల్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ మండలంలోని పేదలకు ఉపాధిని కల్పించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. మండలంలో జరిగే ఉపాధి పనులు నాణ్యత, ప్రజలకు అవసరమైన పనులను గుర్తించడం, ప్రతి ఒక్క కూలికి పని కల్పించడం వంటి పనులు చేయాల న్నారు. మండలంలోని తాటిచర్ల, దద్దవాడ గ్రామ పంచాయతీల్లో మూడు సంత్సరాల్లో మామిడి, జామ వంటి పండ్లతోటలు నాటి బిల్లులు తీసుకున్న తర్వాత వాటి ఆనవాళ్లు లేకుండా చేశారన్నారు. వారిపై పూర్తిస్థాయిలో విచారించాలని పీడీ అన్నారు. సిబ్బంది కూలీల హాజరు, జాబ్‌కార్డుల వివరాలను నమోదు చేయడం లేదని ఫిర్యాదు రావడంతో ఈ విషయమై ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్లలను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ మస్తాన్‌వలి, ఏపీవో మహాలక్ష్మి, ఏపీడీ భాస్కర్‌రావు, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, విజిలెన్స్ ఝాన్సీరాణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

హమాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ముఠాకార్మికులు

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): పౌర సరఫరాల శాఖలో పని చేస్తున్న హమాలి కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ గిద్దలూరు రైస్ గోడౌన్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఆమేరకు రైస్ గోడౌన్ డీటీ వాసుదేవరావుకు వినతిపత్రం అందచేశారు. హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుమలరావు, శ్రీనివాసులు మాట్లాడుతూ పౌర సరఫరా సంస్థలో పనిచేస్తున్న హమాలి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కూలిరేట్లు పెంచుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీవో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓబులేసు, వీరయ్య, పిచ్చిరెడ్డి, హమాలీలు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులు సేవాభావంతో మెలగాలి


డాక్టర్ చైతన్య దీపక్‌ను సన్మానిస్తున్న డైరెక్టర్లు

కొమరోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యార్థులు విద్యతో పాటు సేవా భావాన్ని అలవర్చుకుని తోటివారికి సహాయ సహకారాలు అందించాలని కొమరోలు ప్రభుత్వ వైద్యులు డాక్టర్ చైతన్యదీపక్ అన్నారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో శుక్రవారం ద్వితీయ సంవత్సరం చదివిన విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ చైతన్యదీపక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెయిర్‌వెల్ పార్టీలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించి జీవితంలో ఎలా ఉండాలి, ఎలా చదవాలి వంటి వాటిపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వైద్యులు చైతన్యదీపక్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్ విద్య అనేది కీలకమైన విద్య అన్నారు. మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మీమ్ములను చదివిస్తున్నారన్నారు. వారి శ్రమను గుర్తించి ఉన్నత స్థితికి రావాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యార్థిదశ నుంచే సేవాభాలను అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరికి వైద్యం అందించడం ఎంతో మంచిసేవ అన్నారు. అలాంటి సేవ పట్ల ప్రతి విద్యార్థి మక్కువ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కృష్ణారెడ్డి, సందీప్‌రెడ్డి, ఉపాధ్యాయులు విశ్వరూపం, అశ్వనికుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ జీవనశైలిలో భాగం కావాలి

ఏపీఎన్‌జీసీ స్టేట్ డైరెక్టర్ స్రవంతి


మొక్క నాటుతున్న ఏపీఎన్‌జీసీ డైరెక్టర్ స్రవంతి

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠశాల దశ నుంచే పర్యావరణహిత జీవన శైలిని అలవర్చు కోవాలని ఏపీఎన్‌జీసీ స్టేట్ డైరెక్టర్ పి.స్రవంతి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె సందర్శించి మొక్కలు నాటి మాట్లాడారు. పాఠశాలలల్లో ఎకోక్లబ్‌లు ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తామన్నారు. పర్యావరణ విద్యపై ప్రభుత్వ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీసీ సమన్వయ కర్త ఎం.సంజీవ రాజు, ఎంఈవోలు బి.రామ్‌దాస్‌నాయక్, కె.శర్వాణి, ప్రధానో పాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎన్‌జీసీ మండల సమన్వయకర్త ఓవీ రవిశేఖర్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, ఎలిజబెత్ రాణి, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఉమాదేవి, అల్లూరయ్య పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు ప్రేరణ తరగతులు


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అరుణ

మార్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులు ఎవరికీ తీసిపోరని మార్కాపురం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్.అరుణ అన్నారు. స్థానిక మెప్మా కార్యాలయంలో శుక్రవారం పట్టణంలోని పది వసతిగృహాల్లో చదువుతున్న 179 మంది 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌డబ్ల్యువో అరుణ మాట్లాడుతూ తొలుత విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని విడనాడాలన్నారు. ఇప్పటి వరకు తరగతి గదుల్లో నేర్చుకున్న పాఠ్యాంశాలను పున రుచ్ఛరణ చేసుకోవాలన్నారు. ఎక్కడో దూరంగా ఉండి మిమ్మల్ని వసతిగృహాల్లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల త్యాగాలను గుర్తు చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా విద్యార్థులు పరీక్షలు రాసి ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. వసతులలేని కాలంలో వివక్షతను ఎదుర్కొంటూ కూడా విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరిన అంబేడ్కర్‌ను ప్రతి ఒక్క రూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో వసతిగృహ సంక్షేమాధికారులు ఎంవీ. దేవసేనకుమార్, వై. రామయ్య, ఏసీహెచ్ శ్రీరాము లు, దారా శ్రీను, జి.వెంకటేశ్వరరెడ్డి, డి.లక్ష్మీనాయక్, ఎస్‌కే.యాసిన్‌బేగం, బి.మహా లక్ష్మి, పలు పాఠశాలల సబ్జెక్ట్ ఉపాధ్యాయలు పాల్గొన్నారు.


గిద్దలూరులో మాట్లాడుతున్న ఎంఈవో

గిద్దలూరు టౌన్ : పదోతరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి, పరీక్షల సమయంలో ఒత్తిడి తగ్గించ డానికి, సబ్జెక్టులోని సందేహాలను నివృత్తి చేయ డానికి ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో జింకా వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రావీణ్యం ఉన్న ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా అవగాహన కల్పించడానికి శుక్రవారం సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిద్దలూరు మండలంలోని 7 సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో పదవ తరగతి చదువుతున్న 147 మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎస్‌డబ్ల్యు బాయ్స్ హాస్టల్‌లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సహాయ సాంఘీక సంక్షేమ అధికారి ఎన్.అమ్మాజీ ఆధ్వర్యంలో ఈ ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగుల ఆందోళన


నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

మార్కాపురం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూఎఫ్‌బీయూ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగులు ఆందోళన నిర్వహించారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని ఎస్‌బీఐ ప్రధానశాఖ బ్యాంకు వద్ద ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్‌బాబు మాట్లాడుతూ తాత్కాలిక ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. నియామకం ద్వారా ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. వారంలో ఐదు రోజులు బ్యాంకు పనిదినాలుగా మార్చాలన్నారు. ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటైజేషన్‌ను నిలిపివేయాలన్నారు. నిరసన కార్యక్రమానికి విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు సంఘీభావం తెలిపింది. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ నాయకులు ఎం.రమణారెడ్డి, షేక్.గౌష్‌బాష, కె.కాశిరెడ్డి, టి.చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఆధార్ శిబిరం


చెంచు గిరిజనులకు ఆధార్ తీస్తున్న నిర్వాహకులు

పెద్దదోర్నాల,ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామాల్లో శుక్రవారం ఆధార్ శిబిరం నిర్వహించారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వెంకట శివ ప్రసాద్ ఆదేశాల మేరకు లకచెర్ల, బంవధంబావి, మోట్ల మల్లికార్జునపురం గూడేల్లో ఆదర్శ సంస్థ సమన్వయకర్త మధుసుదన్‌రావు ఆధ్వర్యంలో ఉచిత ఆధార్‌శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఆధార్‌లేని చెంచు గిరిజనులను గుర్తించి వారికి ఆధార్‌తో పాటు, జనన ధ్రువీకరణ పత్రాలను మండల అధికారుల సహకారంతో త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది శ్యామూల్ కోటేశ్వరరావు, దావీద్, సుబ్బయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

బెంగళూరుకు ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరుటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు నుండి ప్రతి రోజు బెంగుళూరుకు నడుస్తున్న ఆర్టీసీ సర్వీసును పునరుద్ధరించాలని స్థానిక బీజేపీ నాయకులు ఆర్టీసీ డిపో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బెంగళూరుకు సర్వీసు రద్దు చేయడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బెంగళూరుకు సర్వీసులు నడుపుతూ అధికమొత్తాన్ని వసూలు చేస్తున్నాయన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాత్రి 8గంటల తరువాత సర్వీసును నడపాలన్నారు. కడపకు వెళ్లేందుకు బస్సును ఏర్పాటు చేయాలని వారు ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, బి.రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీడీ నిర్మలాదేవి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ నిర్మలాదేవి

పెద్ద దోర్నాల, ఫిబ్ర వరి 21 (ఆంధ్రజ్యోతి) : పేదవర్గాల వారు ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ నిర్మలా దేవి అన్నారు. మండలంలోని యడవల్లి గ్రామంలో జాతీయఉపాధి హామీ పథకం పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మిరప పొలాల్లోని కూలీలతో ఆమె మాట్లాడారు. వ్యవసాయ పనులతో పాటు ఉపాధి పనులను కూడా చేసుకోవాలన్నారు. తద్వారా ఆర్థిక తోడ్పాటు లభిస్తుందన్నారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంటు చంటి, టీఏ విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో ముందుండాలని, ఆవిధంగా నిరంతరం కృషి చేస్తున్న స్పందన సంస్థ యాజమాన్యాన్ని, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సోదరుడు క్రిష్ణకిశోర్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం రాచర్లలోని స్పందన విద్యాసంస్థల నందు నిర్వహించిన ప్రకాశం బాలోత్సవ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో అంతర్గతంగా దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర అధ్యక్షులు పి.స్వరూపారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణ సేవలు నిరుపమానం

కంభం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి, విద్యార్థుల శ్రేయస్సుకు ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఎం.వీ. మురళీకృష్ణ చేసిన కృషి నిరుపమానమని ఇంటర్మీడియట్ విద్యామండలి ఆర్‌ఐవో ఎ.సైమన్‌విక్టర్ తెలిపారు. కంభం జూనియర్ కళాశాల పీడీ మురళీకృష్ణ 28న ఉద్యోగ విరమణ చేయనుండగా శుక్రవారం ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో బెల్లంకొండ నాయకుడు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ఎంఈవో బి.మాల్యాద్రి, నాసర్‌వలి, విశ్రాంత ప్రిన్సిపాల్ బాలచెంచయ్య, వెంకటరావు, తేజ భాస్కర్, వెంకటరెడ్డి, సుబ్బారావు, జాకీర్‌హుస్సేన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈవో జి.సంజీవి అన్నారు. శుక్రవారం మండలంలోని పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుపట్టీలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచిచూసి ఉపాధ్యాయులతో మాట్లాడారు.

విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేసేలా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే అదనపు స్టడీ అవర్స్ కూడా నిర్వహించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు సెలవురోజుల్లో కూడా మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం అనుమతిచ్చిందని ఎంఈవో సంజీవి పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ అబ్దుల్‌సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

పామూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసినవారు ఉన్నత శిఖరాలకు చేరుకొంటారని సీఐ ఎం.భీమానాయక్ అన్నారు. శుక్రవారం వివేక జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణను అలవర్చుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఒమెగా విద్యా సంస్థల కరస్పాండెంట్ కల్లూరి రామిరెడ్డి, డెరెక్టర్లు బైరెడ్డి జయరామిరెడ్డి, బి.వెంగళరెడ్డి, డిగ్రీ, జూనియక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మూర్తి మహాలక్ష్మయ్య, తిరుమలశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్డీ ఖాదర్‌వలి, గడ్డె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాల ఆధునికీకరణకు విరాళం

పామూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరిలోని డయాలసిస్ కేంద్రం ఆధునికీకరణకు పామూరు మండలం సట్టుమడుగు గ్రామానికి చెందిన కొంపెల్లి రాజేంద్ర శుక్రవారం ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి రూ.15 వేల నగదును అందజేశారు. ఈసందర్భంగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, సయ్యద్ అమీర్‌బాబు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

దొనకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల జరగకుండా ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌ఐ త్యాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆటో నడిపే ప్రతిఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్సు, ప్రమాద బీమా, వాహనానికి చెందిన అన్నిపత్రాలు కలిగి ఉండాలన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులను ఎక్కించుకోవద్దని చెప్పారు.

ఎక్కడ పడితే అక్కడ వాహనాలు ఆపి ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించవద్దని ఎస్‌ఐ త్యాగరాజు పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రంగనాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రుణాల కోసం భారీగా దరఖాస్తులు

పామూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాల కోసం భారీగా దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. మండలానికి మంజూరైన 62 యూనిట్లకు 658 మంది దరఖాస్తు చేసుకున్నారు. సీఎస్‌పురం మండలానికి సంబంధించి 56 యూనిట్లకు 3369 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఎంపీడీవో ఎం.రంగసుబ్బరాయుడు తెలిపారు. దరఖాస్తుదారులకు బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఐటీ ఇండస్ట్రియల్ విజిట్‌లు విద్యార్థుల్లో ఆలోచనా పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయని పీసీపల్లి పీఎంశ్రీ పాఠశాల ఐటీ ఉపాధ్యాయుడు పి.నాగార్జునరెడ్డి అన్నారు. ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా 9,10 తరగతుల విద్యార్థులకు కనిగిరిలోని ఏబీఆర్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజి కళాశాలలో ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఈసంద్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగానికి వెళ్లాలనుకునే విద్యార్థులు ఇప్పటినుంచే దానిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, ఆదినారాయణ, ఉషారాణి, యషీర తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ వంటకాలను ప్రదర్శించిన చిన్నారులు


కనిగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆహార అలవాట్లపై చిన్నారులు అవగాహన కలిగి ఉండాలని ఐకిడ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ షరీఫ్ అన్నారు. ఐకిడ్స్ స్కూల్‌లో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు విభిన్న రకాల వంటకాలు ప్రదర్శించారు. ఖీర్, కేరళ అన్నం, మిల్లెట్స్‌తో రొట్టెల తయారీ వంటకం, సంప్రదాయ వంటకాలను చేసి చిన్నారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలను మానసికంగా, సామాజికంగా ఏకం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంక్షేమమే తన లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని నగరికంటి బసవయ్య సెంటర్ నుంచి బొడ్డుచావిడి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొంతమంది గృహ యజమానులు ఆటంకంగా మారిన విషయం విధితమే. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చొరవ వహించి అధికారులు, గృహ యజమానులను సమన్వయపరిచి సమస్యను పరిష్కరించారు. శుక్రవారం సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదిమందికి ఉపయోగపడే పనుల్లో పార్టీలు, పంతాలు పక్కన పెట్టాలన్నారు. తాను 2009 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానన్నారు. కొన్ని పనులు అప్పట్లో ఎన్నికలు రావటంతో నిలిచిపోయాయన్నారు. ఆ నిధులు వినియోగించకుండా ఆతర్వాత వచ్చిన పాలకులు నిర్లక్ష్యం చేసి పనులు పూర్తి చేయలేదన్నారు. దాంతో ప్రజలకు సౌకర్యాలు అందక పోవటంతో ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. అలాంటి విధానాలు సరైనవి కావన్నారు. తనకు ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు. కనిగిరి డివిజన్‌గా మారి ప్రజారవాణా ఎక్కువైనప్పటికీ రోడ్లు మాత్రం అలాగే ఉంటే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ప్రతిఒక్కరూ గమనించి సహకరించాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ జోసఫ్ డానియేలు, టీడీపీ నాయకులు రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, తెలుగు మహిళలు కరణం అరుణ, తులసి, దొరసాని, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

నాలకు ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. నారాయణస్వామి ఆలయ ముఖ ద్వారానికి సుమారు 30 కేజీల వెండితో తయారు చేయించిన ముఖద్వారాన్ని ఉగ్ర సమక్షంలో మండపేటకు చెందిన బొల్లా వెంకటస్వామి, వెంకట సుబ్బయ్యల తరుపున పోకా వినోద్‌కుమార్ ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, ఎన్‌సీ మాలకొండయ్య, షేక్ రజ్జబ్‌బాషా, చావా సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాగా మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఉగ్ర ఆవిష్కరించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా శ్రీవారి ఆలయ నిర్మాణం జరుగుతుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ పిడుగు బాబురావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నివసతులు కల్పించాలి

సీఎస్‌పురం(పామూరు), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహోత్సవాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన దేవాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ దర్శనం కోసం దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారన్నారు. వారందరి ఎలాంటి అసౌకర్యాం కల్గించకుండా మంచినీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, విశ్రాంతి గదులు, వాహ


మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

పారదర్శకంగా రీసర్వే

» ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

దొనకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూరీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీవీపురం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా రీసర్వే జరుగుతున్న తీరుపై తహసీల్దార్ రమాదేవితో చర్చించారు. భూముల మ్యాప్‌ను పరిశీలించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీసర్వే రైతులకు మంచి అవకాశమన్నారు. రైతులు పొలాలకు చెందిన పత్రాలతో వచ్చి రీసర్వే చేయించుకొని హద్దులు ఏర్పాటు చేయించుకోవాలన్నారు. భవిష్యత్తులో రైతులకు ఎటువంటి భూసమస్యలు లేకుండా పకడ్బందీగా భూసర్వే జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది రైతుల సమక్షంలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు. అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ చెన్నంశెట్టి వెంకటరావు, వీఆర్వోలు డి.మాచర్ల, టి.శివకోటేశ్వరరావు, ఎం.అర్లయ్య, సర్వేయర్లు టి.ధనలక్ష్మి, ఎం.శ్రీను, కె.వెంకటసుబ్బయ్య, జి.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.


రీసర్వే భూముల మ్యాప్‌ను పరిశీలిస్తూ తహసీల్దార్‌తో చర్చిస్తున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

రైతు విశిష్ట సంఖ్య కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

» జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ముండ్లమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధి కోసం చేపట్టిన విశిష్ట సంఖ్య కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ముండ్లమూరు, పసుపుగల్లు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఏఒక్క రైతుకు అన్యాయం చేయకుండా నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్ళి ప్రతి రైతు తమ ఆధార్ కార్డు చూపించి పొలానికి సంబందించిన సర్వే నెంబరు అందజేసి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కార్యక్రమంలో ఏడీఏ బాలాజీ నాయక్, తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి ఎండీ ఫరూక్, వీఏఏ శోభారాణి, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.


ముండ్లమూరులో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

తాళ్లూరులో..

తాళ్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ విధిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని తాళ్లూరు 1, తాళ్లూరు 2, శివరాంపురం, విఠలాపురం రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములున్న ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య నమోదవుతుందన్నారు. మును ముందు ప్రభుత్వ పథకాలకు ఇది అవసరమవుతుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద రావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులు వ్యవసాయశాఖకు సహకరించి సంబంధిత వ్యక్తుల ఆధార్‌నంబర్, ఫోన్, భూమి వివరాలను తెలపాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు ఎం.రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు నాయక్, వెంకట్రావు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాల ద్వారా గ్రామాభివృద్ధి

» డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు

ముండ్లమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెత్త సంపద కేంద్రాల ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాలు సక్రమంగా వినియోగించుకొవాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త సంపద కేంద్రాల వల్ల వచ్చే ఆదాయాన్ని మౌలిక వసతుల కల్పనకు వినియోగించి గ్రామాలను అభివృద్ధి చేయటం జరుగుతుందని అన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవన్నారు. గ్రామాభివృద్ధికి విడుదల అవుతున్న నిధులను సక్రమంగా నిధులు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సర్వేలను సక్రమంగా నిర్వహించాలని కార్యదర్శులను ఆదేశించారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు ప్రతి ఇంటికి వచ్చి చెత్త సంపద కేంద్రాల వల్ల ఉపయోగాలను తెలియజేయాలన్నారు. ఎంపీడీవో, ఈవోఆర్డీ గ్రామాలను సందర్శించి పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, పంచాయతీ కార్యదర్శులు జె.రాజరాజేశ్వరి, గురునాథం, సర్పంచ్‌లు జమ్ముల గురవయ్య, జనమాల నాగేంద్రం పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


కెల్లంపల్లిలో చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీవో వెంకటనాయుడు

కూటమి ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణ

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

» రాజంపల్లిలో 50 కుటుంబాలు పార్టీలో చేరిక

దర్శి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని రాజంపల్లిలో ముస్లిం యూత్ ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు వారికి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి అన్నివర్గాల ప్రజల సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు పూర్తి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో అందరికీ మేలు జరుగుతున్నదని అన్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నారని చెప్పారు. రాజంపల్లిలో ముస్లిం మైనార్టీ వర్గంకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరటం ఆనందంగా ఉందన్నారు అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేస్తామన్నారు.


టీడీపీలో చేరినవారితో డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే పాపారావు తదితరులు

సీసీ రోడ్లు ప్రారంభం

రాజంపల్లి ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాల్వలను డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి శుక్రవారం రాత్రి ప్రారంభించారు ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. రోడ్లకు మరమ్మతులు చేసి గుంతలరహిత రాష్ట్రంగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని గురించి పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మాజీ ఎంపీపీ ఫణిదపు వెంకటరామయ్య, టీడీపీ నాయకులు దామా కృష్ణ, వజ్జా నాగమణి, మైనార్టీ సెల్ నాయకుడు అల్లాభక్షు, వీసీ రెడ్డి పాల్గొన్నారు.

దర్శి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం

దర్శి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): దర్శి నగర పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని సాయినగర్‌లో రూ.15 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, కల్వర్టుకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దర్శి పట్టణంలోని అన్నీ వీధుల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మించి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. అమృత్ పథకం కింద ఇంటింటికి కొళాయి ఏర్పాటు త్వరలో జరుగుతుందన్నారు. వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, తదితరులు పాల్గొన్నారు.

'అన్నిప్రాంతాల్లో సీసీ రోడ్లు నిర్మిస్తాం'

దర్శి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అన్నీ వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించి అభివృద్ధి చేస్తామని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తెలిపారు. శుక్రవారం దర్శి పట్టణంలోని 8వ వార్డులో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంతకాలంగా తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నట్టు స్థానికులు తెలిపారు. మంచినీటి పైపులైన్ ఉన్నప్పటికీ తాగునీరు సరఫరా కావటం లేదని మహిళలు పేర్కొన్నారు. స్పందించిన చైర్మన్ వెంటనే తాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు దొనకొండ విద్యార్థుల ఎంపిక


క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రామాంజనేయులు, పీడీ నర్సింహారావు తదితరులు

దొనకొండ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు దొనకొండ జడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అలాగే, రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ కె.నర్సింహారావు తెలిపారు. 9వ తరగతి విద్యార్థులు పత్తి వెంకట లక్ష్మీనారాయణ, ఎనుబరి ప్రైసీలు ఇటీవల తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున పాల్గొన్నారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చిన వీరు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు.

ఈనెల 23 నుంచి హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున వీరు పాల్గొంటారు. అలాగే, ఈనెల 23 నుంచి కర్నూల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టుకు పాఠశాలకు చెందిన బి.చంద్రశేఖర్, దండబోయిన ఏడుకొండలు ఎంపికైనట్లు పీడీ నర్సింహారావు తెలిపారు. ఈసందర్భంగా పీడీ నర్సింహారావును హెచ్‌ఎం రామాంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బొద్దికూరపాడులో ఘర్షణపై కేసులు నమోదు

తాళ్లూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో రెండురోజుల క్రితం జరిగిన ఘర్షణపై రెండు కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పాలపర్తి వీరయ్య కుటుంబీకులను ఆదేగ్రామానికి చెందిన పోలంరెడ్డి వెంకటేశ్వరెడ్డి మరి కొందరు కులంపేరుతో దూషించి దౌర్జన్యం చేశారన్న ఫిర్యాదు మేరకు కులదూషణ కేసు నమోదయింది.

బాపట్ల జిల్లా పావులూరుకు చెందిన వీరయ్య గొర్రెలు మేపుకుంటూ రెండు నెలల కిత్రం గ్రామానికి వచ్చాడు. వెంకటేశ్వరరెడ్డి పొలంలో గొర్రెలు మేయటంతో ఆగ్రహించి వీరయ్య కుటుంబీకులపై కులంపేరుతో దూషించి ఘర్షణ పడ్డారు. రూ.3 లక్షల నగదు కూడా అపహరించారని వీరయ్య స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కులదూషణ, నగదు చోరీ కేసు నమోదు చేశారు.

ఇదిలాఉండగా వీరయ్య గొర్రెల మందను కంది చేలో మేపుతుండగా మందలించినందుకు తమను దుర్భాషలాడి దాడులు చేశారని పోలంరెడ్డి వెంకటేశ్వరెడ్డి, భార్య రాజేశ్వరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం బొద్దికూరపాడు గ్రామానికి వెళ్లి ఎస్‌ఐ విచారణ చేపట్టారు. ఆయన వెంట ఏఎస్‌ఐ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

కురిచేడు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. మండలంలోని బోదనంపాడు గ్రామంలో టమోటా తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా తమ గోడు వెళ్లబోసుకున్నారు. ధరలేక కాయలు కోయకుండా వదిలివేస్తున్నామని చెప్పారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టమోటా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో మాట్లాడి వారి కష్టాలను తర్చేందుకు కృషి చేస్తానన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల పంటలను కొనుగోలు చేసేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుసెట్టి పాపారావు, దర్శి నగరపంచాయతీ చైర్మన్ నారపుసెట్టి పిచ్చయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు పిడతల నెమిలయ్య, కాట్రాజు నాగరాజు, మొఘల్ మస్తాన్ వలి, గంధం గురునాథం, కాశీ విశ్వనాధరావు, అంజయ్య, క్రిష్ణ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పీసీపల్లి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని రేగడ గ్రామంలో శుక్రవారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాజమాన్య పద్ధతులను అనుసరించి పండించిన పంటల విత్తనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ల్యాబ్ పరిశీలనలో ఎటువంటి క్రిమి సంహారక మందులు, రసాయనిక ఎరువులు వాడలేదని నిర్ధారణ అయితే అటువంటి పంట ఉత్పత్తులకు సర్టిఫికెట్ ఇస్తామని చెప్పారు. దీనిద్వారా పంటను అధిక ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.ప్రకాశరావు, ఏఈవో పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచంపట్టిన నూజెండ్లపల్లి

ముండ్లమూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూజెండ్లపల్లి, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో గత వారం రోజుల నుంచి చికెన్ గున్యా వ్యాధి సోకి ప్రజలు మంచం పట్టారు. తొలుత జ్వరం రావటం, ఆతరువాత మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క నూజెండ్లపల్లి గ్రామంలోనే 50 మందికి పైగా చికెన్ గున్యా భారిన పడి అద్దంకి, ఒంగోలు ప్రాంతాలకు వెళ్ళి చికిత్స చేయించుకుంటున్నారు. ఉమామహేశ్వరపురం అగ్రహారంలో దాదాపు 25 మందికిపైగా మంచం పట్టారు.





ప్రతి ఓటూ... ప్రతిష్ఠాత్మకమే



- కొత్తగా చేరిన లక్ష ఓట్లు
- గత ఎన్నికలో చెల్లనవి అధికం
- కలసి కదులుతున్న కూటమి నేతలు
- సిట్టింగ్ స్థానం నిలుపుకునేందుకు పీడీఎఫ్ యత్నాలు
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శ్రేణులతో సమీక్షలు
- పట్టభద్రులను కలసి మద్దతు కోరుతున్న అభ్యర్థులు

(నరసరావుపేట, గుంటూరు- ఆంధ్రజ్యోతి)

కృష్ణా.. గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. అధికారంలో ఉండటం. శాసనసభ ఎన్నికల్లో స్వీప్ చేయడంతో ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా కైవశం చేసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను కూటమి బరిలో దింపింది. కూటమి హైకమాండ్ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకునేందుకు పీడీఎఫ్ సర్వశక్తులు ఒడ్డుతోంది. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావును పీడీఎఫ్ పోటీలో నిలిపింది. ఇటు కూటమి.. అటు పీడీఎఫ్ పట్ట భద్రులైన ఓటర్లను ఆకట్టుకునేందుకు వ్యూహాత్మకం గా వ్యవహరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

ప్రతి ఓటూ కీలమే..

2019 పట్టభద్రుల ఎన్నికల్లో గతంలో చెల్లని ఓట్లు ఎక్కువగా ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని, ఈ సారి అభ్యర్థులు ప్రతి ఓటు చెల్లేలా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. గత ఎన్నికల్లో 13,509 ఓట్లు చెల్లలేదు. 2,48,799 ఓట్లు ఉండగా 1,49,319 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. 60 శాతం ఓట్లు మాత్రమే పోలు కావడంతో ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ఓటుకు వచ్చేలా ప్రయత్నిస్తున్నారు. చెల్లని ఓట్ల సంఖ్య తగ్గించే దిశగా కూడా అభ్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఓటు వేసే విధానంపై కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ముఖ్య నేతలకు లోకేష్ ఫోన్

యువనేత నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి అసెంబ్లీ స్థానం కూడా ఈ ఎన్నికల పరిధిలో ఉండటంతో ఆయన కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేస్తున్నారు. రెండు ఉమ్మడి జిల్లాల్లోని ముఖ్య నేతలకు ఆయన నేరుగా ఫోన్ చేసి పార్టీ అభ్యర్థి విజయం కోసం శ్రమించాల్సిందిగా ఆదేశిస్తున్నారు. ఈ నియోజకవర్గ పరిధిలో ఉన్న మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో పాటు పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా రాజా గెలుపు కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వీరితో పాటు ఇతర జిల్లాలకు చెందిన టీడీపీ సీనియర్ నేతలు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రి పరిటాల సునీత తనయుడు పరిటాల శ్రీరామ్ తదితరులను కూడా యువనేత లోకేశ్ రంగంలోకి దించి ప్రచారం నిర్వహింప చేస్తున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలతో పాటు ఆయా నియోజకవర్గాల్లోని జనసేన, బీజేపీ నేతలు కూడా ఇప్పటికే తమ నియోజకవర్గాల్లో పలు మార్లు సమావేశాలు నిర్వహించి రాజాను గెలిపించాల్సిందిగా కోరటం జరిగింది.

కొత్తగా చేరిన లక్ష ఓట్లు

2019తో పోలిస్తే ఈ సంవత్సరం లక్ష ఓట్లు కొత్తగా చేరాయి. 2019లో 2,48,799 ఓట్లు ఉండగా, ఈ సంవత్సరం 3,47,116 ఓట్లు నమోదయ్యాయి. 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఓట్లు 25 ఉన్నాయి. కూటమి వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలను నిర్వహించి పట్టభద్రుల ఓట్లు చేర్చుకొనేందుకు సహకరించింది. దీంతో ఓట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో ఉత్సాహం ఉన్నవారే ఓటు నమోదు చేసుకునేవారు. ఈ సారి నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమాల కూడా ఓటర్ల సంఖ్య పెరగడానికి కారణమయింది. మొత్తం మీద పెరిగిన ఓట్లు ఏ అభ్యర్థికి అనుకూలంగా మారతాయో చూడాలి.

ప్రచారంలో బిజీగా నేతలు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సమయం సమీపిస్తుండటంతో అన్ని పార్టీల అభ్యర్థులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవశం చేసుకొనేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఉన్న ఓట్లను ప్రాతిపదికగా చేసుకొని ఒక ఇన్‌చార్జిని నియమిం చడంతో పాటు ప్రతి 30 మంది ఓటర్లకు ఒక బాధ్యుడిని ఏర్పాటు చేసి ఓటర్లను కలిసే కార్యక్ర మం చేపట్టింది. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఓటరుని కూటమి శ్రేణులు కలసి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని వివరిస్తూ మద్దతు కూడగడుతున్నారు. ప్రతి అసెంబ్లీ నియో జక వర్గానికి ఒక ఎన్నికల పరిశీలకుడిని కూటమి నియమించింది. వీరు ఎప్పటికప్పుడు ప్రచార సరళిని సమీక్షిస్తున్నారు. ప్రచారంలో ఎక్కడైనా లోటు పాట్లు ఉంటే పరిశీలకులు సరిదిద్దుతున్నారు. ఒక్కొక్క ఓటరును రెండు సార్లు అయినా కలసి సానుకూల ఓటింగ్ జరిగేలా ముమ్మర ప్రయత్నాలు చేస్తు న్నారు. టీడీపీ సెంట్రల్ కార్యాలయం నుంచి కూడా ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిపై సమీక్షలను నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆలపాటిని గెలిపించాలని స్వయంగా వారు పట్టభద్రులను కలసి ఓటు అభ్యర్థిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, న్యాయవాద సంఘాలను కలసి జగన్ పాలనలో ఉద్యోగ వర్గాలకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తున్నారు. కూటమి, పీడీఎఫ్‌కు ఈ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో ఆలపాటి రాజా.. లక్ష్మణరావు మధ్య పోటీ రసవత్తరంగా మారింది.

రోస్టర్‌లో.. తప్పులు నిరుద్యోగులకు తిప్పలు

- రోస్టర్ ప్రకటనలో లోపాలపై అభ్యర్థుల్లో కలవరం

ఈ నెల 23వ తేదీన ప్రారంభం కానున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు, గ్రూప్-2 అభ్యర్థులు వేడుకొంటు న్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్- 2 నోటిఫికేషన్ లోపభూయిష్టంగా ఉందని, నోటిఫికేషన్‌పై నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం అభ్యర్థుల ఎంపిక జరిగితే మెరిట్ అభ్యర్థులు తీవ్ర అన్యా యానికి గురవుతారని వారు ఆందోళన చెందుతున్నారు. రోస్టర్ సరిచేసేంత వరకూ మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలంటూ రెండు రోజులుగా గుంటూరులో ఆందోళనలు చేస్తున్నారు. సరిగ్గా మెయిన్స్ పరీక్షకు ఒక్కరోజు ముందు, శుక్రవారం ఉదయం గుంటూరు కలెక్ట రేట్ ఎదుట వందల మంది అభ్యర్థులు ఆందోళనకు దిగారు.

ప్రభుత్వం పట్టించుకోవాలంటూ రోడ్డెక్కిన అభ్యర్థులు



గుంటూరు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న గ్రూపు- 2 అభ్యర్థులు

- ఎన్నికలకు ముందు హడావుడిగా గత ప్రభుత్వం నోటిఫికేషన్
- గత ప్రభుత్వం తెచ్చిన జీవో. నెం. 77తో మరింత గందరగోళం
- సరిచేయాలని కొంతకాలంగా నిరుద్యోగుల అభ్యర్థన
- రెండు రోజుల్లో మెయిన్స్.. వాయిదా కోరుతూ ఆందోళన
- గుంటూరు కలెక్టరేట్ వద్ద నిరసనలు

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీచేసింది. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని చెప్పిన గత ముఖ్యమంత్రి ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా, ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా ఎన్నికలకు ముందు నిరుద్యోగులను బుజ్జగించడానికి, వారి ఓట్లు పొందడానికి అన్నట్లుగా ఎన్నికలకు ముందు హడావుడిగా గ్రూప్-2 నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ చూసుకున్న నిరుద్యోగులు ఆందోళ నకు గురయ్యారు. నోటిఫికేషన్లో ప్రకటించిన రోస్టర్ పాయింట్లు తప్పుల తడకగా ఉన్నట్లు గుర్తించి, వాటిని సరిచేయాలని ఆందోళన చేపట్టారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్సీలు కూడా రోస్టర్ తప్పులను ప్రభు త్వానికి ఎత్తి చూపారు. అయిన ప్పటికీ యథావిధిగా గ్రూప్- 2 ప్రిలిమ్స్ పరీక్షలు జరిగిపోయాయి. ఆ తరువాత ఎన్నికల్లో ప్రభుత్వం మారింది. కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చాక ఏపీపీఎస్సీ బోర్డులో మార్పులు జరిగాయి. దీంతో గ్రూప్- 2 నోటిఫికేషన్లో దొర్లిన తప్పులను ఏపీపీఎస్సీ సరిచేస్తుందని భావించారు. కానీ ఆ దిశగా ఏమీ జరగలేదు. దీంతో ఆందోళన చెందిన పలువురు గ్రూప్- 2 అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. కేసును విచారిస్తున్న హైకోర్టు రోస్టరుపై నిర్దిష్టమైన తీర్పు ఏదీ ఇవ్వలేదు. కానీ పరీక్షల నిర్వహణను యథావిధిగా ఈనెల 23 నుంచి కొనసాగించుకోవచ్చని సూచిం చింది. అప్పటి వరకూ కోర్టుపైనే ఆశలు పెట్టుకున్న నిరుద్యోగులు కోర్టు తీర్పుతో తీవ్ర కలవరానికి గురయ్యారు. ఆందోళనబాట పట్టారు.

● వైసీపీ నిర్వాకంతో.. నిరుద్యోగుల్లో నిస్పృహ

గత వైసీపీ ప్రభుత్వం ఏటా జాబ్ క్యాలెండర్ అని చెప్పి, ఐదేళ్లలో ఒక్క ఏడాది కూడా క్యాలెండర్ విడుదల చేయ లేదు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా 2023 డి సెంబరు 7న గ్రూప్- 2 నోటిఫికేషన్ విడుదల చేసింది. అందులో కూడా నామమాత్రంగా 905 పోస్టులు మాత్రమే ఉన్నాయి. అందులో కీల కమైన గెజిటెడ్ పోస్టులు మున్సిపల్ కమిషనర్ 4, సబ్ రిజిస్ట్రార్ 16, లేబర్ ఆఫీ సర్ 28, పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ 2, కోఆపరేటివ్ సొసైటీస్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ 16 పోస్టులు ఉండగా, డిప్యూటీ తహసీల్దార్ 114, ఎక్సైజ్ ఎస్సై 150 మాత్రమే ఉన్నాయి. డీటీ, ఎక్సైజ్ ఎస్సై పోస్టులు మినహా మిగిలిన అన్ని పోస్టుల్లో జనరల్ కేటగిరీకి, మహిళా కోటాకు సమానంగా పోస్టులు వస్తున్నాయి. ఐదేళ్ల తరువాత వచ్చిన నోటిఫికేషన్లో నామమాత్రంగానే పోస్టులు ఉండడం, అందులోనూ రిజర్వేషన్ లేకుండా పోవడంతో అభ్యర్థులు నిరాశకు గురవుతున్నారు. ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో వెలువడే నోటిఫికేషన్లలో కూడా తమకు మేలు జరగదన్నా నిస్పృహ వారిని వెంటాడుతోంది.

● గత ప్రభుత్వం తెచ్చిన జీవోతో తంటా..

గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్లపై 2023 ఆగస్టులో జీవో. ఎంఎస్. నెం.77ను జారీ చేసింది. రిజర్వేషన్లలో భాగంగా మహిళలు, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్ మెన్‌లకు సంబంధించి వర్టికల్ రిజర్వేషన్‌ను అందులో ప్రకటించింది. జీవో ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థుల ఎం పికలో మహిళలకు కేటాయించిన 33.33 శాతం వర్టికల్ రిజర్వేషన్‌ను అమలు చేస్తారు. అంటే ఆయా కేటగిరీలు, సబ్ కేటగిరీల్లో ఎంపిక చేసే అభ్యర్థుల్లో మూడో వంతు మహిళలకు కేటాయి స్తారు. ఇది గతం నుంచి అమలులో ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం దీని కోసం ప్రత్యేకమైన జీవో తెచ్చింది. ఆ జీవోలో రోస్టర్ పాయింట్లను ప్రకటించింది. గతంలో అమలులో ఉన్న జీవో ప్రకారం వంద పాయింట్ల రోస్టర్ విధానంలో హారిజాంటల్ రిజర్వే షన్లో భాగంగా ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు పోస్టులు కేటాయిస్తారు. అందులోనే వర్టికల్ రిజర్వేషన్ కోటా కింద 1/3 వంతు మహిళల కోటా పోస్టులు కూడా ప్రకటిస్తారు. ఆ వంద పాయింట్ల రోస్టర్ లోనే జనరల్ ఎన్ని, మహిళలు, ఇతర ప్రత్యేక రిజర్వేషన్ అభ్య ర్థులకు ఎన్ని అనేది స్పష్టంగా ఉంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోలో పోస్టుల ఎదుట హారిజాంటల్ కేటగిరీ పోస్టులను ప్రకటించలేదు. దీం తో వర్టికల్ రిజర్వేషన్‌పై గ్రూప్-2 నోటిఫికేషన్లో గందర గోళం నెలకొంది.

● ఆందోళనకు కారణం..

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన గ్రూప్- 2 నోటిఫికేషన్లో ఉన్న మొత్తం పోస్టుల్లో 45 శాతం పోస్టులు మహిళలకే కేటాయించి ఉన్నాయని అభ్యర్థులు

(మిగతా 6వ పేజీలో)

వారబందీ అమలు చేయండి

- కలెక్టర్ అరుణ్‌బాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి సరఫరాలో వారబందీ విధానాన్ని అమలు చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. నీటి వినియోగంపై నియంత్రణ ఏదీ..? అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై స్పందిచిన ఆయన శుక్రవారం ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రధాన రెండు రిజర్వాయర్లు నాగార్జున సాగర్.. పులిచింతలలో నీటి కొరత ఉందని , దీని కారణంగా సాగుకు నీటి సరఫరాలో వార బందీ ప్రక్రియను అమలు చేయాలన్నారు. సాగు నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నీటి విడుదల్లో తాగు నీటికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని చెరువులలో పూర్తి స్థాయి నీటి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు మంచి నీటి ఇబ్బంది లేకుండా తాగు నీటి సఫరా చేయాలని ఆదేశించారు. నీరు వృధా, చెరువులలో నీరు లీకేజీ కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవా లన్నారు. జిల్లాకు ఎంత నీరు అవసరం ఉందో సదరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి మురళీ, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, ఈఈ లు మురళీ కృష్ణ, శ్రీహరి, ప్రేమ్ కుమార్, మురళీ, ఉద్యాన వన శాఖ అధికారి రామణా రెడ్డి, గ్రామీణ నీటి సరఫరా అధికారులు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- వైదనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం



వైదనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి రవికుమార్

బల్లికురవ. ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచించారు. శుక్రవారం బల్లికురవ మండలంలోని వైదన గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే ముస్లింలకు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.50లక్షలతో చేపట్టనున్న షాదీఖానా నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు సార్వత్రిక ఎన్నికలలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వరుస క్రమంలో అమలు చేస్తున్నామన్నారు. జూన్‌లో విద్యార్థులకు తల్లికి వందనం కింద నగదు జమచేస్తామన్నారు. అలానే రైతులకు పెట్టుబడి సాయం అందించే చర్యలు మొదలు పెట్టామన్నారు. వైదన గ్రామంలోని వసతి గృహం అభివృద్ధికి రూ. 50 లక్షల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అలానే గ్రామ పంచాయతీల నిధులను గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన మాదిరిగా మట్టి రోడ్లకు వాడకుండా ప్రజలకు ఉపయోగపడేలా వినియోగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా పలువురు వృద్ధులు తమకు పింఛన్లు రావటం లేదని మంత్రికి అర్జీలు సమర్పించారు. వైదన ఉర్దూ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమాలలో విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, పీఆర్ డీఈ విఠల్‌నాయక్, మండల పార్టీ నేతలు పోగుల శేఖర్, కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, జాష్టి వెంకటనారాయణబాబు, గొట్టిపాటి లక్ష్మయ్య, కోట శ్రీనివాసరావు, గొట్టిపాటి శంకర్, యాగంటి సింగరయ్య, దేవినేని శివయ్య, టీడీపీ గ్రామ నేతలు ఏలూరి శ్రీను, తిరుమలశెట్టి సుబ్బారావు, గాలం శ్రీనివాసరావు, గాలం నిమ్మయ్య, షేక్ గోపి, భూడే, తదితరులు పాల్గొన్నారు.అద్దంకి నియోజకవర్గంలోని బొడ్డువానిపాలెం, అద్దంకి, కొమ్మాలపాడు, కొప్పెరపాడు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ వైదన గ్రామంలో ఉచితంగా బ్యాటరీ చార్జింగ్ సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వైదనలో పీహెచ్‌సీ పెట్టండి.. స్థలం ఇస్తాం

మండలంలోని కొప్పెరపాడు గ్రామానికి పీహెచ్‌సీ మంజూరు అయి స్థలం లేక ఇంతవరకు ప్రారంభించ లేదని, వైదన గ్రామంలో స్థలం ఇస్తామని, మా గ్రామానికి పీహెచ్‌సీని తరలించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు వైదన గ్రామస్థులు విన్నవించారు. రెండేళ్లుగా స్థలం లేక పీహెచ్‌సీ గాలిలో ఉందని తాము పీహెచ్‌సీకి అవసరమైన స్థలాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నామని, పరిశీలించాలని వారు మంత్రికి వినతిపత్రం అందించారు.

గుడ్డుకాయ స్వాహా





బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు.



మరమ్మతులకు గురై చప్టాపై నిలిచిపోయిన గ్రానైట్ లారీ

చప్టాలో నిలిచిన గ్రానైట్ లారీ

రెండు రోజుల నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

బల్లికురవ, సంతమాగులూరు ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ - సంతమాగులూరు రోడ్డులో బండివారిపాలెం వద్ద గల నేల చప్టాలో గురువారం గ్రానైట్ స్లాబుల లారీ మరమ్మతులకు గురై నిలిచి పోయింది. శుక్రవారం సాయంత్రం వరకు కూడా ఈ లారీ అలానే ఉండటంతో ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో సంతమాగులూరు నుంచి బల్లికురవ వెళ్లాల్సిన వాహనాలు మిన్నెకల్లు మీదుగా వెళ్తున్నాయి. పత్తేపురం నుండి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గ్రామ ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు సైతం పక్కదారుల నుంచి ప్రయాణం సాగిస్తున్నాయి. వెంటనే లారీకి సంబంధించిన యజమానులు పక్కకు తీయించాలని ప్రజలు కోరుతున్నారు.



మునిసిపల్ కమిషనర్‌కు
వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ కూటమి నాయకులు

వార్డుల్లో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పురపాలక సంఘం పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించాలని టీడీపీ కూటమి నాయకులు అన్నారు. శుక్రవారం కమీషనర్ అబ్దుల్ రషీద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్య లోపంతో దోమలు బెడద అధికంగా ఉన్నట్లు వివరించారు. అలాగే వీధి కుక్కలు ప్రజలు వేధిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు కమీషనర్‌కు వినతిపత్రం అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు గజవల్లి శ్రీనివాసరావు, కొండ్రు రత్నబాబు, తిరుపతి రాయుడు, శ్రీను, మస్తాన్‌రావు, కుమార్‌బాబు, మంగపతి, చంద్ర తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశనుంచే దయా గుణం కలిగి ఉండాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరు విద్యార్థి దశనుంచే ఇతరుల పట్ల దయా గుణం కలిగి ఉండాలని శ్రీకామాక్షికేర్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన కుమారుడు జ్ఞానేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజ్, మంజుల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ మేళాకు.. పోటెత్తిన జనం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ భయంతో రెండు వారాలుగా ముక్కకి.. ముద్దకి దూరంగా ఉన్న వారంతా కరువు తీరా కోడి పలావ్ ఆరగించారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించేందుకు గుంటూరు పట్టాభిపురం స్వామి థియేటర్ గ్రౌండ్స్‌లో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన చికెన్, గుడ్డు ఆహార మేళాకు జనం పోటెత్తారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహమ్మద్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రజలందరూ ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని పిలుపునిచ్చారు. ఉడికించిన వాటిని తినటం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉడికించిన చికెన్, గుడ్లను తినొచ్చని చెప్పిందన్నారు. డాక్టర్ రాయపాటి మమత, డాక్టర్ నిమ్మల శేషయ్య మాట్లాడుతూ ఉడికించిన చికెన్, గుడ్లు తినడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అన్ని కథనాలను నమ్మాల్సిన పని లేదని చెప్పారు. మాంసం, గుడ్లు తినటం వల్ల పౌష్టికాహార లోపాలు ఉండవని చెప్పారు. లేని పోని అపోహలు విడనాడాలని పిలుపునిచ్చారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ కేసులు లేవని చెప్పారు. ప్రజలు లేని పోని అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలు తొలగించేందుకు ఈ ఫుడ్ మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. భయం విడనాడాలని, సోషల్ మీడియా కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గుంటూరు జిల్లా పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ సోషల్ మీడియాలో జరిగిన అసత్య ప్రచారం కారణంగా చికెన్, గుడ్లు వ్యాపారం దారుణంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, భాష్యం విద్యా సంస్థల అధినేత రామకృష్ణ, స్టాండింగ్ కమిటీ మెంబర్ బాబు, పౌల్ట్రీ ట్రేడర్ అసోసియేషన్ నేతలు ఎం. కిషోర్ బాబు, సురేష్, నాగేశ్వరరావు, రేణుక, గిరి, అసోసియేషన్ మెంబర్లు పాల్గొన్నారు.

రోస్టర్‌లో తప్పులు...
నిరుద్యోగులకు తిప్పలు

(5వ పేజీ తరువాయి)

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన వర్టికల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం పోస్టుల్లో 1/3వంతు పోస్టులు మాత్రమే మహిళలకు వెళ్లాలి. కానీ కొన్ని కేటగిరీల్లో సగానికి సగం మహిళలకు వెళుతున్నాయని, కొన్ని కేటగిరీల్లో మహిళలకు రావాల్సిన 1/3వ వంతు కూడా రావడంలేదని అభ్యర్థులు అంటున్నారు. నోటిఫికేషన్లో మొత్తం 905 పోస్టులు ఉండగా అందులో 140 పోస్టుల వరకూ రోస్టర్ గందరగోళం ఉన్నట్లు చెబుతున్నారు. జనరల్ కోటాలో 408 పోస్టులుండగా మహిళలకు రమారమి 112 పోస్టులు రావాల్సి ఉండగా, వారికి అదనంగా 25 పోస్టులు కలిసి 137 పోస్టులు వచ్చాయని, అవి జనరల్ అభ్యర్థులు నష్టపోయారని, ఎస్సీ కేటగిరీలో మహిళలకు 25 పోస్టులు రావాల్సి ఉండగా వారికి 7 పోస్టులు తగ్గి 18 పోస్టులు, ఈ డబ్ల్యూఎస్ కోటాలో 20 పోస్టులు మహిళలకు రావాల్సి ఉండగా, వారికి 5 పోస్టులు తగ్గి 15 పోస్టులు మాత్రమ వచ్చాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని కేటగిరీల్లో రెండు పోస్టులే ఉన్నాయి. అలాంటి చోట్ల ఒకటి జనరల్, ఒకటి మహిళలకు కేటాయించారు. అలాంటి ప్రత్యేక సందర్భంలో జనరల్ అభ్యర్థులు భారీగా పోస్టులు కోల్పోయారు. ప్రభుత్వం ప్రకటించిన రోస్టర్ విధానంతో నిరుద్యోగుల తలరాతలు మారిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ నిర్వాకంతో ఐదేళ్లపాటు నోటిఫికేషన్లు లేక అల్లాడిపోయిన తమకు తాజా నోటిఫికేషన్ ప్రకారం రోస్టర్ అమలు జరిగితే ఇప్పుడే కాకుండా భవిష్యత్తులో కూడా అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. ప్రభుత్వం రోస్టర్ తప్పులను సరిచేసిన తరువాతే మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని వేడుకుంటున్నారు. కాగా ఈనెల 11వ తేదీన ఈ అంశంపై హైకోర్టులో తీర్పు వచ్చే అవకాశం ఉందని, అప్పటి వరకైనా మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

చీరాల్లో రేబిస్ కలకలం

- నాలుగు రోజుల క్రితం కుక్క కాటు
- అవగాహన లేమితో నిర్లక్ష్యం
- రెండు రోజుల నుంచి అనారోగ్యం
- హాస్పిటల్లో చేరిన బాధితురాలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలో శుక్రవారం రేబిస్ వ్యాధి కలకలం రేపింది. వేటపాలెం మండలం లక్ష్మీపురంకు చెందిన రోజువారీ కూలీ కామేశ్వరమ్మ రేబిస్ లక్షణాలతో చీరాల ఏరియా హాస్పిటల్లో చేరడంతో ఆరోగ్య సిబ్బంది ఆ లక్షణాలు గుర్తించి నివ్వెరపోయారు. వేటపాలెం మండల పరిధిలోని లక్ష్మీపురం, చీరాల మండల పరిధిలోని జాండ్రపేట పక్క పక్క గ్రామాలు. లక్ష్మీపురంకు చెందిన కామేశ్వరమ్మ కూలి పనుల నిమిత్తం జాండ్రపేట, లక్ష్మీపురంలలో పనులు చేస్తూ ఉంటోంది. ఈక్రమంలో సుమారు నాలుగు రోజుల క్రితం జాండ్రపేట సమీపంలో ఓ వీధి కుక్క ఆమె చెవి సమీపంలో దాడిచేసి గాయపరచింది. అయితే అవగాహన లేమితో బాధితురాలు చికిత్స చేయించలేదు. గురువారం రాత్రి నుంచి కామేశ్వరమ్మ ఆహారం తీసుకోలేక పోతోంది. మంచినీళ్లు కూడా తాగలేక ఇబ్బందులు పడుతోంది. అంతేకాకుండా నోటి నుంచి సొంగ కారుతుండటంతో కంగుతిన్న భర్త నారాయణరెడ్డి హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలించాడు. ఈక్రమంలో చికిత్స ప్రారంభించిన వైద్యులు రేబిస్ లక్షణాలను గుర్తించి నివ్వెరపోయారు. వెంటనే 108 సహాయంతో గుంటూరులోని ప్రత్యేక విభాగానికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం ఆమెను కుక్క కరచిన రోజే మరో ముగ్గురిని కరిచినట్లు వారు తెలిపారు.



ఇటీవల రామనగర్ న్యూ కాలనీలో ఓ వ్యక్తిని కుక్కకరవడంతో కారుతున్న రక్తం



రేబిస్ లక్షణాలతో చికిత్స పొందుతున్న కామేశ్వరమ్మ

రోజులో రెండు సార్లు కుక్కలు కరిచాయి

\- జంజనం ఆదిలక్ష్మి, లక్ష్మీపురం



గ్రామంలో ప్రతి వీధిలో కుక్కలు బెంబేలెత్తిస్తున్నాయి. ఈనెల 1వ తేదీ నుంచి ఇప్పటికి ఏడుగురిని కుక్కలు కరిచాయి. నాకు ఇటీవల కుక్క కరవగానే వ్యాక్సిన్ చేయించుకున్నాను. మరో రెండు సార్లు వ్యాక్సిన్ చేయించుకోవాల్సి ఉండగానే మరోమారు రెండో కాలును కూడా కుక్క కరిచింది. గ్రామంలో భయంగా ఉంటోంది. అధికారులు మా గోడు పట్టించుకోవాలి.

అమాంతం మీదకు వస్తున్నాయి



\- వంగర వెంకటేశ్వర్లు, లక్ష్మీపురం

గతకొంత కాలంగా గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వాహనాలపై ప్రయాణించే సమయంలో అమాంతం మీదకు దూకుతున్నాయి. దీంతో రెండుసార్లు ద్విచక్ర వాహనం నుంచి కిందపడి గాయాల పాలయ్యాం. రాత్రివేళల్లో ప్రయాణాలు నరకప్రాయంగా ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

బొబ్బేపల్లి గ్రావెల్‌కొండ అటవీశాఖదే

ఆశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి

మార్టూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బొబ్బేపల్లి గ్రావెల్ కొండ అటవీశాఖకు చెందినదని,అటవీ శాఖ అనుమతులు లేకుండా ఎలాంటి అక్రమ కార్యకలాపాలు చేయకూడదని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి స్పష్టంచేశారు. శుక్రవారం మండలంలోని బొబ్బేపల్లి గ్రావెల్ కొండపై ఏక్‌పేడ్‌మాకెనామ్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులతో కలిసి మొక్కలను నాటారు. ఈసందర్భంగా చిరంజీవిచౌదరి మాట్లాడుతూ బొబ్బేపల్లి గ్రావెల్ కొండ 357.5 ఎకరాలు 1894 లోనే మద్రాసు ఫారెస్ట్ యాక్టులో రిజర్వ్ ఫారెస్ట్ భూమిగా నమోదు అయిందన్నారు.ఇప్పటివరకు కొండపై అక్రమ మైనింగ్ జరిగిందని, ఇకనుంచి ఈ అటవీ భూమిని కాపాడుకోవడంలో గ్రామస్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. కొండప్రాంతంలో మొక్కలను నాటాలని, వాటి పెంపకంపై కూడా సహకారం అందించాలని , అందుకు ప్రభుత్వం సహకారం ఉంటుందని అన్నారు. అటవీ భూమిలో గ్రామస్థులు వ్యక్తిగతం గా కాకుండా ఉమ్మడిగా ప్రయోజనాలను పొందాలన్నారు. గుంటూరు సర్కిల్ అటవీ అధికారి ఐకేవీ రాజు మాట్లాడుతూ అటవీ ప్రాంతం చుట్టూఫెన్సింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. ఎంపీటీసీ దండా హరిబాబు మాట్లాడుతూ బొబ్బేపల్లి,రాజు గారిపాలెం గ్రామస్థులలో ఇంటి నిర్మాణాలకు తదితర అవసరాలకు కొండనుంచి గ్రావెల్‌ను తరలించుకునే అవకాశంఇవ్వాలని, గ్రామంలో పంచాయతీల ఆధ్వర్యంలో జరిగే లింకురోడ్ల నిర్మాణానికి గ్రావెల్‌ను తరలించుకునేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరారు.

డీఎఫ్‌వో భీమయ్య మాట్లాడుతూ కొండ ప్రాంతం పచ్చదనంతో ,పర్యావరణంతో కళకళలాడేవిధంగా నర్సరీలను పెంచుతామని అన్నారు. ఆంధ్ర నర్సరీ ఫ్మార్మర్స్ అసోసియేషన్ సభ్యులు కానూరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ అటవీ భూమి అభివృద్ధి, పర్యావరణం కోసం బొబ్బేపల్లి గ్రామస్థులకు సహకారంగా నర్సరీ ఏర్పాటుకు లక్ష మొక్కలను తమ అసోసియేషన్ తరఫున అందజేస్తామన్నారు.

అంతకు ముందు అధికారులు మొక్కలను నాటే కార్యక్రమం పూర్తయినతర్వాత సమీపంలోని కొండపై ఉన్న ఆంజనేయుడికి గుడికి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లూరి లావణ్యా కోటేశ్వరరావు, పెంట్యాల శరత్,నాగభైరు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అటవీశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవిచౌదరి

టమోటా సాగును పరిశీలించిన అధికారులు

మార్టూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):మండలంలోని మార్టూరు,ఇసుకదర్శి గ్రామాలలో టమోటా పంట సాగును శుక్రవారం మార్కెటింగ్ శాఖ డీడీ కే ఝాన్సీరాణి,ఏడీ రమేష్‌లు పరిశీలించారు. పంట సాగుకు పెట్టుబడి,దిగుబడి, ఖర్చులు, మార్కెట్‌లో ధర తదితర విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటుధర లభించడం లేదని పలువురు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినష్టపోకుండా చర్యలు తీసుకుంటామని డీడీ తెలిపారు.



టమోటా పంటను పరిశీలిస్తున్న
మార్కెటింగ్ డీడీ ఝాన్సీరాణి, ఏడీ రమేష్ తదితరులు

చీడ పీడలను నుంచి పంటలను రక్షించేందుకే ఎన్‌పీఎస్‌ఎస్

పర్చూరు: పైర్లను చీడపీడల నుంచి పంటలను రక్షించుకునేందుకు ఎన్‌పీఎస్‌ఎస్ (జాతీయ చీడ పీడల పర్యవేక్షణ వ్యవస్థ) యాప్‌ను కేంద్ర ప్రభుత్వం భారత వ్యవసాయ శాఖ ప్రవేశ పెట్టిందని ఏడీఏ ఎస్.మోహనరావు అన్నారు.శుక్రవారం మండలంలోని నాగులపాలెం గ్రామంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని రైతులకు శనగ, వైట్‌బర్లీ పొగాకులో వచ్చే తెగుళ్ళను ఏవిధంగా ఈ నూతన యాప్ ద్వారా గుర్తించవచ్చో తెలియజేశారు.

పర్చూరులో జటిలంగా ట్రాఫిక్

- వాహనదారుల అవస్థలు

పోలీసుస్టేషన్‌లో వేధిస్తున్న సిబ్బంది కొరత

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ప్రజల పాలిట శాపంగా మారింది. నియోజకర్గ కేంద్రమైన పర్చూరులో కనీసం ట్రాఫిక్‌పై దృష్టి సారించలేని దుస్థితిలో ఉండటమే ఇందుకు నిదర్శనం. సర్కిల్ కార్యాలయం ఉన్నా ట్రాఫిక్ సమస్య తీరని సమస్యగా నెలకొంది. వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారిలో పర్చూరు ఉండటం, ఇంకొల్లు, చీరాల తదితర ప్రాంతాల నుంచి గుంటూరు, విజయవాడ, రాజధాని ప్రాంతానికి రాకపోకలు సాగించే వారితో నిత్యం రద్దీగా ఉంటోంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల మధ్య చాలా సందర్భాల్లో వాహనాలు ముందుకు కదలని పరిస్థితి. ముఖ్యంగా పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో సా యంత్రం 7 నుంచి 8 గంటల మధ్య ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. మంత్రి వాహనం అయినా, 108 వాహనం అ యినా ఈసమయంలో నిలిచి పోవాల్సిందే అన్న విధం గా పరిస్థితి ఉంది. ప్రధాన రోడ్డుకు ఇరువైపులా స్థలాలను ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించుకోవటం ఒక సమస్య అయితే ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించలేక పోవటం మరో సమస్యగా మారింది.

వేధిస్తున్న సిబ్బంది కొరత...

పర్చూరు పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఇబ్బందికరంగా మారింది. నిబంధనల ప్రకారం 18 మంది పోలీసు కానిస్టేబుళ్లు (పీసీ)లు ఉండాల్సి ఉండగా 11మంది మాత్రమే ఉన్నారు. వీరిలో నలుగురు మహిళా కానిస్టేబుల్స్ కావటం గమనార్హం. అందుబాటులో ఉన్న సిబ్బందిని కోర్టు, స్టేషన్ పనులకు కేటాయిస్తున్నారు. దీంతో ట్రాఫిక్‌పై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది.



పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో ట్రాఫిక్ స్తంభించడంతో నిలిచిపోయిన వాహనాలు

వేలంలో పెరిగిన తిరునాళ్ల షాపుల ఆదాయం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ తిరునాళ్లలో షాపులు పెట్టి వ్యాపారం చేసుకునే హక్కు పొందేందుకు శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో చీరాల డీఎల్‌పీవో బి. శివన్నారాయణ, ఎంపీడీవో బత్తిని సింగయ్య, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, సర్పంచ్ తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శులు చెన్నయ్య, మస్తాన్‌వలి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా వేలంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 మంది పాల్గొన్నారు. పంచాయతీ మద్దతు ధర రూ. 4,50,000 నుంచి ప్రారంభం అ య్యింది. శింగరకొండపాలెంకు చెందిన ఒబ్బని నాగరాజు 14,55,000 హెచ్చు పాట పాడి దక్కించుకున్నారు. గత ఏడాది రూ. 14 లక్షలు కాగా ఈ ఏడాది అదనంగా 55,000 ఆదాయం పంచాయతీకి వచ్చిందని అధికారులు తెలిపారు.

మాజీ ఎంపీపీకి మంత్రి గొట్టిపాటి పరామర్శ

బల్లికురవ. ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వైదన గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పోగుల సుబ్బారావు అనారోగ్యం బారిన పడటంతో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అయనను పరామర్శించారు. ఈసందర్భంగా అయన అరోగ్య పరిస్థితిని వారి కుమారుడు శేఖర్‌ను అడిగి తెలుసుకొన్నారు. ఆనంతరం అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగుబాము వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మంత్రి పరామర్శించారు. వారికి ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):పంగులూరు సబ్ స్టేషన్ పరిధిలో శనివారం రెండున్నర గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సబ్‌స్టేషన్ విస్తరణ పనులలో భాగంగా 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12.30 నిముషాల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

లారీ బ్యాటరీలు చోరీ

బల్లికురవ. ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ గ్రామంలో గురువారం రాత్రి నిలిపి ఉన్న గ్రానైట్ ముడి రాయి రవాణా చేసే లారీ బ్యాటరీలను గుర్తు తెలియని దొంగలు చోరీ చేశారు. బల్లికురవ వైపు నుంచి క్వారీలకు వెళ్లే రోడ్డులో ఉన్న పెట్రోల్ బంకు సమీపంలో లారీని నిలుపుదల చేసి డ్రైవర్ నిద్రపోయాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు రెండు బ్యాటరీలను తస్కరించుకెళ్లారు. శుక్రవారం ఉదయం లారీని స్టార్ట్ చేసేందుకు డ్రైవర్ చూడగా బ్యాటరీలు లేవు. దీంతో లారీ యజమాని బ్యాటరీల చోరీ విషయం తోటి లారీల యజమానులకు తెలిపారు. ఇక్కడ గత కొంతకాలంగా రాత్రుళ్లు కొందరు గుర్తు తెలియని దొంగలు నిలిపి ఉన్న లారీల బ్యాటరీలను డీజిల్‌ను దొంగిలిస్తున్నారు. అధికారులు నిఘా ఉంచి చోరీలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవాలని లారీల యజమానులు కోరుతున్నారు.

సైన్స్ ప్రయోగాలతో ఉన్నత ఆలోచనలు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైన్స్ ప్రయోగాల పోటీల్లో పాల్గొనడం వలన ఉన్నతమైన ఆలోచనలు పెరుగుతాయని కేజీఎం బాలికోన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థినులకు సైన్స్ ప్రయోగాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. భవిష్యత్తులో కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని వారికి సూచించారు.



అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి కీర్తిసరోజ్

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం చేయూత

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : దివ్యాంగ బాలబాలికలకు కావలసిన ప్రత్యేక అవసరాలకు సంబంధించి ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తుందని సంతరావూరు పీహెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ అన్నారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కడవకుదురు గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల, రెండు ప్రాథమిక పాఠశాలలు, ఐదు అంగన్‌వాడీ కేంద్రాలను చీరాల లోక్ అదాలత్ కమిటీ మెంబరు ఆదేశాల మేరకు శుక్రవారం ఆమె సందర్శించి, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలు, విద్య పరంగా వచ్చే సమస్యలు, బాలికల హక్కుల గురించి మండల పారా లీగల్ అడ్వకేట్ ఎ.రామకృష్ణారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోషకాహార విలువలు గురించి వివరించారు. కార్యక్రమంలో పారాలీగల్ మండల వలంటీర్ ఎం.వీ.రామారావు, ఆయా పాఠశాలల హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, హెచ్‌వో యు.వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు రమ్య, స్మైలీ, ఏఎన్ఎంలు ఎం.శారద, శిరీష, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బ్యాంక్‌లో రుణం కోసం యత్నం

- గుర్తించి పోలీసులకు అప్పగించిన బ్యాంక్ అధికారులు
- ఇప్పటికే ఇంకో బ్యాంక్‌లో గోల్డ్ కోటింగ్ బంగారంతో రుణం

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్ర జ్యోతి): నకిలీ బంగారంతో బ్యాంక్‌లో రుణం తీసుకునేందుకు వెళ్ళిన వ్యక్తిని గుర్తించి పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణానికి చెందిన ఒక వ్యక్తి శు క్రవారం సాయం త్రం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న బ్యాంక్ కు సుమారు 24 గ్రాముల బరువు ఉన్న రెండు గాజులను తీసుకు వెళ్ళాడు. బ్యాంక్ అధికారులు నకిలీ బంగారం గా గుర్తించి పోలీస్ లకు అప్పగించారు. ఇదే వ్యక్తి వారం రోజుల క్రితం సుమారు 30 గ్రాముల బరువు ఉన్న కడియం ను అద్దంకి పట్టణం లోని అదే బ్యాంక్ కు చెందిన మరో శాఖ లో తాకట్టు పెట్టి లక్ష రూపాయల రుణం తీసుకున్నట్లు ఆ బ్యాంక్ అధికారులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఆ బ్యాంక్ అధికారులు తమ వద్ద తాకట్టు పెట్టిన కడియం ను పరిశీలించగా గోల్డ్ కోటింగ్ తో ఉన్నట్లు గుర్తించారు. అయితే శ్రీకాంత్ రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి కుమారుడు కావటం గమనార్హం. ఈ విషయమై సీఐ సుబ్బరాజు ను వివరణ కోరగా ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, బ్యాంక్ అధికారులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.



ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన మంత్రి

బల్లికురవ. ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఏపీయూడబ్ల్యూజే డైరీని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. బాపట్ల జిల్లా ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు ఆధ్వర్యంలో యూనియన్ నేతలు మంత్రిని బల్లికురవ మండలం వైదనలో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కృష్ణారెడ్డి, కొండలరావు, దుర్గాప్రసాద్, మురళి, శ్రీనివాసరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



రేణుకమ్మ వారి ప్రతిష్ఠ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

వైభవంగా రేణుకమ్మ దేవర ప్రతిష్ఠ

శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు

పంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):పంగులూరులో నూతనంగా నిర్మితమైన రాయిణి వారి వంశ దేవర రేణుకమ్మ వారి ప్రతిష్ఠా మహోత్సవం పూజా కార్యక్రమాలు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులు శ్రీ వేముల శ్రీహరిచౌదరి వారి రుత్విక్ బృందం నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాలలో రాయిణి వంశస్థులైన పలువురు దంపతులు పాల్గొన్నారు.



జడ్‌పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులకు
కంప్యూటర్‌ను బహూకరిస్తున్నదాత నారాయణ

కోలలపూడి హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

మార్టూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి జడ్‌పీ హైస్కూల్‌కు కౌండన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఈవీ నారాయణ రూ. 30 వేల విలువచేసే కంప్యూటర్‌ను బహూకరించారు. శుక్రవారం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణకు కంప్యూటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, టి. నాగేశ్వరరావు, కందిమళ్ల అంజిబాబు, రంగబాబు, కృష్ణగంగారావు, వీరరాఘవులు, సుధాకర్ పాల్గొన్నారు.

అవీ..ఇవీ



రామకూరు గ్రామంలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న డీఎల్‌పీవో శివనారాయణ

చెత్త సంపద కేంద్రాలుగా డంపింగ్ యార్డులు

పంగులూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మించిన డంపింగ్ యార్డులను చెత్త సంప ద కేంద్రాలుగా వినియోగించుకోవాలని డీఎల్‌పీవో శివనారాయణ సూచించారు. మండలంలోని రామకూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని డంపింగ్‌యార్డు వినియోగాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వీధులలో, నివాస ఆవాసాల నుంచి సేకరించిన చెత్తను వర్మీ కంపోస్టు ఎరువుగా తయారు చేయడం ద్వారా సంపద సమకూర్చుకోవాలన్నారు. స్వమిత్వ సర్వే నిర్వహణ, ఇంటి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి ఈవోఆర్‌డీ సునీత, కార్యదర్శులు శిరీష, జానీ బేగం, శ్రీనివాసరావు, కళ్యాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రుణాల చెక్కులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్, గ్రామసర్పంచ్

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రదీప్‌లు అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చినగంజాం శాఖ కార్యాలయంలో వెలుగు ఆధ్వర్యంలో ఐదుగురు డ్వాక్రా మహిళలకు శుక్రవారం జరిగిన రుణాల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని చెక్కులు అందజేశారు. లఘుపతి దీదీ పథకం కింద ఐదుగురు మహిళా సభ్యులను ఎంపిక చేసి రూ.8లక్షల రుణాలను పంపిణీ చేసినట్లు ఏపీఎం గద్దె పెద్దసుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ శ్రీలక్ష్మీ, వీవోఏ శివ, గ్రామ ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, టీడీపీ నాయకులు టీ.జయరావు, నరహరి శ్రీనివాసరావు, పర్వతరెడ్డి పార్థసారథి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరులో ఈనెల 23న నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోటరీ అధ్యక్షుడు తోకట కృష్ణమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. భవనం వీరారెడ్డి భవనంలో జరిగే శిబిరంలో గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, చర్మ, గొంతు, ముక్కు, చెవి, దంత, కంటి, పిల్లలకు , స్త్రీలకు సంబంధించిన అన్నీ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పర్చూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పర్చూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు అయ్యింది. యద్దనపూడి మండలానికి చెందిన మహిళపై మార్టూరుకు చెందిన వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించటంతోపాటు, కులంపేరుతో దూషించినట్లు బాధిత మహిళ ఫిర్యాదుపై పోలీసులు కేసునమోదు చేసినట్లు సమాచారం.

ట్రాఫిక్‌పై పోలీసుల ప్రత్యేక దృష్టి

రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం

అద్దంకిలో మార్పు ఆరంభం

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో విజువల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రతి రోజు సాయంత్రం సిబ్బంది రోడ్డుపై విధులు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టడంతో మార్పు కనిపిస్తోంది. సాధారణంగా సీఐ స్థాయి అధికారి సర్కిల్ కార్యాలయంలో కూర్చొని ఉండటమో లేక రోడ్డుపై కి వచ్చిన తనిఖీలకు పరిమితం కావటమో చేస్తుంటారు. కానీ అద్దంకి టౌన్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న సుబ్బరాజు మాత్రం అందుకు భిన్నంగా అనునిత్యం పర్యవేక్షణ చేయటం తో పాటు ఏ చిన్న సంఘటన చోటు చేసుకున్నా ముందు తాను ఉంటుండటంతో సిబ్బంది కూడా పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అద్దంకి పట్టణంలో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణలో కొంతమేర మార్పు కనిపిస్తోంది.

గతంలో అద్దంకిలో మూడు సంవత్సరాల పాటు ఎస్సై గా పనిచేసిన అనుభవానికి తోడు మార్పు తీసుకురావాలన్నా చిత్తశుద్ధితో సీఐ గా బాధ్యతలు చేపట్టిన నెల రోజులలో అద్దంకి పట్టణంలో తనదైన రీతి లో మార్పునకు ఆరాధ్యుల సుబ్బరాజు శ్రీకారం చుట్టారు. జనవరి 16 వ తేదీ అద్దంకి టౌన్ సీఐ గా బాధ్యతలు స్వీకరించిన సుబ్బరాజు ప్రధానంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణ పై దృష్టి సారించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణం చేయకుండా ఉండే విధంగా, ట్రాలీ ఆటోలలో కూలీలను తరలించకుండా చేసేందుకు ప్రతి రోజు తనిఖీలు చేయించారు. ఆయా ప్రాంతాలలో తనిఖీలు చేసి కూలీలకు కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలో అద్దంకి పట్టణంలో ప్రధాన కూడలి ప్రాంతాలుగా ఉన్న భవానిసెంటర్, ఆర్టీసీ బస్టాండ్, బంగ్లా రోడ్డు, రామ్‌నగర్‌ల వద్ద ఉదయం, సాయంత్రం రద్దీ సమయాలలో ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను పనిచేసేలా మరమ్మతులు చేయించారు. నామ్ రోడ్డు వెంబడి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు వివరించటం, ట్రాఫిక్ నియంత్రించేందుకు, పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాలను గమనిస్తూ వాహన చోదకులకు తగు సూచనలు చేసేందుకు మైక్ అనౌన్స్‌మెంట్ సిస్టం ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఇక అద్దంకి పట్టణంలో ట్రాఫిక్‌కు ప్రధాన అడ్డంకిగా ఉన్న తోపుడు బండ్ల వ్యాపారులకు ముందస్తుగానే తగు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితులలో సైడ్ డ్రైన్‌లు దాటి రోడ్డుపై తోపుడు బండ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు చేయరాదని హెచ్చరించారు. దీంతో రోడ్డు ఒకింత విశాలంగా మారింది. గతంలో అద్దంకి పట్టణంలో తరచూ జరిగే రోడ్డు ప్రమాదాలు కొంత తగ్గుముఖం పట్టాయి. మార్పు గమనించిన పలువురు ప్రజలు శెభాష్ పోలీస్ అంటున్నారు.



అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్న సీఐ సుబ్బరాజు



ఆటోలలో ప్రయాణిస్తున్న మహిళా కూలీలతో మాట్లాడుతున్న సీఐ సుబ్బరాజు

పారదర్శకంగా రీ సర్వే

● కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అన్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములు ఉన్న రైతులందరికి నోటీసులు అందజేసి, రైతులకు హద్దులు చూపించి తప్పులు లేకుండా రీ సర్వే చేయాలని అన్నారు. రైతుల సమక్షంలోనే రీ సర్వే నిర్వహించాలని సూచించారు.

అనంతరం ఆయన మోటుపల్లిలోని పురాతన వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించి, ఆలయంలోని శాసనాలను పరిశీలించారు. చినగంజాం పరిధిలోని ఉప్పు కొఠారులను పరిశీలించి, ఉప్పు రైతులు, కూలీలతో మాట్లాడారు. ఉప్పుకొఠారుల భూములు ఎంత విస్తర్ణీంలో ఉన్నాయని తహసీల్దార్ జె.ప్రభాకరరావుని అడగగా మండల పరిధిలోని 2,400 ఎకరాల ఉప్పు భూములుగా ఉండగా, దానిలో 1,600 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేస్తున్నట్లు తెలిపారు. మీకు కూలీ ఎంత వస్తుంది, డ్వాక్రా గ్రూపులో ఉన్నారా అని ఉప్పు కూలీలు బేతాళ ఉల్లారాణి, పలతోటి ఝాన్సీలని ఆయన అడిగారు. నేను ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు కట్టుకున్నానని దానికి ప్రభుత్వం వారు ఇచ్చి రూ.1.80 లక్షల పోగా, మూడులక్షల రూపాయిలు అప్పు అయిందని, ఉపాధిహామీ ద్వారా రావాలసిన బిల్లులు ఇంత వరకు రాలేదని ఉల్లారాణి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రూ.75 పైసల వడ్డీకి నీకు రుణం ఇప్పిస్తానని కలెక్టర్ ఆమెకు హామీ ఇచ్చారు.

తదనంతరం ఆయన సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలోని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్‌నాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మోటుపల్లిలో రీ సర్వే భూముల పటాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



కవులను సత్కరిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ కార్యాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలుగు కవులు, రోటరీ క్లబ్ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గాడేపల్లి దివాకర్‌దత్తు, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం, కె. అనిలకుమారలను రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు చప్పిడి వీరయ్య, సీహెచ్ మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, హరిప్రసాద్, పూర్ణచంద్రరావు, ఆంజనేయులు, శ్రీలక్ష్మిశివకుమారి, భువనేశ్వరి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సృజన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో...

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం సృజన సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో కమఠేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు పద్య శాసనం, ఎర్రా ప్రగడ విగ్రహాలను పూల మాలలతో అలంకరించారు. తెలుగు భాషాపై మమకారాన్ని కార్యక్రమంలో వక్తలు తెలియజేశారు.

తెలుగుభాషను చులకన చేయవద్దు

తల్లిలాంటి తెలుగుభాషను చులకన చేయవద్దని, మాతృభాషలో రాణిస్తేనే ఇతర అన్ని సబ్జెక్టులలో రాణిస్తారని హెచ్‌ఎం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయులు వంగె వరపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషోత్సవం- తెలుగు కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం ప్రారంభించారు. విద్యార్థులకు భాషాభివృద్ధిలో భాగంగా తెలుగు పద్యాల పోటీ, వక్తృత్వం, పఠనం, కథలు, వ్యాసరచన, గుడ్ హ్యాండ్ రైటింగ్ వంటి పలు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి. వెంకటరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, లక్ష్మీదేవి, పద్మావతి, పీడీ లావణ్య పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు పరిశీలన

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి): శింగరకొండ వార్షిక తిరునాళ్ల కోసం అవసరమైన అదనపు విద్యుత్ లైన్‌ల ఏర్పాటు, పాత విద్యుత్ లైన్‌ల మార్పు, కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటుకు ఆశాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ఈవో తిమ్మానాయుడులు శుక్రవారం పరిశీలించారు. శింగరకొండలో ఆర్యవైశ్య కళ్యాణ మండపం వద్ద నుంచి కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వరకు మెట్ల మార్గం వెంబడి ఎల్‌టీ లైన్ మార్పు, ఆర్యవైశ్య సత్రం నుంచి నర్సరావుపేట రోడ్డులోని ఆర్చి వరకు విద్యుత్‌లైన్ మార్పు, టీటీడీ కళ్యాణ మండపం వరకు ప్రత్యేకంగా విద్యుత్ లైన్ ఏర్పాటు, మూడు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం పరిశీలించారు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయనున్నట్లు ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. అద్దంకి పట్టణంలో పలు చోట్ల నామ్ రోడ్డును క్రాస్ చేస్తూ ఉన్న విద్యుత్ లైన్‌ల మార్పు కోసం కూడా ఆయా ప్రాంతాలలో ఈఈ మస్తాన్‌రావు పరిశీలించారు. డీఈఈ దామోదరం, టౌన్ ఏఈ శ్రీనివాసరావు, టెక్నికల్ ఏఈ బాలకోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.



శింగరకొండ వద్ద విద్యుత్ లైన్‌ల మార్పు కోసం పరిశీలిస్తున్న ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, ఈవో తిమ్మానాయుడు

ప్రతిభావంతులకు ప్రోత్సాహక నగదు బహుమతులు

ఇంకొల్లు,ఫిబ్రవరి 21,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఎన్ఆర్ అండ్ వీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో 2023-24వ సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రథమ,ద్వితీయ స్థానాలు పొందిన బి.కుసుమ, ఎస్‌కె రషీదాలకు బొర్రా ఈశ్వరమ్మ మెమోరియల్ తరుపున ప్రతిభా అవార్డుల కింద రూ.6000,రూ.4000 శుక్రవారం అందజేశారు. 2024-25వ సంవత్సరంలో ప్రతి తరగతిలో ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు దివంగత ఆరె నరసింహారావు,నాగలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కావూరి నాగార్జున, భవానీ దంపతులు రూ.5000 బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వవిద్యార్థిని కావూరి సాయిసుప్రియ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు రూ.40వేలు డిపాజిట్ చేసి ప్రతి ఏడాది పేదవిద్యార్థులకు రూ.10వేలు అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయిని రావి నాగేశ్వరి అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడూరి సత్యనారాయణ,నార్నె వేణుగోపాల్, కరణం వాసుదేవరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ కరి రవిశేఖర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



నగదు ప్రోత్సాహకాలు అందుకుంటున్న విద్యార్థినులు

రేపు సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్‌బాల్ పోటీలు

మార్టూరు,ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి):సౌత్‌జోన్ నేషనల్ షూటింగ్ బాల్ బాలబాలికల పోటీలు ఈ నెల 23 వతేదీన ఆదివారం మండలంలోని చిమ్మిరిబండలోని జడ్‌పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు ఏపీ అసోసియేషన్ ఉపకార్యదర్శి పిల్లి సురేంద్ర శుక్రవారం తెలిపారు.ఈ పోటీలను లీగ్ పద్ధతిలో నిర్వహిస్తారని, సాయంత్రానికి పోటీలు ముగుస్తాయని ఆయన తెలిపారు.

నేడు వెలుగు సిబ్బందికి అవగాహన సదస్సు

ఇంకొల్లు,ఫిబ్రవరి 21,(ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో ఇంకొల్లు క్లస్టర్‌లోని ఆరు మండలాల వెలుగు సిబ్బందికి శనివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం అనూరాధ తెలిపారు.

బ్యాంకుల విలీనాలతో కుదేలు

● నిరసనలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విలీనాలతో బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్నదని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్ చీరాల ప్రతినిధులు అన్నారు. శుక్రవారం విధులు ముగిశాక అన్ని బ్యాంకుల ప్రతినిధులు స్టేట్ బ్యాంకు ప్రాంగణానికి చేరుకుని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ 25 ఏళ్లుగా నూతన రిక్రూట్‌మెంట్‌లు లేక పాత వారితోనే పని చేయిస్తూ పని భారాన్ని పెంచుతున్నారని వాపోయారు. మారుతున్న ఆధునీకరణలో భాగంగా ఉద్యోగులకు పని భారం పెరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వారంలో ఐదు రోజులు మాత్రమే పని దినాలుగా కేటాయించాలన్నారు. ఐడీబీఐ విలీనం ప్రక్రియను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మార్చి 24, 25 తేదీలలో దేశ వ్యాప్తంగా విధులు బహిష్కరించి ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు దీవెన బాబు, కిషోర్‌బాబు, నెహ్రూ, చైతన్య, ఆంజనేయులు, బ్రహ్మయ్య, దాసు, శ్రీనివాసరావు, పైడయ్య, ఏఐటీయూసీ నాయకులు బత్తుల శామ్యేల్, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

క్రైం సమాచారం

విద్యుత్ మోటార్ల చోరీ దొంగల అరెస్ట్

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని కావూరివారి పాలెంలో విద్యుత్ మోటార్ల చోరీకి పాల్పడిన దొంగలను ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అక్కల గోపిరెడ్డి, కావూరి గోపిరెడ్డిలు గ్రామంలోని పొలాల్లో ఉన్న ఐదు విద్యుత్ మోటార్‌లను చోరీచేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఈనెల 17వ తేదీన కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేశారు. అలాగే చోరీ జరిగిన మోటార్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) :వేటపాలెం మండల పరిధిలోని జాతీయ రహదారిలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఎడ్ల బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండి యజమానికి కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెంకు చెందిన మొగిలి కోటేశ్వరరావు ఎద్దుల బండితో జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా చీరాల - వేటపాలెం మధ్యగల జాతీయ రహదారిలో ప్రమాదం జరిగింది. అలాగే బండి కూడా ధ్వంసమైంది. దీంతో స్థానికులు 108 సహాయంతో క్షతగాత్రుడిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు.



ప్రమాదంలో గాయపడిన ఎడ్ల బండి యజమాని


మోటార్ సైకిల్‌ను ఢీ కొన్న ఆటో

● భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి21(ఆంధ్ర జ్యోతి): మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఆటో ఢీ కొనటంతో భార్యాభర్తతో పాటు కుమార్తెకు గాయాలు అయ్యాయి. పోలీస్‌ల కథనం మేరకు అద్దంకి మండలంలోని రామాయపాలెంకు చెందిన గాలి ఏసన్న భార్య, కుమార్తెతో కలిసి మోటార్‌సైకిల్ పై గురువారం రాత్రి అద్దంకి వస్తుండగా గుండ్లకమ్మ బ్రిడ్జి సమీపంలో దర్శి వైపు నుంచి అద్దంకి వస్తున్న ఫోర్ వీల్ ట్రాలీ ఆటో వెనుక వైపు నుంచి ఢీ కొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. శుక్రవారం ఏసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

నేడు చీరాలలో ప్రజా దర్బార్

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నేడు చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య క్యాంపు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహించే ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, అర్జీదారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యే నేరుగా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అర్జీదారులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో హాజరుకావాలని ఇప్పటికే సూచించారు. అలాగే అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అధికారులు కూడా హాజరవుతుండటంతో ప్రజాసమస్యల పరిష్కారం సులువుగా ఉండే అవకాశం ఉంది. అందుకు సంబంధించి ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఉదయం మునిసిపల్ సమావేశం హాలులో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.







నగరంలోని ఫత్తేఖాన్‌పేటలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన కాలువ

టెక్కేమిట్టలో చెత్తతో నిండిపోయిన కాలువ

మురుగు కదలదేం..
చెత్త తీయరేం!

- కార్పొరేషన్ పారిశుధ్య విభాగంలో అలసత్వం
- మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ ఆగ్రహం, అసహనం
- ఇకనైనా సిబ్బంది గాడిలో పడేనా!?

'రోడ్లపై చెత్త ఎందుకు ఉంటోంది. కాలువల్లో పూడిక తీయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.'

- నెల్లూరు నగరపాలక సంస్థలోని పారిశుధ్య విభాగం పనితరుపై రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ ఇటీవల చేసిన వ్యాఖ్యలివి. నగరానికి చెందిన ముగ్గురు ప్రముఖులే ఇంతటి అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారంటే క్షేత్రస్థాయిలోనూ పరిస్థితులు అదేవిధంగా ఉన్నాయి. ఇంటింటా చెత్తసేకరణ మొక్కుబడి తంతుగా మారిపోయింది. ఫలితంగా ఇళ్లలోని చెత్తా రోడ్లపైకి చేరిపోతోంది. అలాగే కాలువల్లో వ్యర్థాలు, పూడిక పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలనంటోంది. పట్టపగలే దోమలు విజృంభిస్తుండటంతో నగరవాసులకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. ఆ ముగ్గురు ప్రముఖుల వ్యాఖ్యలతోనైనా పారిశుధ్యం విభాగం గాడిలో పడుతుందా!? అన్నది వేచి చూడాల్సిందే.

8

ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్

- నేడు, రేపు అధికారులంతా పంచాయతీల్లోనే

నెల్లూరు (జడ్పీ), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటా చెత్త సేకరణపై ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని రెండురోజులపాటు నిర్వహిస్తున్నట్లు డీపీవో శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో అధికారులంతా క్షేత్రస్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. ఉదయం 6 గంటలకే అధికారులంతా పంచాయతీల్లో విధులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు. రెండురోజుల్లో వంద శాతం చెత్త సేకరణ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న చెత్త కుప్పలు, రోడ్ మార్జిన్, రోడ్ పక్కన పశువుల పేడదిబ్బలు తొలగించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని పేర్కొన్నారు. సేకరించిన చెత్త సేకరణ వివరాలను పీఆర్ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరుపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు.

142 సచివాలయాలకు షోకాజు నోటీసులు



నెల్లూరు (సిటీ) : మధ్య, చిన్నతరహా పరిశ్రమల గుర్తింపుపై జరుగుతున్న సర్వేలో ఆశించిన ఫలితాలు ఎందుకు రాబట్టలేకపోయారో వివరణ ఇవ్వలని కోరుతూ ఏడీసీ నందన్ నెల్లూరులోని 142 సచివాలయాలకు శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. ఎంఎస్‌ఎంఈ సర్వేను ప్రభుత్వ ఆదేశాలనుసారం ఎందుకు నిర్వహించలేకపోతున్నారో నోటీసులు అందిన 24 గంటల్లోపు లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఏడీసీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 142 సచివాలయాల్లోని కార్యదర్శులందరికీ షోకాజు నోటీసుల సారాంశం వర్తిస్తుందని పేర్కొన్నారు. కాగ వరుస సర్వేలతో తాము నికర విధులను నిర్వర్తించ లేకున్నామని, దీనిపై కలెక్టర్‌తో సమావేశమై అనంతరం ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు సచివాలయ కార్యదర్శులు పేర్కొన్నారు.

రేపు నగరానికి సీఎం రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం నెల్లూరు నగరానికి రానున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కుమారుడి వివాహంలో ఆయన పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కనుపర్తిపాడు ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, రూట్, వీఎఆర్ కన్వెన్షన్ సెంటర్, పార్కింగ్ ప్రాంతాలను కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, బీద రవిచంద్ర ఇతర అధికారులు పరిశీలించారు. ప్రత్యేక బలగాలతో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రూఫ్‌టాప్‌పై ప్రత్యేక దృష్టి సారించి భద్రత పెంచాలని అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్, పక్కన ఎస్పీ కృష్ణకాంత్, టీడీపీ నేత బీద రవిచంద్ర తదితరులు

రెవెన్యూ సమస్యలపై
శ్రద్ధ పెట్టి పరిష్కరించండి

- పాసుపుస్తకాలు సకాలంలో అందించండి
- అధికారుల సమీక్షలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిసోడియా



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న సిసోడియా

నెల్లూరు (హరనాదపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాంప్రసాద్ సిసోడియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, భూ ఆక్రమణలు, భూ సంబంధిత కోర్టు కేసులు తదితర అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో (గ్రీవెన్స్) వచ్చిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలని సూచించారు. సమస్యలతో వచ్చే అర్జీదారుల పట్ల గౌరవ, మర్యాదలతో వ్యవహరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రీసర్వే చేసిన భూముల కొలతలతో చిన్న చిన్న తేడాలు ఉంటే రైతులను పిలిపించి నచ్చజెప్పి వీలైనంత వరకు పరిష్కరించాలని అన్నారు. భూములలో ఆక్రమణలు తొలగించి మరల ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా పట్టాదారు పాసు పుస్తకాలు సకాలంలో అందించాలని, చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ పెట్టాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలన్నారు. కోర్టు కేసులను తేలికగా తీసుకోకుండా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి కౌంటర్ అఫిడవిట్‌లు ఫైల్ చేయాలన్నారు. తీర ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాల సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ మాట్లాడుతూ అఫిడవిట్లు ఫైల్ చేయడంలో జాప్యం లేకుండా ఆర్డీవో, తహసీల్దార్లకు ఆదేశాలు ఇస్తామని అన్నారు. లీగల్ సెల్ ఏర్పాటు చేసి కేసుల సత్వర పరిష్కారం చర్యలు తీసుకుంటామని జేసీ వివరించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ, సబ్‌కలెక్టర్ శ్రీపూజ, ఆర్డీవోలు జె.ఉదయ భాస్కర్‌రావు వంశీకృష్ణ, పావని తదితరులు పాల్గొన్నారు.

రన్‌వేకు భూములు ఇస్తే
పనులు ప్రారంభిస్తాం

- ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రతినిధులు
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం
- 2027 కల్లా విమానాశ్రయం ప్రారంభం కావాలి
- ప్రతినిధులతో కలెక్టర్, ఎంపీలు, ఎమ్మెల్యే
- దామవరం వద్ద భూముల పరిశీలన

దగదర్తి (కావలి), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : దగదర్తి మండలం దామవరం వద్ద నిర్మించనున్న విమానాశ్రయంలో భాగమైన రన్‌వేకు అవసరమైన భూములు ఇస్తే టెండర్లు పిలిచి పనులు ప్రాంబించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్ మల్లికా జయరాజి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి తదితరులు విమానాశ్రయ భూములను పరిశీలించారు. ఎయిర్‌పోర్ట్, రన్‌వేకు అవసరమైన భూములను వాటి స్థితిగతులను క్షేత్రస్థాయితోపాటు వాటి మ్యాప్‌లను పరిశీలించారు. ఇప్పటికే 700 ఎకరాలు సేకరించి అప్పజెప్పామని, దానిలో రన్‌వే నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఎంపీలు, ఎమ్మెల్యే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులకు తెలిపారు. రన్‌వేకు ఎలాంటి భూములు కావాలో చెబితే రైతులకు నచ్చజెప్పి ముందుగా అప్పగించేందుకు సిద్ధమన్నారు. ప్రభుత్వం తరపున ఎలాంటి సహకారం కావాలన్నా వెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచి 2027 నాటికి విమానశ్రయం ప్రారంభమయ్యేలా చూడాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ఇక విమానాశ్రయ పనులు ప్రారంభిస్తే ఆగే ప్రసక్తే ఉండదని స్పష్టం చేశారు. జిల్లాకు బీపీసీఎల్, ఇండోసెల్ కంపెనీలు రావడం అదృష్టమని అన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ రన్‌వేకు డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచేందుకు సిద్ధపడితే రైతులను ఒప్పించి భూములను ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. భూసేకరణకు అవసరమైన రూ.96 కోట్ల నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ రన్‌వేకు అవసరమైన భూములను సేకరించి అప్పగించామని, పనులు ప్రారంభించుకోవచ్చని తెలిపారు. అలాగే భూసేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని స్పష్టం చేశారు.



విమానాశ్రయ పైలాన్ వద్ద ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రతినిధులు, కలెక్టర్ ఆనంద్, ఎంపీలు వేమిరెడ్డి, బీద, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

ఏపీపీఎస్సీ పరీక్షలకు కంట్రోలు రూమ్

నెల్లూరు (హరనాధపురం) : ఆదివారం జరిగే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 మెయిన్ పరీక్షల నిర్వహణకు జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం శని, ఆదివారాలు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరీక్ష కేంద్రాల చిరునామా, ఇతర సమాచారం కోసం 0861 2332261 నెంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

చేవూరులోలా మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు
కలెక్టర్, ఎమ్మెల్యేకు తేల్చి చెప్పిన రావూరు రైతులు



కలెక్టర్, ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న రైతులు

16 కాదు.. 50 లక్షలు ఇప్పించండి!

గుడ్లూరు, ఫిబ్రవరి 21 : ఒక ఎకరాకు ప్రభుత్వ నిర్ణయంచిన రూ.16 లక్షలతో రైతులు నష్టపోతారు. దీనిని రూ.50లక్షలకు పెంచి పరిహారం ఇవ్వండి.' అంటూ రావూరు రైతులు స్పష్టం చేశారు. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు రావూరు పరిధిలో సుమారు వెయ్యి ఎకరాల భూ సేకరణకు సంబంధించి శుక్రవారం కలెక్టర్ ఆనంద్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు శుక్రవారం రైతులతో అభిప్రాయాలు సేకరించారు. ముందుగా కలెక్టర్ మాట్లాడుతూ రావూరులో - మిగతా 6లో

ఇక ధాన్యం కొనుగోళ్లు

- జిల్లాలో 300 కేంద్రాలు
- తొలి కేంద్రం సంగంలో ఏర్పాటు
- నేడు ప్రారంభించనున్న మంత్రి నాదెండ్ల

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి అధికారులు శ్రీకారం చుట్టారు. శనివారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంగంలోని పీఏసీఎస్‌లో మొట్టమొదటి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తర్వాత రైతులతో సమావేశమవుతారు. ధాన్యం రాశులను పరిశీలిస్తారు.

300 కేంద్రాలు..

జిల్లాలో 1,44,761 హెక్టార్లలో వరి పంట వేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్క. దీని ద్వారా 11.01 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఈ ధాన్యానికి మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న 523 రైతు సేవా కేంద్రాలకు అనుసంధానంగా 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయిం చారు. కొనుగోలు కేంద్రాల సిబ్బందికి, వీవోఏలకు శిక్షణ కార్యక్రమాలను కూడా పూర్తి చేశారు. ముందుగా పంట చేతికొచ్చే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు తెరుస్తారు.

కనీస మద్దతు ధర ఇలా..

ధాన్యం సేకరణకు సంబంధించి కనీస మద్దతు ధరను ప్రభు త్వం ప్రకటించింది. గ్రేడ్-ఏ రకం ధాన్యానికి పుట్టికి రూ.19720, సాధారణ రకానికి పుట్టికి రూ.19550 ధర చెల్లిస్తారు. భారత ప్రభుత్వ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని మాత్రమే రైతుల నుంచి కొనుగోలు చేస్తారు. 17 శాతానికి మించకుండా తేమ లేదా నెమ్ము ఉండాలి. ఈ-పంట పోర్టల్‌లో నమోదు చేసి, ఈకేవైసీ పూర్తి చేసిన రైతుల్లో ధాన్యాన్ని విక్రయించడానికి సిద్ధమైన వారి నుంచి మాత్రమే కొనుగోలు చేస్తారు. ధాన్యం అమ్మిన ప్రతి రైతు తమ బయోమెట్రిక్‌ను రైతు సేవా కేంద్రంలో తప్పనిసరిగా ఇవ్వాలి. గోనె సంచులు, హమాలీలు, రవాణా వసతిని రైతులే ఏర్పాటు చేసుకుంటే ప్రభు త్వ లెక్కల ప్రకారం అందుకయ్యే మొత్తాన్ని రైతు ఖాతాల్లో ధాన్యం సొమ్ముతో కలిపి జమ చేస్తారు.

ఎంత ధాన్యమైనా కొంటాం

జిల్లాలో పండిన ధాన్యాన్ని సేకరించడానికి అన్నీ ఏర్పాట్లు చేశాం. ఒక లక్ష్యం అంటూ లేదు. ఎంత ధాన్యం వచ్చినా తీసుకుం టాం. రైతులకు మద్దతు ధర కల్పించి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాం.

- డీ అర్జున్‌రావు,
జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్



మంత్రి మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు

నెల్లూరుకు చేరుకున్న మంత్రి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. విజయవాడ నుంచి వందేభారత్ రైలులో నెల్లూరుకు వచ్చిన ఆయనకు జనసేన, తెలుగుదేశం, బీజేపీ నేతలు, జిల్లా అధికారులు, పోలీసులు ఘన స్వాగతం పలికారు. ప్రధాన రైల్వేస్టేషన్ నుంచి బోసుబొమ్మ, గాంధీబొమ్మ, వీఆర్సీ, రామలింగాపురం నుంచి మినీబైపాస్ మీదుగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. మంత్రితోపాటు టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ ఇతర నాయకులు ఉన్నారు.

నెల్లూరులోని నిప్పో ఫ్యాక్టరీ ప్రాంగ ణంలో శ్రీనివాస కల్యాణ మహోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండవ రోజు శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, నివేదన, శాత్తుమురై జరిగాయి. అనంతరం మహా స్నపన తిరుమంజనం, పూర్ణాభిషేకం, వస్త్రాలంకరణ సేవ భక్తులకు కనువిందు చేశాయి. సాయంత్రం జరిగిన సహస్ర దీపాలంకరణ సేవకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. డాక్టర్ గంగాధర శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచ నం ఆకట్టుకుంది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస నృత్య రూపకం అలరించింది. 28వ డివిజన్ కార్పొరేటర్ చెక్కా అహళ్య, సాయిసునీల్ తదితరులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం శ్రీనివాస కల్యాణం, పుష్పయాగం జరగనున్నాయి.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)



జయ గోవింద.. గోవింద హరే..!

కనుల పండువగా శ్రీనివాస కల్యాణోత్సవాలు



సహస్ర దీపాలంకరణ, శ్రీవారిని తిలకిస్తున్న భక్తులు





16 కాదు.. 50 లక్షలు ఇప్పించండి!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటయ్యే అతిపెద్ద రిఫైనరీ కోసం భూములను సేకరించనున్నట్లు తెలిపారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా, అందరికీ మేలు జరిగే పద్ధతిలో భూముల సేకరణ ఉంటుందన్నారు. ఒక ఎకరాకు సుమారు రూ.16 లక్షల వరకూ ప్రభుత్వం పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ పచ్చని పంట పొలాలను ఈ ఇండస్ట్రీయల్ హబ్ కోసం ఇచ్చేందుకు ఎవరికీ ఇష్టం లేదన్నారు. పక్కగ్రామమైన చేవూరులో భూముల సేకరణ విషయంలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పద్ధతి రావూరులో కూడా ఉంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అయితే, ఎకరాకు రూ.16 లక్షలు ఇవ్వడం ద్వారా నష్టపోతామని, దీనిని రూ.50లక్షలకు పెంచాలని కోరారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ భూముల ధర విషయం సీఎం దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. ఇందుకు సంబంధించి ప్రజాభిప్రాయాలతో నివేదిక తయారుచేసి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కలెక్టర్ రాజశేఖర్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, తహసీల్దారు స్వర్ణ, ఎమ్పీడీవో వెంకటేశ్వరరావు, సర్పంచ్ సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో వండరే!

ప్రణాళికతో చదివితే

- అధ్యయనంతోనే ఉత్తమ ఫలితాలు
- సబ్జెక్ట్ నిపుణుల దిశానిర్దేశం

ఇంటర్.. కెరీర్ క్రాస్‌రోడ్స్‌లో కీలకమైన దశ. ఇంటర్‌లో సాధించిన మార్కులు భవిష్యత్‌లో ఉన్నత విద్య, ఉద్యోగసాధనలో కీలకంగా మారతాయి. ఇంటర్‌లో ప్రతిభ చూపితేనే విద్యార్థి జీవితంలో సరికొత్త మార్పు వస్తుంది. ఉన్నత చదువులకు భీజం పడుతుంది. అందుకే విద్యార్థులు ఇంటర్‌లో టాప్ స్కోర్ సొంతం చేసుకునేందుకు పుస్తకాలతో కుస్తీ పడుతుంటారు. ఇప్పటికే ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్‌ను కూడా ప్రకటించింది. పరీక్షలు సమీపిస్తుండటంతో సమయం వృథా చేయకుండా విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఉన్న తక్కువ సమయంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు పరీక్షల్లో టాప్ మార్కులు ఎలా సాధించాలన్న దానిపై సబ్జెక్ట్ నిపుణుల సూచనలివి.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



ఆంగ్లం.. ఎంతో సులభం



ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ను ఒక క్రమపద్ధతిలో చదివితే వంద శాతం మార్కులు సొంతం చేసుకోవచ్చు. మూడు సెక్షన్ లలో ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రథమ సంవత్సరం సెక్షన్ ఏలో ప్రోస్, పొయిట్రీ, అనొటేషన్‌కు 16 మార్కులకు, పేరాగ్రాఫ్ ప్రశ్నలు 16 మార్కులకు, ఎక్స్‌టెన్సివ్ రీడింగ్‌కు 8 మార్కులు కలిపి 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్-బీలోని టెక్స్టువల్‌లో సాధన చేసి 10 మార్కులకు జవాబులు రాయాలి. ప్రధానమైన సీ సెక్షన్‌లో ఉన్న 50 మార్కుల ప్రశ్నలే కీలకం. వీటిని విద్యార్థికి ప్రారంభం నుంచి పరీక్షలు వచ్చే వరకు ఏ ప్రశ్నలు ఎలా చదవాలో తెలియ చేయడంతోపాటు క్రమపద్ధతిలో వారిని సంసిద్ధులను చేస్తాము. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో కూడా మూడు సెక్షన్‌లుగా ప్రశ్నపత్రలు ఉంటాయి. వీటిలో కూడా వందశాతం మార్కులు ఎలా సాధించాలన్న దానిపై విద్యార్థులను సన్నద్ధం చేస్తాము. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా పాఠ్యపుస్తకాలను చదవడంతోపాటు పాత ప్రశ్నపత్రాలను ఖచ్చితంగా పరిశీలించుకుంటే సులభంగా అనుకున్న లక్ష్యాన్ని చేధించవచ్చు.

- ఎ.శ్రీహర్ష వర్ధన్, ఇంగ్లీష్ సీనియర్ అధ్యాపకుడు

గణితం అంటే భయం వద్దు



గణితం అంటే తొలుత భయం వీడాలి. గణితంపై శ్రద్ధ పెడితే ఎక్కువ మార్కులు సులభంగా పొందవచ్చు. ప్రతిరోజూ నిద్రలేవగానే 15 నిమిషాల పాటు ఫార్ములాలు చదవడంతోపాటు గుర్తు పెట్టుకోవాలి. దినచర్యలో ఇది ఒక భాగం కావాలి. వందశాతం మార్కులు పొందాలంటే ప్రతి చాప్టర్‌లో ప్రశ్నలను ఖచ్చితంగా రెండుసార్లు సాధన చేయాలి. పరీక్షల సమయంలో తొలుత మొదటి సెక్షన్‌లోని 7 మార్కుల ప్రశ్నలకు, అనంతరం 4 మార్కులకు, చివరన 2 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రతి ప్రశ్నలో చవరగా ముగింపును చక్కగారాసి పెన్సిల్‌తో అండర్ లైన్ చేస్తే మంచి మార్కులు పొందవచ్చు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయన్న అవగాహన ఏర్పడుతుంది. వీటి ప్రకారం ఆయా చాప్టర్‌లపై ఎక్కువ సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు ఉంటాయి. పేపర్-ఏలో మాట్రిక్స్, మేథమేటికల్ ఇండక్షన్, థియరీస్ ఇన్ ఫంక్షన్స్, ట్రాన్స్‌ఫర్మేషన్, ట్రిగ్నామీటర్స్, ఆల్‌జీబ్రాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. అలాగే పేపర్-బీలో స్ట్రెయిల్ లైన్స్, పెయిర్ లైన్స్, డైరెక్షన్ అండ్ రేషియోస్, లిమిట్స్ కంట్యూనిటీ, ట్రిగ్నామీటర్ తదితర చాప్టర్స్‌పై దృష్టి పెడితే మంచి మార్కులు పొందవచ్చు.

- బి.పెంచలరావు, సీనియర్ అధ్యాపకులు, గణితశాస్త్ర నిపుణులు

జంతుశాస్త్రంలో సాధన అవసరం



జంతుశాస్త్రంలో ఖచ్చితమైన సాధన చేస్తే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. తొలుత 8 మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. 60 మార్కులు రావాలంటే తప్పనిసరిగా 2 మార్కుల ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. ప్రధానంగా దంతం నిలువుకోత, శ్వాస వ్యవస్థ రుగ్మతలు, గుండె నిర్మాణం, గుండె పనిచేసే విధానం, ఎర్రని-తెల్లని కండరాలు, కీలు నిర్మాణం, కార్పస్ కెల్లోజం, సహానుభూత నాడీ వ్యవస్థ, వెన్నుపాము అడ్డుకోత, ఆడిసన్స్ వ్యాధి, కుషింగ్స్ సిండ్రోమ్, పిట్యూటరీ గ్రంధి స్రావకాలు, మానవ పురుష ప్రత్యుత్పత్తి వ్యవస్థ, స్త్రీ ప్రత్యుత్పత్తి వ్యవస్థలు చాలా ముఖ్యమైన అంశాలుగా చదవాలి. అలాగే బహుళ యుగ్మ వికల్పాలు, లింగ నిర్ధారణ, జెనిక్ బ్యాలెన్స్ సిద్ధాంతం, జన్యుభారం, నాలుగు సజీవసేతువులు, నిర్మాణసామ్య, క్రియాసామ్య అవయవాలు, ఉత్పరివర్తన సిద్ధాంతం, డార్వినిజం, లేయర్స్ బ్రాయిలర్స్ వాక్సిన్ పదము, ఎంఆర్ఐ స్కానింగ్, కాన్సర్ కణాలు, ఈసీటీ లాంటికి ఎంతో ముఖ్యమైన అంశాలుగా పరిగణించి వాటిలో సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చు.

- ఎన్.చంద్రశేఖర్, సీనియర్ అధ్యాపకుడు

రసాయనశాస్త్రంలో మంచి మార్కులకు..



రసాయనశాస్త్రంలో మూడు ప్రత్యేక భాగాలుగా ప్రశ్నలుంటాయి. 2 మార్కులు, 4 మార్కులు, 8 మార్కులుగా ఉంటాయి. వీటిని క్రమ పద్ధతిలో చదువుకోవాలి. పరమాను నిర్మాణం, ఆవర్తన పట్టిక, రసాయన బంధం, పర్యావరణశాస్త్రం, స్టాయికోమెట్రి, వాయుస్థితి, కర్బన రసాయనశాస్త్రం కీలక అంశాలుగా గుర్తించి సాధన చేయాలి. గత ప్రశ్నపత్రాలను కూడా పరిశీలించాలి. పరీక్షల సమయంలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరీక్షలకు సన్నద్ధం కావాలి.

- ఎస్.బాలాజీ బాబు, సీనియర్ అధ్యాపకులు

ప్రణాళికతో వృక్షశాస్త్రంలో విజయం

విద్యార్థులు ప్రణాళికతో చదివితే వృక్షశాస్త్రంలో విజయాలు సాధించవచ్చు. సబ్జెక్ట్‌లోని అన్ని చాప్టర్స్‌ను విభాగాలుగా విభజించి ప్రతిభాగానికి నిర్దిష్టంగా వ్యవధిని కేటాయించుకోవాలి. ప్రశ్నపత్రంలో మూడు భాగాలు ఉంటాయి. సెక్షన్-ఏలో 2 మార్కుల చొప్పున పది ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్-బీలో ఇచ్చే 8 ప్రశ్నల్లో ఆరు ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒక్కో జవాబుకు 4 మార్కులు చొప్పున కేటాయిస్తారు. సెక్షన్-సీలో ఉండే మూడు ప్రశ్నల్లో రెండు ప్రశ్నలకు జవాబులు రాయాలి. ఒక్కో ప్రశ్నకు 8 మార్కులు కేటాయిస్తారు. ఈ సబ్జెక్ట్‌లో ప్రత్యేకంగా డయాగ్రమ్‌ను నీట్‌గా ప్రజెంట్ చేయాలి. సమయ పాలన పాటిస్తూ ఇచ్చిన సమయాన్ని సరైన రీతిలో సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులు సన్నద్ధం కావాలి. 60కు 60 మార్కులు తెచ్చుకోవాలంటే 2 మార్కుల ప్రశ్నలే కీలకం. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దు. అధ్యాపకుల సూచనలు పాటిస్తూ వారిచ్చిన ప్రశ్నలను చదివితే పూర్తిమార్కులు పొందవచ్చు.



- బి.కొండయ్య, వృక్షశాస్త్రం సబ్జెక్ట్ నిపుణులు

సంస్కృతంలో వంద శాతం మార్కులు సాధించవచ్చు



ఇంటర్‌లో వందశాతం మార్కులు సంస్కృతం సబ్జెక్ట్‌తోనే సాధ్యమవుతాయి. జూనియర్, సీనియర్ ఇంటర్‌లో బోర్డు కేటాయించిన కొన్ని ప్రశ్నలకు తెలుగు, ఇంగ్లీష్‌లో జవాబులు రాసే వెసులు బాటు ఉంది. మిగిలిన అన్ని ప్రశ్నలకు సంస్కృతంలోనే జవాబులు రాయాలి. అలాగే వ్యాకరణాంశాలకు సంబంధించిన ప్రశ్నలన్నింటికీ ముందు సమాధానం రాసి చివర్లో వ్యాస రూప సమాధానాలు రాస్తే సమయం బాగా కలిసి వస్తుంది. వ్యాసరూప సమాధానాలు రాసే సమయంలో మధ్యలో సంస్కృత వ్యాఖ్యలు, సంధులు రాసేసమయంలో సంధిసూత్రాలు రాస్తే మంచి ఫలితాలు పొందవచ్చు.

- సముద్రాల రాధాకృష్ణ, అధ్యాపకుడు

భౌతికశాస్త్రంలో అవగాహనతోనే మార్కులు



ఇంటర్‌లో భౌతికశాస్త్రం ఎంతో కీలకమైనది. నిపుణుల సహకారంతో సరైన మార్గంలో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో మొత్తం సిలబస్‌ను మూడు భాగాలుగా విభజించి ఒక్కో భాగం నుంచి 8 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఈ ప్రశ్నకు లింక్ ప్రాబ్లం కూడా ఇచ్చే అవకాశం ఉన్నందున టెక్స్ట్ బుక్ చివరన ఉన్న ప్రాబ్లమ్స్ నేర్చుకోవాలి. పరీక్ష రాసే సమయంలో ప్రశ్నపత్రాన్ని కనీసం 5 నిమిషాలు చదవాలి. ప్రశ్నపత్రంలోని మూడు విభాగాల్లో వీఎస్ఏకు 35 నిమిషాలు, ఎస్ఏకు 80 నిమిషాలు, ఎల్ఏకు 45 నిమిషాల చొప్పున సమయం కేటాయించుకోవాలి. అలాగే ప్రశ్నలను ఎన్నుకునే సమయంలో తొలుత ప్రాబ్లం ఉన్న ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. థియరీ ఉన్న ప్రశ్నలను చివరగా ఎంపిక చేసుకుని సమాధానాలు రాస్తే మంచి మార్కులు వస్తాయి. ముఖ్యంగా డయాగ్రమ్‌ను పెన్సిల్‌తో వేసి అందులో భాగాలను గుర్తించాలి. 60కి 60 మార్కులు పొందడానికి 2 మార్కుల ప్రశ్నలే కీలకం. కనీస మార్కులు పొందడానికి 8 మార్కుల ప్రశ్నలే ముఖ్యం. పాఠ్యపుస్తం చివరన ఉన్న 2 మార్కుల ప్రశ్నలను చదవడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చు.

- జె.శివశంకర్, భౌతికశాస్త్ర నిపుణులు



విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న అధ్యాపకులు

ఏపీ స్టార్స్‌లో టెండర్లకు ఆహ్వానం

నెల్లూరు (క్రైం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టార్స్‌లో జైళ్ల శాఖ సిబ్బందికి శిక్షణ సందర్భంగా వారికి భోజన సదుపాయం కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామని ఏపీ స్టార్స్ ప్రధానాచార్యులు ఎస్ రాజారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు రూ.20,23,500 విలువైన భోజన కాంట్రాక్టుకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మార్చి 3వ తేదీ వరకు టెండరు ఫారాలు తీసుకోవచ్చన్నారు. ఫారం ధర రూ.100, జీఎస్టీ రూ.12 కలిపి మొత్తం రూ.112 చెల్లించి పొందవచ్చన్నారు. మార్చి 4వ తేదీ మధ్యాహ్నం 1 గంట వరకు సీల్డ్ కవర్లు స్వీకరిస్తారని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు టెండరు కవర్లు తెరుస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు మూలాపేటలోని ఏపీ స్టార్స్‌లో సంప్రదించాలని కోరారు.

ఉలవపాడు మామిడికి భౌగోళిక గుర్తింపునకు కృషి

- కేవీకే హెడ్ ప్రసాద్‌బాబు
- జిల్లాస్థాయి మామిడి రైతులతో సెమినార్

కందుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఉలవపాడు మామిడికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (భౌగోళిక గుర్తింపు) ధ్రువీకరణ పత్రం పొందేందుకు కృషివిజ్ఞాన కేంద్రం కృషి చేస్తున్నట్లు కందుకూరు కేవీకే హెడ్ డాక్టరు జీ.ప్రసాద్‌బాబు తెలిపారు. స్థానిక కేవీకేలో జిల్లా ఉద్యానవనశాఖ అధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మామిడి రైతులకు శిక్షణ, జిల్లాస్థాయి సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడారు. ఉలవపాడు మామిడికి పేరుప్రఖ్యాతలు, డిమాండ్ ఉన్నా భౌగోళిక గుర్తింపు లేక విదేశీ ఎగుమతులు లేక రైతులు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. ఉలవపాడు మామిడి రైతుసంఘం ద్వారా గుర్తింపు కోసం దరఖాస్తు చేయిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ఎగుమతులు వస్తే రైతుకు నికర ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో రాజాపేట ఉద్యాన పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జీ.శ్రీధర్, జిల్లా ఉదాన్య శాఖ అధికారి సుబ్బారెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, సంగమిత్ర, ప్రాథమిక మిషన్ ప్రాజెక్టు మేనేజరు అరుణ్‌కుమార్‌రెడ్డి, కందుకూరు ఉద్యానాధికారి బి.జ్యోతి, జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉద్యాన అధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖాధికారి సుబ్బారెడ్డి, పక్కన శాస్త్రవేత్తలు

జడ్పీలో స్థాయీ సంఘ సమావేశాలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిం చారు. చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈవో విద్యారమ పాల్గొన్నారు. గృహ నిర్మాణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరా, జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటు, విద్యుత్ సరఫరాలో మెరుగుదల, సహకార, రిజిస్ట్రేషన్ శాఖ పై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వ్యవసాయ శాఖ, మైక్రో ఇరిగేషన్, విద్యా, వైద్యం, ఐసీడీఎస్ అధికారులతో సభ్యులు చర్చించి లోపాలను సవరించాలని సూచించారు. మరిన్ని శాఖలపైనా చర్చ సాగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉప చైర్మన్, జడ్పీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈవో విద్యారమ

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శుక్రవారం రాత్రి అంకురార్పణ పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా గణపతి పూజ, మృత్సంగ్రహణం, సకల దేవతల ఆవాహనం, అంకురార్పణ జరిగాయి. ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి, ఫెస్టివల్ అధికారి, సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం 8గంటలకు ధ్వజారోహణం, రాత్రి 7గంటలకు సింహవాహన సేవ జరుగుతాయి.

ఒకటోసారి.. రెండోసారి..

- మాలకొండ షాపుల వేలం రెండోసారి కూడా వాయిదా!

వలేటివారిపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండలో ఆలయ అధికారులు శుక్రవారం (రెండోసారి) నిర్వహించిన బహిరంగ వేలంలో కొన్ని వ్యాపారాల నిర్వహణ వేలం కూడా వాయిదా పడ్డాయి. మాలకొండ కల్యాణ మండపంలో పర్యవేక్షణాధికారి బైరాగిచౌదరి పర్యవేక్షణలో షాపులకు బహిరంగ వేలం చేపట్టారు. ఇందులో తలనీలాల వేలం మాత్రమే సీల్డ్ టెండర్ ద్వారా పూర్తయింది. మిగిలిన 11షాపుల్లో 3షాపులకు మాత్రమే వేలం పాడారు. మిగిలిన 8షాపుల నిర్వహణకు సరైన పాట రానందున ఆలయ అధికారులు ఈ నెల 28వ తేదీకి వేలంను వాయిదా వేశారు. కొండపైన బొమ్మల అంగడి-1 వేలంను మాలకొండకు చెందిన కామినేని శివయ్య రూ.5లక్షలు, బొమ్మల అంగడి-2 షాపును మాలకొండకు చెందిన కామినేని మాధవరావు రూ.4లక్షలు, కొండపైన ఫలహారశాల అంగడిని మాలకొండకు చెందిన వంకదారి కొండయ్య రూ.10.30 లక్షలకు పాడి వేలంలో షాపులను దక్కించుకున్నారు. మిగిలిన కొబ్బరి చిప్పలు, పాలు నెయ్యి, టోల్‌గేట్, అమ్మవారికి చీరలు, జాకెట్ సమర్పించు పాట, కొబ్బరికాయలు అమ్ముకునే అంగడి, ఫొటోలు, పూజాద్రవ్యములు, కూల్‌డ్రింక్స్, పాదరక్షలు వేలంకు పాటదారులు డిపాజిట్ చెల్లించకపోవడం, ఒకట్రెండు పాటలకు ఒకరిద్దరూ డిపాజిట్లు చెల్లించినా సరైన పాటలు రానందున ఆలయ అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు, పర్యవేక్షణాధికారి బైరాగిచౌదరి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణపై నిర్లక్ష్యం వీడాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసియేషన్ సభ్యులు



వినతిపత్రం ఇస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు, నాయకులు

కందుకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణపై నిర్లక్ష్యం చేస్తున్న వరికుంటపాడు తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ అసోసి యేషన్ సభ్యులు శుక్రవారం కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడారు. వరికుంటపాడు మండలంలోని అగ్రిగోల్డ్ భూముల్లో ఉన్న ఎర్రచందనం, జామాయిల్ చెట్లను కొందరు అక్రమా ర్కులు నరికి అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారమంతా తెలిసి కూడా రెవెన్యూ, పోలీ సు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పీ. మాలకొండయ్య అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగకపోతే ఈనెల 24న జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ. సురేష్‌బాబు, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తిరుపతి రావు, అసోసియేషన్ ప్రతినిధులు బోయపాటి శ్రీను, దుర్గాప్రసాద్, మాధవరావు, శ్రీనివాసరావు, బీ. సుబ్బారావు, వెంకటేశ్వర్లు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగిస్తాం

లింగసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఆర్.పాలెం పంచాయతీలోని కండేవారిబీడు సర్వే నంబరు 275లోని ప్రభుత్వ భూముల్లోని ఆక్రమణ లను తొలగించేందుకు చర్య లు తీసుకుం టామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం. రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆంధ్ర జ్యోతిలో అసైన్డ్ ల్యాండా... ఆక్రమిద్దాం శీర్షిక తో వచ్చిన వార్తకు రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ ఎస్.సీతా మహా లక్ష్మి ఆదేశాల మేరకు ఆర్ఐ రమణయ్య, మొగిలిచెర్ల గ్రామ సచివాలయ వీఆర్‌ఓ వినోద్, సర్వేయరు వెంకటేష్‌లు ఈ భూము లను పరిశీలించి సాగుచేసిన పొగాకు, మినుము పంటలపై అరా తీశారు. ఈ సందర్భంగా ఆర్ఐ రమణయ్య మాట్లాడారు. భూముల ఆక్రమణలు వాస్తవమే అన్నారు. ఆక్రమణదారులందరికీ నోటీసులిచ్చి తొలగించేం దుకు చర్యలు తీసు కుంటామని చెప్పారు. వారి వెంట వీఆర్ఏ సీహెచ్.నరసింహం ఉన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

'విశిష్ట' నమోదు కోసం

రైతుల అవస్థలు



సచివాలయంలో పడిగాపులు కాస్తున్న రైతులు

లింగసముద్రం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తిమ్మారెడ్డిపాలెం సచివాలయంలో రెగ్యులర్ గ్రామ వ్యవసాయ సహాయకుడు గత కొన్నేళ్ల నుంచి లేడు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మాలకొండరాయుని పాలెం సచివాలయానికి చెందిన వీఏఏ శ్రీహరిని తిమ్మారెడ్డిపాలెం సచివాలయానికి ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం వ్యవసాయ అధికారులు రైతులకు సంక్షేమ పథకాలు అందాలంటే గ్రామ సచివాలయాల్లో విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలని తప్పనిసరి అని చెబుతున్నారు. దీంతో గ్రామ రైతులు ఈ సంఖ్యను నమోదు చేసుకునేందుకు గ్రామంలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇతర గ్రామాల్లోని సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు. తిమ్మారెడ్డిపాలెం, గంగపాలెం గ్రామాలకు చెందిన రైతులు మాలకొండరాయునిపాలెం సచివాల యానికి 3 కి.మీ దూరంలో వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు రైతులు వాహనాల్లో వెళుతుండగా, మరికొందరు నడిచి వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎలాగోలా సచివాలయానికి చేరినా అక్కడ రైతులు రద్దీతో పాటు.. ఒక్కోసారి సర్వర్ రాక పోతుండడంతో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని శుక్రవారం పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తిమ్మారెడ్డిపాలెం సచివాలయానికి రెగ్యులర్ వీఏఏను నియమించి రైతులను ఆదుకోవాలని రైతులు ఎం.బాలు ఇంకా పలువురు కోరుతున్నారు.

నేడు సంగంలో ఇద్దరు మంత్రుల పర్యటన

● ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు, టీడీపీ నేతలు



మంత్రుల పర్యటనపై నాయకులతో చర్చిస్తున్న అధికారులు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఈమేరకు వారు పీఏసీఎస్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్థానిక పీఏసీఎస్ ప్రాంగణంలో ఎన్‌డీసీసీబి రూ. 20.5 లక్షల రుణంతో నిర్మించిన గోడౌన్, కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తారని, అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని ముఖాముఖి కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. అదేవిధంగా కలిగిరి రహదారిలో కొరిమెర్ల వద్ద ఉన్న రైస్‌మిల్లును పరిశీలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఆనం పీఏ ఆష్రఫ్, డిప్యూటీ కోఆపరేటివ్ అధికారి యలమందలరావు, పీఏసీఎస్ కార్యదర్శి దస్తగిరి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రైస్ మిల్లు పరిశీలన

కాగా, మంత్రుల పర్యటనలో భాగంగా రైస్ మిల్లును పరిశీలించనుండడంతో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ అర్జునరావు శనివారం సంగంలోని రైస్ మిల్లును పరిశీలించారు. అనంతరం ఆయన రైస్ మిల్లు యజమానికి పలు సూచనలు, సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఆ శాఖ సిబ్బంది, టీడీపీ నాయకులు ఉన్నారు.

ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించిన రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి



జువ్వలదిన్నె గ్రామస్థులతో మాట్లాడుతున్న ఆర్పీ సిసోడియా

బిట్రగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం జువ్వలదిన్నెలోని ఫిషింగ్ హార్బర్‌ను శుక్రవారం సాయంత్రం ఏపీ రెవెన్యూ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆర్పీ సిసోడియా పరిశీలించారు. అనంతరం స్థానికంగా ఉన్న తుఫాన్ షెల్టర్ వద్ద స్థానిక పెద్దలు, గ్రామప్రజలతో కాసేపు ముచ్చటించారు. సముద్ర చేపల వేటకు చిన్నబోట్లతో వెళ్లేందుకు తరచూ మరమ్మతులు తలెత్తే అవకాశం ఉందని గంగపుత్రులు తెలిపారు. పెద్ద మరపడవలు మంజూరైతే జీవనోపాధి మెరుగుపడుతుందని చెప్పారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. స్థానిక రెవెన్యూ సమస్యలు ఏమైనా ఉంటే భూ రీసర్వే ద్వారా పరిష్కరించుకోవచన్నారు. కార్యక్రమంలో జేసీ కార్తీక్, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, మండల తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రమణ్యం, రెవిన్యూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రైతులకు యూనిక్ నెంబరు తప్పనిసరి

ఏఎస్ పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ యూనిక్ నెంబరు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రజని తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ రైతులు ఆధార్ కార్డు, ఒన్‌బి, పాసుపుస్తకం, ఆధార్ లింక్ ఫోన్ నెంబరుతో రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకుని యూనిక్ నెంబరు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రాయితీలు, పథకాలు పొందడానికి ఈ నెంబరు తప్పనిసరి అని తెలిపారు.

●అల్లూరు : కేంద్రం ప్రవేశపెట్టిన రైతు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే అన్నదాత సుఖీభవ పథకంతో పాటు వ్యవసాయశాఖ చేపట్టే పథకాలు అందవని మండల వ్యవసాయాధికారి సీహెచ్.వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో అధికారికంగా రబీ సీజన్‌లో 19348 ఎకరాలకు ఈ-పంట నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేవలం 2,505 మంది మాత్రమే ఈ- కేవైసీ చేసుకున్నారని మిగిలిన రైతులు చేయించుకోలేదన్నారు. రైతు రిజిస్ట్రేషన్ ఖచ్చితంగా పొందాలన్నారు.

గిట్టుబాటు ధర కోసం నేడు రైతుల ఆందోళన

గుడ్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఆధ్వర్యంలో శనివారం కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంటెనపల్లి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో రైతులకు పిలుపునిచ్చారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని ముంబయి రహదారిపై గురువారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు... ఉత్తరప్రదేశ్‌కు చెందిన కొంతమంది యువకులు జీవనోపాధి నిమిత్తం నెల్లూరు వచ్చి జనార్ధన్‌రెడ్డి కాలనీలో ఓ ఇంటిలో అద్దెకు ఉంటూ మోటారుసైకిల్‌పై చుట్టుపక్కల పల్లెల్లో పానీపూరి అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో అఖిలేష్ అనే యువకుడు సంగం మండలంలో పానీపూరి అమ్ముకుని తిరిగి వెళ్తూ తనతో వచ్చిన యువకుడి కోసం సంగం- ముంబయి రహదారి కూడలి సమీపంలో ఉన్న బస్‌షెల్టర్ వద్ద వాహనం నిలిపి ఎదురుచూస్తున్నాడు. ఇంతలో సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి మోపెడ్‌ను ఢీకొంది. దీంతో అఖిలేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ట్రాక్టర్‌ను వెంబడించి డ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అప్పుడు డ్రైవర్ మద్యంమత్తులో ఉన్నాడు. ఎస్‌ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన అఖిలేష్‌ను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జికి దక్షిణం వైపున దిగువ మార్గంలోని రైలు పట్టాలపై శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసుల వివరాల మేరకు పట్టాలపై పడి ఉన్న వ్యక్తి వయసు 35-40ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెంది ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడు బులుగు, పచ్చ, తెలుపు రంగు నిలువు గీతల పొడవు చేతుల చొక్కా, పచ్చరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ ఎస్‌ఐ రమాదేవి తెలిపారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపుపై ఫిర్యాదు

కలువాయి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం నుంచి పెద్దఎత్తున అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు శుక్రవారం తహసీల్దారుకు పెన్నబద్వేలి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. యంత్రాలతో కొండను తవ్వి భారీ వాహనాలతో గ్రావెల్ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, గ్రావెల్ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈవిషయాన్ని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి కూడా గ్రామస్థులు తీసుకువెళ్లారు.

తెలుగు తల్లికి వందనాలు



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): తెలుగుతల్లికి పూజలు చేస్తున్న ఉపాధ్యాయ బృందం

ఆత్మకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం తెలుగుభారతి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షుడు సోమవరపు సుబ్బరాయుడు, సహాధ్యక్షుడు కొల్లి వెంకటేశ్వర్లు, ప్రతినిధులు, ఎస్ యానాదిరెడ్డి, ఎస్‌వి చలమయ్య, కెవి శేషారెడ్డి, వి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని బిజ్జంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాతృభాష దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో-2 శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. మండలంలోని జీ.చెర్లోపల్లి, వడ్డిపాళెం పాఠశాలలను తనిఖీచేసి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించడంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ నాయ బ్, లక్ష్మీకాంతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : స్థానిక ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. తెలుగు పద్యాలు, సూక్తులను చార్టుల ద్వారా ప్రదర్శించారు. ప్రధానోపాధ్యాయుడు డీ వీరభద్రయ్య, తెలుగు ఉపాధ్యాయిని కె సుభద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●అనంతసాగరం: మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులకు పద్య, కవిత వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థినులు ఒకే వర్ణం కలిగిన ఓణీలు ధరించి నృత్యం చేశారు.

●కందుకూరు : ఓగూరు సిద్దార్థ ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత తెలుగు పండితుడు వేదాంతం భాస్కరమూర్తి మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్వహించిన పద్యపోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామారావు, తెలుగు ఉపాధ్యాయుడు ఇనకొల్లు మస్తానయ్య, హెచ్‌ఎం గడ్డం బాబూరావు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



సంగం: ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగల్లులో ఉన్న కామాక్షిదేవి సమేత భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని పుర స్కరించుకుని అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగబడ్డారు. ఈ ఉత్సావాలు 28వ తేదీ వరకు జరగనున్నాయి. కామాక్షిదేవి, భీమేశ్వరస్వామి రోజుకో వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. అందులో భాగంగా రాత్రికి శేష వాహనం, 22న హంస వాహనం, 23న సింహ వాహనం, 24న రావణసేవ, 25న నందిసేవ, 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని కల్యాణ మహోత్సవం, లింగోదర్భవ అభిషేకములు, 27న గిన్నెభిక్ష, ధ్వజావరోహణము, 28న శేషవాహన గ్రామోత్సవం, ఏకాంతసేవతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

●కావలిటౌన్ : స్థానిక పాతూరులోని రుద్రపాద క్షేత్రంలోని దుర్గా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు (కుంభమాస తిరునాళ్ల) శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శివాలయ వంశ పారంపర్య ప్రధాన అర్చకులు శశి గురుకుల్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాలు మార్చి 2వ తేదీన ముగియనున్నాయి. ఉదయం వాస్తుహోమం, వాస్తుబలి విశేష అభిషేకార్చనలు పూజలు సాయంత్రం ధ్వజారోహణం చేపట్టారు. రాత్రి మల్లన్నకు శేషసేవలతో నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో శ్రీభూమిక నృత్యకళా నిలయంకు చెందిన చిన్నారులు కూచిపూడి, భరతనాట్యంతో అలరించారు.

రాయితీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు



అల్లూరు : దరఖాస్తులు పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు, కమిషనర్ ఉమామహేశ్వరరావు

సంగం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ, కాపు, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సంగం స్టేట్ బ్యాంక్ పరిధిలోని సంగం, పెరమన, కోలగట్ల, వీర్లగుడిపాడు గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూలకు స్టేట్ బ్యాంక్ మేనేజర్‌తోపాటు మండల, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

●సీతారామపురం : మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీసీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 యూనిట్లకు 247 మంది దరఖాస్తు చేసుకోగా, హాజరైన 95 మంది ధృవీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డీ భార్గవి, కెనరా బ్యాంక్ మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ పాల్గొన్నారు.

●అల్లూరు : బీసీ, ఈబీసీ, ఈడబ్ల్యూసీ సామాజిక వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు ప్రభుత్వ సబ్సిడీ రుణాల మంజూరుకు సంబంధించిన ఇంటర్వ్యూను శుక్రవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అన్ని బాంకుల మేనేజర్లు పాల్గొని 145 మంది లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సచివాలయం-1 ఇన్‌చార్జి కార్యదర్శి వరప్రసాద్ పాల్గొన్నారు.

కావలిలో 24న ఇంటర్వ్యూలు

కావలి రూరల్: బీసీ, కాపు కార్పొరేషన్ రుణాల దరఖాస్తు దారులకు ఈనెల 24న ఎమ్పీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎమ్పీడీవో శ్రీదేవి శుక్రవారం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రుణాల కోసం 600మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. లబ్ధిదారులందరూ రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన

ఉదయగిరి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు కె వెంకటసుబ్బయ్య, క్షయవ్యాధి నివారణ అధికారి భోగ్యం వెంకటేశ్వర్లు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, దగ్గు ఉంటే వైద్యశాలలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ వ్యాధులకు దూరంగా ఉండా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయుడు శివరామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. శుక్రవారం ఆయన జమీన్‌ఉప్పలపాడు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పల్ శ్రీవెంకటేశ్వర్, నలదలపూరు హైస్కూల్ హెచ్‌ఎం బీరకాయల మాధవరావు ప్రత్యేకాధికారి గోవర్ధిని పాల్గొన్నారు.

పీ-4 సర్వేలో సమగ్ర సమాచారం సేకరించాలి



సర్వేను పరిశీలిస్తున్న ఉప గణాంకాధికారి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 సర్వే సక్రమంగా నిర్వహించాలని కందుకూరు డివిజన్ ఉప గణాంకాధికారి కె శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం వరికుంటపాడు సచివాలయ పరిధిలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఇంటింటినీ సందర్శించి ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, ఏఎస్‌వో భక్తవత్సలంపాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు తప్పక చేయించుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీ

కావలి టౌన్ ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయిం చుకోవాలని నెల్లూరు రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మీ తెలిపారు. శుక్రవారం జెబీ నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్తేర్ బ్యూలా అధ్యక్షతన నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. క్యాన్సర్‌ను ప్రాథమికదశలో గుర్తిస్తే దానిని నివారించవచ్చు అన్నారు. మొదటి, రెండో దశలో ఎలాంటి నొప్పి ఇబ్బంది ఉండదని మూడు, నాలుగు దశల్లో నొప్పి ఇబ్బంది ఉంటుందన్నారు. జంక్ ఫుడ్స్, మరలా కాగిన నూనెలతో వండిన వంటలు, కృత్రిమ రంగులతో తయారు చేసిన పదార్థాలు తినేటపుడు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిన్న వయసులో ఉండే వారు క్యాన్సర్ వ్యాక్సిన్ గడువు ప్రకారం వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేబీ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి పాల్గొన్నారు.

మొద్దు నిద్ర వీడేనా..చెత్త తొలగేనా!?

● కార్పొరేషన్‌లో పారిశుధ్య విభాగంపై విమర్శలు

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని పారిశుధ్య పరిస్థితిపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కమిషనర్ సూర్యతేజ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన రెండు, మూడు నెలలుగా మంత్రి నారాయణ నగరంలో పర్యటిస్తున్న సమయంలో పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. అయినా మార్పు కనిపించలేదు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దోమల నివారణకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తూనే, మీరు చేయలేకపోతే నేనే రోడ్డు మీదకు వస్తానంటూ హెచ్చరించారు. అయినా పద్ధతి మారలేదు. ఇటీవల కమిషనర్ సూర్యతేజ నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ పారిశుధ్య నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వస్తున్నారు. 'మీకు ఎన్నిసార్లు చెప్పాలి?' అంటూ హెచ్చరిస్తున్నా మార్పు రాలేదు. ఇక నాలుగు రోజుల క్రితం కార్పొరేషన్‌లో సమీక్ష నిర్వహించిన మంత్రి నారాయణ.. పారిశుధ్య విభాగం పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇష్టం లేకపోతే వెళ్లిపోండి.. ఇలాగైతే కుదరదు.. అంటూ హెచ్చరించే స్థాయికి పరిస్థితులు దిగజారాయి. ఎలాగైనా నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కీలకమైన పారిశుధ్య నిర్వహణ బాధ్యతలను ఏడీసీకు అప్పగిస్తున్నట్లు ప్రకటించడంలో సీరియస్‌నెస్‌ను అర్థం చేసుకోవచ్చు.

● విపరీతంగా దోమల బెడద

నెల్లూరును స్మార్ట్‌సిటీగా మార్చే క్రమంలో డస్ట్‌బిన్ ఫ్రీ సిటీగా ప్రకటించారు. గతంలో వీధుల్లో ఉన్న చెత్త కుండీలను తొలగించారు. వాటి స్థానంలో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్తను విడివిడిగా వేసుకునేందుకు డస్ట్‌బిన్‌లు అందించారు. ఈ చెత్తను ఏ రోజుకారోజు ఇంటింటికి వెళ్లి సేకరించేందుకు వాహనాలను కూడా కొనుగోలు చేశారు. ఇందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. అయితే సకాలంలో ఈ చెత్త సేకరణ జరగడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఉదయాన్నే వాహనాలు వస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో మధ్యాహ్న సమయంలో ఇళ్ల వద్దకు వస్తున్నాయి. అప్పటికే ఉద్యోగాలు, కూలీ పనులకు వెళ్లిపోయిన వారికి చెత్త వేసేందుకు వీల్లేకుండా పోతోంది. ఇటువంటి వారంతా ఇళ్లలో చెత్తను పెట్టుకొని కంపు భరించలేక రోడ్లపై పడేస్తున్నారు. ఇలా రోడ్లపైనే పడేసిన చెత్తను తొలగించడంలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోంది. అలానే ప్రధాన కాలువలతోపాటు వీధుల్లోని కాలువల్లో సిల్ట్ పేరుకుపోయి మురుగు కదలడం లేదు. ఈ కాలువలు దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలు కూడా ఇందుకు జతకలుస్తుండటంతో నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉంది. అయితే ఈ దోమలను నివారించేందుకు అవసరం మేర ఆయిల్ బాల్స్ వదలడం, ఫాగింగ్ సరిగ్గా చేయకపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి, ఎమ్మెల్యే, కమిషనర్ నగర పర్యటనకు వెళ్లినప్పుడు ప్రజల నుంచి ఈ సమస్యలే ఎక్కువగా వస్తుండటంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం నిర్వహించే ఐవీఆర్ఎస్ సర్వేలో కూడా ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో త్వరలోనే నగరంలో మార్పు రావాలని మంత్రి ఆదేశించారు. మరి ఇకనైనా పారిశుధ్య విభాగం గాడిన పడుతుందా? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● రామ సిద్ధార్థ, ఫైర్ ఆఫీసర్



కావలి రూరల్, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని అగ్ని ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటామని కావలి అగ్నిమాపక శాఖ కేంద్ర అధికారి జి.రామ సిద్ధార్థ తెలిపారు.

?ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.

! వైద్యశాలలు, పెట్రోల్ బంక్‌లు, విద్యాసంస్థలతో పాటు రైతులకు అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నాం. అగ్నిమాపక పరికరాలు ఉన్నాయా, లేవా తనిఖీ చేస్తూ పరికరాల వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం.

? కార్యాలయ నూతన భవనం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారా.

! అగ్నిమాపక కేంద్రం భవనాలు 69 సంవత్సరాల కిందట నిర్మించినవి కావటంతో వర్షాలకు నీరు ఒడుస్తున్నాయి. రూ.2కోట్లతో నూతన భవనం, ఫైర్ ఇంజన్ వాహనానికి ప్రత్యేక గ్యారేజీ ఏర్పాటు, తదితర ఇతర అవసరాల కోసం ఉన్నతాధికారులకు నివేదించాం.

? రెస్క్యూ పరికరాలు ఉన్నాయా.

! కొన్ని పరికరాలు ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో అధునాతన పరికరాల కొనుగోలుకు నివేదికలు సిద్ధంచేశాం. ఉన్నతాధికారులకు పంపి వాటి నుంచి నిధులు మంజూరైన వెంటనే ఆ పరికరాలను కొనుగోలు చేస్తాం.

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

బిట్రగుంట, ఫిబ్రవరి 21. (ఆంధ్రజ్యోతి): కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పనులు ఊపందుకున్నాయి. స్వామి ఆలయానికి వేళ్లే ప్రధాన ముఖద్వారానికి రావి చిన్నరంగయ్య యాదవ్ కొత్తరంగులను వేయించారు. శుక్రవారం ముస్తాబైన ముఖద్వారం వద్ద విజయ్‌కుమార్, చిన్నపెంచలయ్య, పెద్ద రంగయ్యలు దిష్టితీత కార్యక్రమం చేపట్టారు.

రూ.300 వేతనం కల్పించాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఉపాధికూలీలకు దినసరి వేతనం రూ.300 వేతనం కల్పించేలా పని చేయించాలని ఉపాధిహామీ ఏపీడీ బాబూరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఏపీడీ బాబూరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఓ కే. టీ ఉమామహేష్, ఈసీ వంశీకృష్ణ, టీఏలు మాలకొండయ్య, ప్రసాద్, అశోక్, నాగార్జున, చినమాల కొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ఉలవపాడు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కరేడు కేజీబీవీ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి అద్దాలు పంపిణీ చేసినట్లు కరేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత కంటి వైద్యనిపుణులు మురళీకృష్ణ రెడ్డి, కరేడు పీహెచ్‌సీ వైద్యులు రమ్యజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు, సీహెచ్‌వోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్‌డే వారోత్సవాలు ప్రారంభం

కావలిటౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం సైన్స్‌డే వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా జేవీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ శివకుమార్, ఖాదర్ బాష, సుబ్బరాయశర్మ, శారద, రమణయ్య, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాలేజి వార్షికోత్సవం

బిట్రగుంట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం తిప్పలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంఈవోలు నరసింహారావు, జయమ్మలతో పాటు టీడీపీ మండలకన్వీనర్ ఎం.నాగేశ్వరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పలు పాఠశాల హెచ్‌ఎంలు హాజరయ్యారు.

● దగదర్తి, (బిట్రగుంట) : విద్యార్థులు ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయని టీడీపీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలో ఆయన పాల్గొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పేపల కృష్ణ, వడ్డే వినయ్, గోపాల్, నాగూర్, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు ఉన్నారు.

వీఎంసీ మాజీ చైర్మన్‌కు పరామర్శ

వింజమూరు : పట్టణంలోని వెంగమాంబ నగర్‌లో ఉంటున్న మాజీ వీఎంసీ చైర్మన్ దంతులూరు వెంకటేశ్వరరావును ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు పరామర్శించారు. అనారోగ్యంతో ఉన్న దంతులూరిని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.